అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 2-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 133 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు + (వెబ్‌లో సోపతి) | వెల : 8.00

నిరంతర అధ్యయనశీలి కొరటాల..



వివరాలు 9లో





మహారాష్ట్రలో ఘోరం జరిగింది. బుల్దానా జిల్లాలో సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులతో వెళ్తున్న బస్సులో మంటలు చెలరేగి 25 మంది సజీవ దహనమయ్యారు. 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. శనివారం వేకువ జామున జరిగిన ఈ దారుణ ఘటన అందరినీ తీవ్ర షాక్‌కు గురి చేసింది. ఈ ఘటనపై భారత ప్రధాని మోడీ, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిండేలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నిద్రలోనే..

బస్సులో మంటలు చెలరేగి 25 మంది సజీవ దహనం

8 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

- బుల్దానాలోని సమృద్ధి మహామార్గ్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘటన
- ప్రధాని,మహారాష్ట్ర సీఎం దిగ్భ్రాంతి

మహారాష్ట్రలో ఘోరం...

ముంబయి : పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ప్రయాణికులతో ఒక ప్రయివేటు బస్సు నాగ్‌పూర్ నుంచి పూణేకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. రాత్రి భోజన విరామం కోసమని యావత్మల్‌లో బస్సును ఆపారు. అటు తర్వాత అక్కడ నుంచి శనివారం వేకువజామున బస్సు బయలుదేరింది. బస్సు ఉదయం 1.30 గంటలకు నాగ్‌పూర్ నుంచి 134 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింద్‌ఖేడ్‌రాజా దగ్గరలోని పింపల్‌ఖుతా గ్రామానికి చేరుకున్నది. అయితే ఆ సమయంలో బస్సు టైరు పేలి డివైడర్‌ను ఢీకొన్నది. బస్సు కుడివైపునకు పడిపోయింది. ఇది కాస్తా బస్సులో మంటలు చెలరేగటానికి కారణమైంది.అప్పటి వరకు గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులకు.. బస్సు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొనటంతో ఏం జరుగుతున్నదో అర్థంకాని పరిస్థితిలోకి వెళ్లారు. మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. 25 మంది మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు బస్సు అద్దాలను పగులగొట్టి ప్రమాదం నుంచి తమ ప్రాణాలను రక్షించుకున్నారు. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 33 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను బుల్దానా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్టు అక్కడి అధికారులు తెలిపారు. గాయపడినవారిలో బస్సు డ్రైవర్, క్లీనర్ కూడా ఉన్నారు. బస్సు అద్దాలను పగలగొట్టి తాము ప్రమాదం నుంచి బయటపడినట్టు ఆ ఇద్దరు వెల్లడించారు.

ప్రమాదాలకు అడ్డాగా సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే

నాగ్‌పూర్-మహారాష్ట్ర సమృద్ధి మహామార్గ్ ఫేజ్-1ను ప్రధాని మోడీ గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించారు. దేశంలోని పొడవైన ఎక్స్‌ప్రెస్‌వేగా ఇది పరిగణించబడుతున్నది. అయితే, ఈ దారిపై నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకోవటం ఆందోళన కలిగిస్తున్న ది. ప్రస్తుత ప్రమాద ఘటనపై విచారాన్ని వ్యక్తం చేసిన ఎన్సీపీ అధినేత శరద్ పవార్.. ప్రమాదాల నివారణ కోసం ప్రయివేటు వాహనాల స్పీడ్ లిమిట్‌ను తగ్గించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకో వాలని ఆయన సూచించారు. గతేడాది డిసెంబర్ 11 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 మధ్య సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై 358 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాద ఘటనల్లో 143 మందికి తీవ్ర గాయాలు కాగా, 236 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

దర్యాప్తునకు మహారాష్ట్ర సీఎం ఆదేశం

ఈ ఘటనపై మహారాష్ట్ర సీఎం దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తు జరుపుతున్నామని బుల్దానా ఎస్పీ వెల్లడించారు. బస్సు డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్నామనీ, ఆయనను అరెస్టు చేసే ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. ఈ ఘటనపై మోడీ, ఏక్‌నాథ్ శిండేలు విచారం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ప్రధాని కూడా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు.

మృతులకు కేసీఆర్ సంతాపం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్రలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో చిక్కుకుని బస్సులో ప్రయాణిస్తున్న పలువురు మరణించడం, పట్ల బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు దిగ్భ్రాంతికి గురయ్యారు. శనివారం ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

తెలంగాణ డయాగ్నస్టిక్స్‌లో మరో

134 వైద్య పరీక్షలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

- వర్చువల్‌గా టీ డయాగ్నస్టిక్స్ సెంటర్స్ ప్రారంభం



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్‌లో మరో 134 వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన టీ డయాగ్నస్టిక్స్ హబ్‌ను రంగారెడ్డి జిల్లా కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో గల జిల్లా ప్రభుత్వ దవాఖాన నుంచి వర్చువల్‌గా మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో...9లో

ప్రతి మురుగునీటి చుక్కనూ

శుద్ధి చేస్తాం

మంత్రి కేటీఆర్..కోకాపేటలో ఎస్టీపీ ప్రారంభం



వివరాలు 9లో

నేడు ఖమ్మంలో

కాంగ్రెస్ తెలంగాణ జనగర్జన

హాజరుకానున్న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి

- మాజీ ఎంపీ పొంగులేటి సహా 50 మంది చేరిక
- నేటితో సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర ముగింపు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఖమ్మంలో ఆదివారం నిర్వహించతలపెట్టిన తెలంగాణ జన గర్జన సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరికతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేసిన పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ మీటింగ్ జరుగుతోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలు హాజరుకానున్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు ఈ మీటింగ్‌ను శంఖారావంగా భావిస్తుండటంతో భారీఎత్తున జనసమీకరణకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఆర్ గార్డెన్స్ వెనుక ఉన్న 100 ఎకరాల స్థలంలో మీటింగ్ జరగనుండగా, పక్కనే ఉన్న మరో 50 ఎకరాల్లో పార్కింగ్‌కు కేటాయించారు. లక్ష మంది కూర్చునేలా కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని, జనవరిలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభను మించి మీటింగ్‌ను సక్సెస్ చేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రాహుల్ గాంధీ వస్తున్నందున నేషనల్ మీడియా కూడా కవర్ చేసే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. ఈ సభకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించేందుకు అధికార పార్టీ ప్రయత్నం చేస్తోందని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పొంగులేటి అనుచరుల్లో ఇద్దరిని చంపుతామని హెచ్చరిస్తూ వెలువడిన పోస్టర్ కలకలం సృష్టించింది. దీనిని బీఆర్ఎస్ నేతలు ఖండించారు. సిపి విష్ణు ఎస్ వారియర్ సైతం దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ జనగర్జన సభ...9లో

మతతత్వ అజెండా

యూసీసీపై విజయన్



తిరువనంతపురం : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యతిరేకించారు. దానిని మతతత్వ అజెండాగా అభివర్ణించారు. దేశంలోని సాంస్కృతిక భిన్నత్వాన్ని నాశనం చేసే ఉద్దేశంతోనే ఒకే దేశం-ఒకే సంస్కృతి అనే మతతత్వ అజెండాను అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. యూసీసీపై ఆకస్మికంగా చర్చకు తెర లేపడం బీజేపీ ఎన్నికల అజెండాలో భాగమేనని ఆయన తెలిపారు. యూసీసీని అమలు ...9లో

23 రోజులు, 17 సిట్టింగ్‌లు

20 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ మేరకు ఆయన శనివారం ట్విట్టర్ ద్వారా పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో సత్ఫలితాలు ఇచ్చే చర్చలు జరగడానికి కృషి చేయాలని అన్ని పార్టీలను కోరారు. ఈ సమావేశాలు ఆగస్టు 11 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలు 23 రోజుల పాటు సాగుతుందని, 17 సిట్టింగ్‌లు ఉంటాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఎంపి జైరాం రమేశ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు నిరంతరం లేవనెత్తుతున్న ప్రజలకు ఆందోళన కలిగించే అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం అనుమతినిస్తుందని ఆశిస్తున్నామని, వాటిపై ప్రధాని మౌనం పాటిస్తున్నారని అన్నారు. వర్షాకాల సమావేశాలు పాత పార్లమెంట్ భవనంలో ప్రారంభమవుతాయని, తరువాత కొత్త భవనానికి తరలించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మే 28న నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించిన ...9లో

గ్రూప్-4 ప్రశాంతం

80 శాతం మంది అభ్యర్థుల హాజరు

- పేపర్-1కు 7.62 లక్షలు, పేపర్-2కు 7.61 లక్షల మంది
- రంగారెడ్డిలో సెల్‌ఫోన్‌తో పట్టుబడిన ఓ అభ్యర్థి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రాతపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-4కు రాష్ట్రవ్యాప్తంగా 9,51,205 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన వారిలో 9,12,380 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. శనివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన ...2లో

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

అక్రమ కేసులను ఎత్తేయాలి


- నిర్బంధ వ్యతిరేక వేదిక రౌండ్ టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ- బంజారాహిల్స్

ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని నిర్బంధ వ్యతిరేక వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్బంధ వ్యతిరేక వేదిక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు వి.ప్రవీణ్, టీజేఎస్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరామ్, వీసీకే జీలకర్ర శ్రీనివాసరావు, ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రొఫెసర్ పద్మశాస, ప్రొఫెసర్ ఖాతను మాదినేని విద్యహే, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రొఫెసర్ అన్వర్ అలీ ఖాన్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పీడబ్ల్యూ సంధ్య, అనురాధ, పుష్ప, స్వరూప, కన్యం గడ్డం రవి, ఎం.రాఘవచారి, కె.రవీందర్, టీవీఎస్ కోటా శ్రీనివాస్ గౌడ్, డీడీఎం రాజు, విరగం పాణి, తదితరులు ...2లో

దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉంది



- మోడీ హయాంలో అన్నిరంగాల్లో సంక్షోభం
- రాజకీయ,ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ 2లో..

ఈ నెలలో

సాధారణ వర్షపాతం

తెలంగాణలో జూన్‌లో

50శాతం లోటు : ఐఎండీ అంచనా



న్యూఢిల్లీ : పసిఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో వృద్ధి చెందుతోందని, ఆ కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తీపి కబురు చెప్పింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. జూన్ నెల మొదటి అర్థభాగంలో వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ ద్వితీయార్థంలో పరిస్థితి మెరుగుపడింది. దీర్ఘకాలిక సగటులో 94-106శాతం మధ్యలో వర్షపాతం నమోదైతే దానిని సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. ఈ నెలలో దీర్ఘకాల సగటులో 100-106శాతం వర్షపాతం నమోదయ్యే ...9లో

చికెన్ ధరలు

హైదరాబాద్

వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



ఫారం రేటు	రూ. 133
రిటైల్ (లైవ్)	రూ. 155
స్కిన్‌తో	రూ. 225
స్కిన్‌లెస్	రూ. 256

మొన్న సిద్ధిఖీ... నిన్న ఒబామా

- అమెరికాలో వినిపిస్తున్న నిరసన గళాలు
- వాస్తవాలు గ్రహిస్తున్న ప్రజానీకం

వాషింగ్టన్ : ప్రపంచంలోని రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాల మధ్య ఉన్న సామీప్యతను గురించి ప్రధాని నరేంద్ర మోడీ తన అమెరికా పర్యటన సందర్భంగా ప్రతినిధి సభలో ప్రస్తావించారు. ఆయన ప్రసంగం విని అమెరికా కాంగ్రెస్ సభ్యులు కరతాళ ధ్వనులు చేశారు. మోడీని గొప్ప రాజనీతిజ్ఞుడంటూ పొగడ్తలతో ముంచెత్తారు. అయితే ఆ దేశ ప్రజలకు ఇప్పుడిప్పుడే మోడీ అంటే ఏమిటో తెలిసొస్తోంది. మోడీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే మాజీ అధ్యక్షుడు బరక్ ఒబామా సీఎన్‌ఎన్‌కు చెందిన క్రిస్టియన్ అమన్‌పూర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'అధ్యక్షుడు జో బైడెన్ భారత ప్రధాని మోడీతో సమావేశమైనప్పుడు అక్కడి ముస్లిం మైనారిటీల రక్షణకు ఆయన తీసుకుంటున్న చర్యలేమిటో అడిగి ఉండాల్సింది' అని అన్నారు. బరక్ వ్యాఖ్యలు అమెరికాలో కలకలం రేపాయి. మరో సంఘటనను గురించి కూడా ప్రస్తావించాలి. తొమ్మిది సంవత్సరాల పాటు పాత్రికేయులకు ముఖం చాటేసిన మోడీకి అమెరికాలో విలేకరుల సమావేశాన్ని ఎదుర్కోక తప్పలేదు. అయితే ఆయనకు జర్నలిస్ట్ సబ్రినా సిద్ధిఖీ నుండి ఊహించని ప్రశ్న ఎదురైంది. ముస్లింలపై వివక్ష ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో భారత్‌ను ప్రజాస్వామిక దేశమని ఎలా అంటామని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నను భారతీయ పాత్రికేయులెవ్వరూ మోడీని అడగలేదు. వాస్తవానికి వారికి ఆ అవకాశం కూడా రాలేదు. సిద్ధిఖీ అడిగిన ప్రశ్నకు మోడీ బదులిస్తూ తమ దేశంలో వివక్ష అనే పదానికి తావే లేదని చెప్పారు. ఒబామా వ్యాఖ్యలు, సిద్ధికీ ప్రశ్నతో బీజేపీ నేతలు గంగవెర్రులెత్తి పోయారు. సిద్ధిఖీకి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరిగింది. అమెరికా అధ్యక్ష భవనం కూడా ఈ ట్రోలింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది ఆమోదయోగ్యం కాదని తెలిపింది. ఇక ఒబామా వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు.

ఒబామా మన దేశంలో పర్యటించినప్పుడు మోడీ ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఒబామాను తన స్నేహితుడంటూ కొనియాడారు. ఇప్పుడేమో మోడీ కేబినెట్‌లోని మంత్రులు ఆయనపై విమర్శలు సంధిస్తున్నారు. ఒబామా పేరు మధ్యలో ఉన్న ముస్లిం పదాలను ప్రస్తావించడం మాత్రం మరచిపోవడం లేదు. విదేశీ పర్యటన నుండి స్వదేశానికి చేరుకున్న మోడీ తన ముసుగును తొలగించారు. ఈ సంవత్సరం చివరలో ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అంశాన్ని లేవనెత్తారు. కర్నాటకను కోల్పోయిన బీజేపీ, మరో రాష్ట్రాన్ని చేజార్చుకోవడానికి సిద్ధంగా లేదు. అందుకే మతపరమైన ఏకీకరణ ద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోంది. అణచివేతలు, హింస, మైనారిటీలపై దాడులు, మీడియా స్వేచ్ఛపై దాడి వంటి అంశాలపై ప్రశ్నలకు మోడీ అమెరికాలో సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పర్యటనకు ముందు పలువురు మీడియా వ్యాఖ్యాతలు చెప్పుకొచ్చారు. ఇదంతా బైడెన్ ప్రభుత్వానికి తెలియనిదేమీ కాదు. అయితే దాని కారణాలు దానికి ఉన్నాయి. అందుకే మోడీకి ఎర్ర తివాచీ స్వాగతం పలికింది. సిద్ధిఖీపై ట్రోలింగ్‌ను తప్పుపట్టిన బైడెన్ ప్రభుత్వం, తమ మాజీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై మాత్రం నోరు మెదపలేదు.

మద్దతు నిరాకరణపై దేశవ్యాప్త ఉద్యమం

20న చెరకు రైతుల ఆందోళన : ఎఐఎస్‌ఎఫ్‌ఎఫ్ పిలుపు

న్యూఢిల్లీ : చెరకుకు మద్దతుధర (ఎఫ్‌ఆర్‌పీ)ను 2023-24 సంవత్సరానికి క్వింటాల్‌కు కేవలం రూ.10 (టన్నుకు రూ.100) చొప్పున పెంచుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యను అఖిల భారత కిసాన్ సభ అనుబంధ సంస్థ అయిన అఖిల భారత చెరకు రైతుల సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్‌ఎఫ్) తీవ్రంగా ఖండించింది. రైతన్నలకు ముష్టి వేసినట్టు రూ.10 పెంచడమేంటని ప్రశ్నించింది. రైతులను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని ఎఐఎస్‌ఎఫ్‌ఎఫ్ పిలుపునిచ్చింది. జులై 20వ తేదీన దేశవ్యాప్త నిరసన దినంగా పాటిస్తూ, చెరకు మిల్లుల ముందు , కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా ఆందోళనలు చేపట్టాల్సిందిగా అన్ని రాష్ట్రాలకు పిలుపునిచ్చింది.

ప్రాథమికంగా 10.25 శాతం చక్కెర రికవరీ గల చెరకుకు గత ఐదేండ్లలో మద్దతు ధర క్వింటాల్‌కు కేవలం రూ.40 మాత్రమే పెరిగి రూ.275 నుండి రూ.315కి చేరుకుందని పేర్కొంది. స్వామినాథన్ ఫార్ములా సిటు ప్లస్ 50 శాతం ప్రాతిపదికగా 9.5 శాతం చక్కెర రికవరీ వద్ద క్వింటాల్‌కు కనీసం రూ.500 చొప్పున టన్నుకు రూ.5 వేలుగా, చెరకుకు ప్రోత్సాహక ధరను నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆకాశన్నంటేలా ఉపకరణాల ధరలు పెరిగిన కారణంగా ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతోందని, కానీ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోలేదని చెరకు రైతుల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవీంద్రన్, ఎస్.కె.శుక్లా విమర్శించారు.

రాష్ట్రాల సిటు వ్యయ అంచనాల సగటు పరిగణనలోకి తీసుకుంటే దానికి 50శాతం కలిపితే క్వింటాల్‌కు రూ.438.75 అవుతోంది. కానీ ప్రభుత్వం ప్రకటించింది క్వింటాల్‌కు రూ.315 అంటే రైతు ఒక్కో క్వింటాల్‌కు రూ.123.5 మేర నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు.

కానీ ప్రభుత్వం క్వింటాల్‌కు సగటు ఎటు ప్లస్ ఎఫ్ఎల్ వ్యయాన్ని ఉత్పత్తి వ్యయంగా పరిగణించిందని అన్నారు. ఇటువంటి మోసపూరితమైన, దారుణమైన లెక్కలు వేసి చూపిస్తూ ఉత్పత్తి వ్యయం కన్నా 50శాతం ఎక్కువ ఇస్తున్నామని ప్రభుత్వం చెప్పడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. ప్రతి రాష్ట్రంలోనూ చెరకు రైతులు పెద్ద మొత్తంలో నష్టాల పాలవుతున్నారని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు. చెరకునుండి చక్కెరను తయారుచేసే క్రమంలో వచ్చే ఉప ఉత్పత్తులపై వచ్చే లాభాల్లో కూడా తమకు వాటా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికే దేశవ్యాప్తంగా వందలాది చెరకు మిల్లులు మూతపడ్డాయని, పైగా రైతులు చక్కెర మిల్లులకు సరఫరా చేసిన చెరకుకు రావాల్సిన బకాయిలు పెద్ద మొత్తంలో వున్నాయని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో చెరకు రైతులు తీవ్ర దుస్థితులన ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, చెరకు మద్దతు ధరను సవరించి, క్వింటాల్‌కు రూ.500 చొప్పున ఇవ్వాలని చెరకు రైతుల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. ఉప ఉత్పత్తుల నుండి వచ్చే లాభాల్లో వాటా ఇవ్వాలని కోరింది. ఎరియర్లను వెంటన చెల్లించాలని, మూత పడిన మిల్లులను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, సహకార రంగాల్లోని చెరకు మిల్లులను ప్రయివేటీకరించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉంది

మోడీ హయాంలో అన్ని రంగాల్లో సంక్షోభం

- రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



భారతదేశం అత్యంత క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కొంటున్నదనీ, ప్రధాని నరేంద్రమోడీ హయాంలో అన్ని రంగాల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తలెత్తిందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. స్వాతంత్ర్యోద్యమంతో సంబంధం లేనివారు, ఇప్పుడు దేశభక్తులుగా ప్రచారం పొందుతున్నారనీ, ఇంతకంటే దౌర్భాగ్యం ఏముందని ప్రశ్నించారు. ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ) ఆధ్వర్యంలో శనివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో 'సంక్షోభంలో మన గణతంత్రం - విశ్లేషణ' అనే అంశంపై ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం 23 శాతం పెరిగినా కేంద్రంలోని ప్రభుత్వం తనకు ఏమాత్రం సంబంధం లేదన్నట్టే వ్యవహరిస్తున్నదని ఆక్షేపించారు.

యువతరం కూడా తమ హక్కులు, ఉపాధి, భవిష్యత్ గురించి ఆలోచించకుండా 'హిందుత్వ' పేరుతో మతం చుట్టూ తిరగడం అత్యంత ప్రమాదకర పరిణామమని విశ్లేషించారు. మతం అనేది స్లో పాయిజన్‌లాగా ప్రజల్లోకి ఎక్కించబడిందనీ, దీనికి విరుగుడును రాజకీయపార్టీలు సాధించలేవని అభిప్రాయపడ్డారు. పౌరసమాజం, జర్నలిస్టులు, విశ్వవిద్యాలయాలు, మేథావులు, అభ్యుదయవాదులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వల్లే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కర్నాటక ఎన్నికల్లో బీజేపీ ఓడిపోలేదనీ, దాని ఓట్‌బ్యాంక్ ఇప్పటికీ అంతే పటిష్టంగా ఉన్నదని ఉదహరించారు. ప్రజల్లోని మతం అనే భావజాలాన్ని నిర్మూలించే ప్రయత్నం జరక్కపోతే, దేశాన్ని విచ్ఛిన్నం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిరుద్యోగం, ధరల పెరుగుదల ఇప్పుడే అధికంగా ఉన్నదని చెప్పారు. ఇప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ 2019 నాటికే చేరుకోలేక పోతున్నదనీ, అయినా దేశ ప్రధాని ఇది తనకు సంబంధించిన విషయం కాదన్నట్టే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థవల్ల దేశంలో ఎంతమంది ఆత్మహత్య చేసుకున్నారు... ఎంతమంది వలస కార్మికులు చనిపోయారనే లెక్కలు కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయా అని ప్రశ్నించారు. దేశంలో 25శాతం జనాభా పౌష్టికాహారం లేక బలహీనమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌లో చైనా చొరబడినా, శవాలు గంగా నదిలో తేలినా, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా, నిరుద్యోగం తాండవిల్లుతున్నా... ఇవేమీ పట్టించుకోకుండా మతం మత్తులో తూగుతున్నామనీ, ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రమాదకర భావజాలం పెరిగిపోతున్నదని హెచ్చరించారు. భారతదేశాన్ని ఇంకో పాకిస్థాన్ చేయాలంటే... గాంధీ, నెహ్రూ, పటేల్‌కు రెండు నిమిషాలు పట్టేదికాదనీ, వారు కోరుకున్న భారతదేశం ఇది కాదని స్పష్టం చేశారు. కార్యక్రమానికి 'మెఫీ' చైర్మెన్ కే శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్ వందన సమర్పణ చేశారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. సభలు, సమావేశాలు జరగనీయకపోవడం, మంత్రులు, ముఖ్యమంత్రి వివిధ జిల్లాలకు వెళ్లినప్పుడు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించడం, వారి నివాసాలను టార్గెట్ చేసి దాడులు చేయడం, ప్రభుత్వ సంస్థలను వినియోగించి రైడ్‌లు చేయడం వంటి కార్యకలాపాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ప్రశ్నించడమే ప్రజాస్వామిక విధానంలో ప్రజాసంఘాల నాయకులు, సామాజికవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు, న్యాయవాదులు, జర్నలిస్టుల తప్పైపోతుందన్నారు. టీఎస్పీపీఏ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ఉపాను ఎత్తేయాలని సుప్రీంకోర్టు స్వయంగా సూచించినా అమలుకు నోచుకోలేదన్నారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామిక చైతన్యాన్ని అణచివేసే పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామిక నిర్బంధం ఎంత తీవ్రమో ప్రభుత్వం నమోదు చేసిన కేసులు, ఎఫ్‌ఐఆర్‌ను పరిశీలిస్తే నివ్వెరపోతారన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు పోలీస్ స్టేషన్‌లో 59 మంది, వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో 120 మంది, తాడ్వాయిలో 152 మంది, భద్రాద్రి కొత్తగూడెం చర్ల పోలీస్ స్టేషన్‌లో 24 మంది, భద్రగూడెంలో 80 మంది, లక్ష్మీదేవపల్లిలో 24 మంది, హైదరాబాద్ ఎల్బీనగర్‌లో 86 మంది, చిక్కడపల్లిలో 20మంది, జోగులాంబ గద్వాల జిల్లాలో 37 మందిపై ఇష్టానుసారంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా రాజ్యాంగ ఉల్లంఘనను చేయకుండా సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఉపా చట్టాన్ని ఎత్తేయాలని కోరారు. ప్రజాస్వామిక జీవితంలో వారికున్న హక్కులను కాలరాయొద్దని సూచిస్తూ తీర్మానం చేశారు. లేదంటే గ్రామ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ తప్పిదాలను ప్రజలకు తెలియజేస్తామని హెచ్చరించారు.

గ్రూప్-4 ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

పేపర్-1కు 7,62,872 (80 శాతం) మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2కు 7,61,198 (80 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోకపోవడంతో ఆ అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. దీంతో కొందరు పరీక్ష రాయలేక నిరాశతో వెనుదిరిగారు.

కఠినంగా పేపర్-2

గ్రూప్-4 ప్రశ్నాపత్రంలో పేపర్-1 కొంత సులువుగా, పేపర్-2 కఠినంగా వచ్చినట్టు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. పేపర్-1లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, ఆర్థిక స్థితిగతులపై పలు ప్రశ్నలు వచ్చాయి. అయితే బలగం సినిమా గురించి ప్రశ్న అడగడం చర్చనీయాంశంగా మారింది. బలగం చిత్రానికి సంబంధించి క్రింది జతలతో ఏవి సరిగ్గా ఉన్నాయో జతపరచబడినవి? అంటూ అడిగారు. ఎ. దర్శకుడు : వేణు యెల్దండి, బి. నిర్మాత : దిల్‌రాజు/హన్షితారెడ్డి/హర్షిత్‌రెడ్డి సి. సంగీత దర్శకుడు : భీమ్స్ సిసిరోలియో, డి. కొమరయ్య పాత్రను పోషించిన వారు : అరుసం మధుసూదన్ అనే ప్రశ్న అడిగి సరైన సమాధానాన్ని ఎంచుకోవాలంటూ 1. ఎ, బి, సి, డి 2. ఎ, బి మరియు డి మాత్రమే 3. ఎ మరియు బి మాత్రమే 4. ఎ, బి మరియు సి మాత్రమే అని వచ్చింది. పేపర్-2లో మాత్రం రీజనింగ్, మెంటల్ ఎబిలిటీలో సుదీర్ఘ సమయం తీసుకునే ప్రశ్నలు వచ్చాయంటూ అభ్యర్థులు వాపోతున్నారు. బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులకు పేపర్-2 ప్రశ్నాపత్రం కలిసొస్తుందన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

సెల్‌ఫోన్‌తో వచ్చి పట్టుబడ్డాడు

గ్రూప్-4 పరీక్షకు ఓ అభ్యర్థి సెల్‌ఫోన్‌తో వచ్చి పట్టుబడ్డాడు. హైదరాబాద్ సరూర్ నగర్‌లోని మారుతీనగర్ సక్సెస్ కళాశాలలో పరీక్షాకేంద్రానికి ఓ అభ్యర్థి సెల్‌ఫోన్‌తో వచ్చాడు. పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ గుర్తించారు. వెంటనే అధికారులకు సమాచారం అందించి సదరు అభ్యర్థిని పోలీసులకు అప్పగించారు. ఆ ఫోన్‌ను సీజ్ చేశారు. అతనిపై మాల్ ప్రాక్టీస్ కింద పోలీసులు కేసు నమోదు చేశారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర విచారణ కోసం పోలీసులకు ఆ అభ్యర్థిని అప్పగించామని పేర్కొన్నారు. ఆ సంఘటన మినహా జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

15 నిమిషాల నిబంధన.. నష్టపోయిన అభ్యర్థులు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలో గ్రూప్-4 పరీక్షకు శాంతినగర్ కాలనీకి చెందిన అభ్యర్థి రెండు నిమిషాలు ఆలస్యంగా ఉదయం 9:47 నిమిషాలకు వచ్చారు.

పోలీసు లోపలికి అనుమతించలేదు. అలాగే, తాంసి మండలంలోని బండల్‌నాగపూర్ గ్రామానికి చెందిన అభ్యర్థి తాంసి బస్టాండ్ ప్రాంతంలోని రైల్వే గేటు పడటంతో ఆలస్యమైంది. పరీక్ష కేంద్రా నికి 15 నిమిషాలు ఆలస్యం కావడంతో పోలీసులు అనుమతించలేదు.

కొంప ముంచిన గూగుల్ మ్యాప్

చౌటుప్పల్‌లోని కృష్ణవేణి స్కూల్ సెంటర్ కోసం గూగుల్ మ్యాప్‌లో చూసుకుంటూ వచ్చిన అభ్యర్థిని పాత కృష్ణవేణి లొకేషన్ వద్దకు తీసుకెళ్లింది. దాంతో ఆందోళనకు గురైన వారు మళ్లీ సెంటర్ వద్దకు వెళ్లే సరికి నిమిషం ఆలస్యం కావడంతో అధికారులు అనుమతి నిరాకరించారు.

పరీక్ష మధ్యలో గుర్తింపు కార్డు లేదని..

చండూరు మున్సిపల్ కేంద్రంలోని మరియానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్ష రాస్తున్న నలుగురిని బయటకు పంపించారు. వారి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేకపోవడంతో అధికారులు గుర్తించి వారిని బయటకు పంపించారు.

అభ్యర్థులకు భోజనం పెట్టిన కాలనీవాసులు

ఆసిఫాబాద్-కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ బాలాజీనగర్‌లోని కేరళ ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు కాలనీవాసులు మధ్యాహ్న భోజనం పెట్టారు. ఈ పాఠశాలలో 288 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా వీరందరికీ కాలనీవాసులు వంట చేసి భోజనం వడ్డించారు. కాలనీవాసులకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఎన్‌జిఒలకు ఎస్‌బిఐ సాయం



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ మరో రెండు స్వచ్ఛంద సంస్థలకు సాయం చేసింది. 68వ బ్యాంక్ డే సందర్భంగా శనివారం కార్పొరేట్ సామాజిక సేవ (సిఎస్‌ఆర్)లో భాగంగా ఫ్రండ్స్ ఫౌండేషన్, స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ సంస్థలకు ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రాన్ మారుతి ఈకో వాహనాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిఎం ఎన్‌డబ్ల్యు-1 మంజూ శర్మ, జిఎం, ఎన్‌డబ్ల్యు-2 దేబాషిష్ మిత్రా, ఉన్నతాధికారులు విద్యా రాజా, ఎస్ పనిగ్రహి, జితేంద్ర కుమార్ శర్మ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఎస్‌బిఐ రూ.50,000 కోట్ల నికర లాభాల మార్క్‌ను చేరినందున ఉద్యోగులకు జింగ్రాన్ శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని మైలురాయిలను చేరడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

యూపీలో విద్యుత్ సంక్షోభం


- పట్టించుకోని యోగి ప్రభుత్వం
- మందిర నిర్మాణంపైనే దృష్టి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. అయితే ప్రజా సమస్యల కంటే బీజేపీకి మత రాజకీయాలే ముఖ్యమవుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు, కరెంటు కోతలు అధికమవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. వచ్చే సంవత్సరం ప్రారంభంలో అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించేందుకు సకల సన్నాహాలూ చేస్తోంది. ప్రజలకు విద్యుత్, తాగునీటి సరఫరా వంటి కనీస వసతుల కల్పనను విస్మరిస్తోంది. రాష్ట్రంలో వడగాల్పుల కారణంగా ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా ఎవరికీ పట్టడం లేదు. చిన్‌హాట్ పారిశ్రామిక ప్రాంతంలో రాత్రి 9.30 గంటల నుండి ఉదయం 4.30 గంటల వరకూ విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. రాత్రి సమయంలో కరెంటు కోత.. పగటి వేళ సూర్యుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాజధాని లక్నోలోనే కాదు... నోయిడా సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో విద్యుత్ కోతలతో రాత్రి సమయంలో గాడాంధకారం అలుముకుంటోంది. సుమారు 86శాతం కుటుంబాలలో దీపాలు వెలగడం లేదు. అయితే ఇదేమీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎలాగైనా రామ మందిరాన్ని సకాలంలో నిర్మించి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయకేతనం ఎగరేయాలని ఆ పార్టీ ఆశిస్తోంది.


గతనెల జూన్ 15, 16, 17 తేదీలలో వడగాల్పుల కారణంగా బల్లియాలో, యూపీ తూర్పు ప్రాంతాలలో కనీసం 54 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఏకే శర్మ, యూపీ పవర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎం.దేవరాజ్ మధ్య విభేదాల కారణంగా పరిస్థితి మరింత దుర్భరంగా తయారైంది. దేవరాజ్ ముఖ్యమంత్రికి సన్నిహితుడు కాగా శర్మను ప్రధాని మోడీ కేంద్రం నుండి పంపారు. శర్మను రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకోవడం యోగికి సుతరామూ ఇష్టం లేదు. పైగా ఆయన తనకు విశ్వాసపాత్రులైన అధికారులను విద్యుత్ శాఖలో నియమించుకున్నారు. ఇదిలావుంటే వేతనాల సమస్యపై రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు మార్చిలో 72 గంటల పాటు సమ్మె చేశారు. అలహాబాద్ హైకోర్ట్ ఆదేశాలతో వారు సమ్మెను విరమించారు. పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రినే ఇప్పటికీ వాడుతుండడంతో అవి ప్రస్తుత డిమాండ్‌ను ఏమాత్రం తీర్చలేకపోతున్నాయి. అదీకాక వేలాది మంది అనుభవజ్ఞులైన ఇంజినీర్లను విధుల నుండి తొలగించారు.

తీస్తా బెయిల్.. విస్తృత ధర్మాసనానికి

- ఇద్దరు జడ్జీల భిన్నాభిప్రాయంతో సుప్రీం నిర్ణయం
- అంతకుముందు తక్షణమే లొంగిపోవాలన్న గుజరాత్ హైకోర్టు
- సర్వోన్నత న్యాయస్థానంలో సెతల్వాద్ సవాల్



న్యూఢిల్లీ / అహ్మదాబాద్ : ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ బెయిల్ కోసం చేసుకున్న అప్పీలుపై సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఈ అంశంపై శనివారం విచారణ చేపట్టిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం మధ్య భిన్నాభిప్రాయాలు రావడంతో విస్తృత ధర్మాసనం ముందు విచారణకు ఉంచాల్సిందిగా కోరుతూ భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు ప్రతిపాదించారు. 2002 గుజరాత్ మారణహోమానికి సంబంధించిన కేసులో ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను శనివారం ఉదయం విచారణ చేపట్టిన గుజరాత్ హైకోర్టు ఆమె విజ్ఞాపనను తిరస్కరించింది. తక్షణమే లొంగిపోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సెతల్వాద్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సెతల్వాద్ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ధర్మాసనంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో తీస్తా విజ్ఞప్తిని విస్తృత ధర్మాసనానికి ప్రతిపాదించారు. 'తీస్తా సెతల్వాద్‌కు మధ్యంతర ఉపశమనం కల్పించే విషయంలో ఇద్దరు న్యాయమూర్తుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అందువల్ల ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి పంపాల్సిందిగా ప్రధానన్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తున్నాం' అని జస్టిస్ ఎఎస్ ఒకా, జస్టిస్ పికె మిశ్రా ధర్మాసనం ప్రకటించింది. కాగా తీస్తా బెయిల్ పిటిషన్‌పై శనివారం ఉదయం విచారణ చేపట్టిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం కురువుగా వ్యవహరించినట్లు కనిపించింది. తక్షణమే లొంగిపోవాలంటూ ఇచ్చిన ఆదేశాల అమలును వాయిదా వేయాలని తీస్తా న్యాయవాది మిహిర్ ఠాకూర్ విన్నవించినా ధర్మాసనం అందుకు తిరస్కరించింది. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసేందుకు వీలుగా తీర్పు అమలును 30 రోజుల పాటు వాయిదా వేయాలంటూ మిహిర్ అభ్యర్థించారు. ఇందుకు న్యాయస్థానం ససేమిరా అంటూ ఆ విజ్ఞప్తిని కూడా తిరస్కరించింది. గత సంవత్సరం సెప్టెంబర్‌లో తీస్తాకు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం తాత్కాలిక బెయిల్‌పై ఉన్న నిందితురాలు వెంటనే లొంగిపోవాలని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్జాన్ ఆదేశించారు. గుజరాత్ అల్లర్ల కేసుల్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రస్తుత దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహా అమాయకులైన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను, బీజేపీ నేతలను ఇరికించేందుకు తీస్తా తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కుట్ర పన్నారంటూ అహ్మదాబాద్ నేర పరిశోధన విభాగం ఆమెపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. దీనిపై తీస్తాను గత సంవత్సరం జూన్ 25న అరెస్ట్ చేశారు. ఏడు రోజుల పాటు పోలీస్ రిమాండ్‌లో ఉన్న అనంతరం తీస్తాను జూలై 2న జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. గుజరాత్ అల్లర్ల ఘటనలకు సంబంధించి నరేంద్ర మోడీ, మరికొందరికి సిట్ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ జకియా జఫ్రీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన మర్నాడే ఈ కేసులో సహ నిందితుడైన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌బీ శ్రీకుమార్‌ను కూడా అరెస్ట్ చేశారు.



ఆరోగ్యంపై అధిక వ్యయం

ఇంటి ఖర్చులో పది శాతం అటే

- 9 కోట్ల మందికి పైగా భారతీయుల పరిస్థితి
- వైద్య చికిత్సలు, సేవలు ప్రియం
- పరోక్షంగా ప్రజల ఆర్థికస్థితిపై భారం



న్యూఢిల్లీ : దేశ ప్రజలకు అందాల్సిన కనీస అవసరాల్లో వైద్యం ఒకటి. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు గడుస్తున్నది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అయితే, వైద్యం ఇప్పటికీ దేశ ప్రజలకు అందని ద్రాక్షగానే ఉన్నది. ప్రధాని మోడీ పాలనలో వైద్య చికిత్సలు, సేవలు ప్రియం అయ్యాయి. వైద్య ఖర్చులను నియంత్రించడానికి బీజేపీలోని మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవటంలో విఫలమైంది. దీంతో దేశ ప్రజలు ఆరోగ్యసంరక్షణ కోసం అధికంగా ఖర్చులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక ప్రముఖ వార్త సంస్థ నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

ఈ నివేదిక ప్రకారం.. భారత్‌లోని 9 కోట్ల మందికి పైగా ప్రజలు ఆరోగ్య సంరక్షణ కోసం అధికంగా వెచ్చిస్తున్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చులు, సేవలు ప్రజలను ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దేశంలోని అనేక కుటుంబాలు ఈ వైద్య ఖర్చులతో తీవ్రంగా ఇబ్బందుల పాలవుతున్నాయి. వారి ఇంటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం.. భారత్‌లో గణనీయమైన సంఖ్యలో ప్రజలు తాము వెచ్చించే మొత్తంలో పది శాతానికి మించి ఆరోగ్య సంరక్షణ పైనే ఖర్చు చేస్తున్నారు. మొత్తం ఇంటి ఖర్చులో 25 శాతానికి పైగా ఆరోగ్యంపై ఖర్చు చేస్తున్నవారు 3.1 కోట్ల మందికి పైగా ఉన్నారు. 2017-18 నుంచి 2022-23 మధ్య తమ ఆదాయంలో ఆరోగ్యసంరక్షణపై ఖర్చు చేస్తున్నవారి సంఖ్య పెరిగింది.

ఆరోగ్యం పైనే అధికంగా ఖర్చు చేయటం దేశంలోని అనేక ఇండ్లపై తీవ్ర ప్రభావాన్ని చూపి ఆర్థికంగా వారిని దెబ్బతీస్తుందని నివేదిక హెచ్చరించింది. మోడీ పాలనలో ఏటికేడు ఆరోగ్యసంరక్షణ భరించని స్థాయిలోకి వెళ్లిపోతున్నది. ప్రజల సంపాదనంతా ఆరోగ్యం, సంబంధిత అత్యవసరాలకే వెళ్లిపోతున్నదని విశ్లేషకులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజలు చేస్తున్న ఖర్చులో గణనీయమైన పెరుగుదల మహారాష్ట్ర, యూపీ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, ఒడిశా, తెలంగాణలో నమోదైంది. మోడీ ప్రభుత్వం దేశ ప్రజల ఆరోగ్యాన్ని మరిచి ప్రయివేటీకరణపై దృష్టి పెడుతున్నదని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు దేశంలోని ప్రజలను కష్టాల్లోకి నెడుతున్నాయని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు.

పర్మినెంట్‌కు నోచని పంచాయతీ కార్మికులు

జీవో 60 ప్రకారం జీతాలివ్వాలనే డిమాండ్

11 నెలలుగా జీతాలు పెండింగ్

- మల్టీపర్పస్ వర్కర్స్ విధానం మాకొద్దు
- 8 గంటల పనివిధానం.. పది లక్షల బీమా కావాలి
- 17 డిమాండ్లతో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్
- 6 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధం
- అవార్డుల వెనుక కార్మికుల శ్రమ.. పేరు ప్రభుత్వానికి..


(ఫైల్)

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

దుమ్ము ధూళి, మురికిలో మగ్గుతూ వారు నిత్యం ఊర్లను పరిశుభ్రం చేస్తారు.. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంచుతారు.. పని వేళలంటూ లేక పొద్దస్తం ప్రజల సేవలోనే ఉంటారు. కడుక్కునేందుకు సబ్బు లేదు. తలకు నూనెలేదు. ఒంటికి బట్టలేదు. నెలంతా పనిచేసినా జీతం రాదు. ఏండ్ల తరబడిగా పనిచేస్తున్నా పర్మినెంట్ లేదు. ఉద్యోగోన్నతి రాదు. కనీస వేతనం కాదు కదా సదుపాయాలకు కూడా నోచుకోని దుర్భర జీవితాలు గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్లవి. గ్రామాలకు అవార్డులు.. ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతులు రావడానికి శ్రమిస్తున్న వీరి కష్టానికి ఫలితం మాత్రం దక్కడం లేదు. 17 రకాల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, సిద్దిపేట జిల్లాలో 499 పంచాయతీలు, మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 5300 మంది కార్మికులు పని చేస్తున్నారు. స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్ల పేర్లతో పనిచేస్తున్నారు. వీరంతా పేద, బలహీన వర్గాలకు చెందిన వారే. మేజర్ గ్రామ పంచాయతీల్లో 10 మంది, చిన్న పంచాయతీల్లో ఇద్దరు ముగ్గురితోనే పని చేయిస్తున్నారు. రోడ్లు ఊడ్చడం, చెత్త ఎత్తడం, మోరీల్ని శుభ్రం చేయడం, మానవుల, జంతువుల మలం, కుళ్లిపోయిన వ్యర్థాలను ఎత్తివేయడం, గ్రామానికి నీళ్లు అందించడం, వీధి లైట్లు వేయడం, ఇంటి, ఆస్తి, నల్లా పన్నులు వసూలు చేయడం, గ్రామ పంచాయతీ రికార్డులు రాయడం, ఉపాధి హామీ పనుల్ని చేయించడం, హరితహారం కింద నర్సరీలు నిర్వహించడం, మొక్కల్ని రక్షించడం, ట్రాక్టర్లు నడపడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులే కాకుండా గ్రామంలో ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినా పనులన్నీ చేయాలి.

ముఖ్యంగా కరోనా సమయంలో వీరి సేవలు విలువ కట్టలేనివి. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్ల శ్రమ ఫలితంగానే తెలంగాణలోని పదుల సంఖ్యలో గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో స్వచ్ఛ అవార్డుల్ని దక్కించుకున్నాయి. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలోనూ ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికవుతున్నాయి. పేరు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి వస్తుంది తప్ప శ్రమపడుతున్న సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు దక్కట్లేదు. కరోనా కష్ట కాలంలో ఇంటింటికీ నిత్యావసరాలు అందించడం, కరోనా పేషెంట్లకు మందులిచ్చి సేవలు చేశారు. చనిపోతే అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

పెరగని జీతాలు..పెరిగిన పనిభారం

పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెరగలేదు. కానీ..! పని భారం పెరిగింది. ఎన్నో పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.8500 జీతమిస్తుంది. ఆ తర్వాత పైసా పెంచలేదు. జీవో 51 తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని తెచ్చి రకరకాల పనుల్ని ఒకే వ్యక్తితో చేయిస్తున్నారు. ఊరి పనులే కాదు ప్రభుత్వ పాఠశాలల్లోనూ పనులు చేయిస్తున్నారు. ట్రాక్టర్లు కొని వారితోనే పనిచేయిస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిన ప్రభుత్వ..ం కనీసం జీవో 60 ప్రకారం మున్సిపాలిటీల్లో ఇస్తున్న విధంగానైనా రూ.15600, రూ.19000, రూ.20000 చొప్పున పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్లకు ఇవ్వాలని జేఏసీ డిమాండ్ చేస్తుంది. ఇస్తున్న కొద్దిపాటి జీతాలు కూడా 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ 12 సంవత్సరాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త కార్మికుల్ని నియమించారు. కొత్త వారికి అందరితో పాటు వేతనాలివ్వడంలేదు. పాత వారి వేతనాల నుంచే కొత్తవారికి పంచడంతో చాలా పంచాయతీల్లో రూ.4500 కూడా చేతికందని పరిస్థితి ఉంది.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీస్‌కు స్పందించి సమస్యల్ని పరిష్కరించకపోతే ఈ నెల 6 నుంచి కార్మికులు పనులు బంద్ చేసి సమ్మెలోకి వెళ్తారు. సమ్మె పోరాటంలో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఐక్యంగా పాల్గొనాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల్ని పరిష్కరించుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే గ్రామాల్లో పనులు బంద్ చేసి ఎంపీడీఓ కార్యాలయాల ముందు టెంట్లు వేసుకుని సమ్మె చేస్తాం.

- జి.సాయిలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

వెట్టి చేయిస్తున్న ప్రభుత్వం



మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం తెచ్చి మాతో వెట్టి చేయిస్తున్నారు. అన్ని రకాల పనుల్ని చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. స్కూల్స్, ఊర్లో ఏ పనైనా మేమే చేయాలి. పొద్దస్తమానం పనిచేస్తున్నా జీతాలివ్వడం లేదు. ఎప్పుడో పెంచిన వేతనాలు.. పెరిగిన ధరలతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారింది. మురికిలో పనిచేస్తున్న వర్కర్లకు కనీసం నూనెలు, సబ్బులు కూడా ఇవ్వట్లేదు. ప్రమాదాలు జరిగి ప్రాణం కోల్పోతున్నారు. వికలాంగులవుతున్నా పట్టించుకోవడంలేదు.

- దశరథ, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు.

6 నుంచి సమ్మె బాట

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాలు రాష్ట్ర స్థాయిలో జేఏసీగా ఏర్పడ్డాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన సమస్యల్ని పరిష్కరించకపోతే ఈ నెల 6 నుంచి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశాయి. ఇప్పటికే సమ్మె నోటీస్‌ను నేతలు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు ఇచ్చారు. ప్రభుత్వం ఈ నెల 5 వరకు సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించకపోతే సమ్మె అనివార్యమని హెచ్చరించారు.



మూసీపై బ్రిడ్జిలకు త్వరలో శంకుస్థాపన

- ఆగస్టు 15న సోలార్ సైకిల్ ట్రాక్ ప్రారంభం
- త్వరలో మల్లంపేట్ వద్ద 21వ ఇంటర్‌చేంజ్
- మెహదీపట్నం స్కైవేపై ప్రధాని తీపికబురు అందించాలి : నార్సింగి ఇంటర్‌చేంజ్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి, గండిపేట

హైదరాబాద్‌లో మూసీ నదిపై బ్రిడ్జీల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి ఓఆర్ఆర్ పరిధిలో రూ.29.50 కోట్లతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నిర్మించిన ఇంటర్‌చేంజ్‌ను మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి కేటీఆర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఔటర్ చుట్టూ పెరుగుతున్న జనసాంద్రతను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మరికొన్ని ఇంటర్‌చేంజ్‌లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. నార్సింగి ఇంటర్ చేంజ్ తర్వాత త్వరలో ఔటర్‌పై 21వ ఇంటర్ చేంజ్ మల్లంపేట వద్ద అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఆగస్టు 15న సోలార్ సైకిల్ ట్రాక్ ప్రారంభం ఉంటుందన్నారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లను ఫోర్ లైన్ రోడ్లుగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, ఔటర్ సర్వీస్ రోడ్ల విస్తరణ చేపడతామని చెప్పారు. మెట్రో రైలును బీహెచ్ఈఎల్, ఫార్మాసిటీ, కందుకూరు వరకు పొడిగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు.

మూసీనది అభివృద్ధికి వినూత్న ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలో బ్రిడ్జీల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు వివరించారు. మొత్తం 14 బ్రిడ్జీలలో ఐదు బ్రిడ్జీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి అయ్యిందని తెలిపారు. మూసీపై సుమారు రూ.10వేల కోట్లతో 55 కిలోమీటర్ల మేరకు ఎక్స్‌ప్రెస్ స్కైవే నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇటీవల తన ఢిల్లీ పర్యటనలో హైదరాబాద్ పౌరుల సౌకర్యార్థం మెహదీపట్నం స్కైవాక్ నిర్మాణం కోసం అరెకరం రక్షణ శాఖ స్థలాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా తమ వినతులపై తీపికబురు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఎల్.ఎన్.రెడ్డి, డైరెక్టర్(ప్లానింగ్) బాలకృష్ణ, ఎమ్మెల్సీలు మహేందర్ రెడ్డి, శంభీపూర్ రాజు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, హెచ్‌జీసీఎల్ సీజీఎం రవీందర్, ఎస్ఇలు హుస్సేన్, పరంజ్యోతి, నార్సింగి ఇంటర్‌చేంజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ జేఎల్ఎంపై హత్యాయత్నం

- విద్యుత్ కనెక్షన్ తీసేశారని పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం
- కేసు నమోదు చేసిన గజ్వేల్ పోలీసులు

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఇంటికి కరెంట్ సరఫరా నిలిపేశారన్న కోపంతో ఓ వ్యక్తి విద్యుత్ జేఎల్ఎంపై పెట్రోల్ పోసి నిప్పంటించబోయాడు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని క్యాసారానికి చెందిన గ్రామంలో శనివారం జరిగింది. సీఐ భూమా వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో కరుణాకర్ తన ఇంటికి రెండు నెలలుగా కరెంట్ బిల్లు కట్టడం లేదు. దీంతో విద్యుత్ జేఎల్ఎం నరేష్ మీటర్ వైర్‌ను కట్ చేశారు. అయినా.. అక్రమంగా కనెక్షన్ పెట్టుకుని విద్యుత్ వాడుతున్నారన్న సమాచారంతో జేఎల్ఎం శనివారం కరుణాకర్ ఇంటికెళ్లారు. వారితో మాట్లాడి బిల్లు కట్టించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పైఅధికారుల ఆదేశాలతో విద్యుత్ స్తంభంపై సరఫరా నిలిపివేందుకు జేఎల్ఎం విద్యుత్ పోల్ ఎక్కాడు. కిందికి దిగేలోపు కరుణాకర్ తన బైక్‌లో నుంచి పెట్రోలు తీసి అధికారిపై పోసి నిప్పంటించేందుకు సిద్ధమయ్యాడు. పరిస్థితిని గమనించిన కరుణాకర్ భార్య అతని చేతిలోంచి అగ్గిపెట్టె లాక్కోవడంతో ప్రాణాపాయం తప్పింది. జేఎల్ఎం నరేష్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు గజ్వేల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కరుణాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. జేఎల్ఎం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ భూమా వీరప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు సూపర్ సేవర్ మెట్రోపాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులకు హైదరాబాద్ మెట్రో శుభవార్త చెప్పింది. విద్యార్థుల సౌకర్యార్థం సూపర్ సేవర్ స్టూడెంట్ పాస్-2023ను జులై 1 నుంచి అమల్లోకి తీసుకొస్తున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగపరుచుకోవాలన్నారు. 1998 ఏప్రిల్ 1 తర్వాత పుట్టిన విద్యార్థులు ఈ పాస్ పొందేందుకు అర్హులని, ఈ ఆఫర్ కింద విద్యార్థులు 20 ట్రిప్పులకు మాత్రమే చెల్లించి, అన్ని ఫేర్ జోన్‌లలో 30 ట్రిప్పుల వరకు ఉచితంగా ప్రయాణించొచ్చని చెప్పారు.

అయితే, విద్యార్థులు తప్పనిసరిగా కొత్త బ్రాండెడ్ స్మార్ట్ కార్డ్ కొనుగోలు చేయాలన్నారు. ఒక విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ మాత్రమే జారీ చేస్తారని, అది కొనుగోలు చేసిన తేదీ నుంచి 30 రోజుల వరకు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. ఈ ఆఫర్ జులై 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 నడుమ ఈ కింది మెట్రో స్టేషన్లలో పాస్‌లు కొనుగోలు చేయవచ్చన్నారు.

జేఎన్టీయూ కళాశాల, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, విక్టోరియా మెమోరియల్, దిల్‌సుఖ్‌నగర్, నారాయణగూడ, నాగోల్, పరేడ్ గ్రౌండ్, బేగంపేట, అమీర్‌పేట్, రాయ్‌దుర్గ్ సూపర్ సేవర్ మెట్రో పాస్‌లు కొనుగోలు చేసిన విద్యార్థులకు హైదరాబాద్ మెట్రో రైలుతో అనుసంధానం గల రిలయన్స్ ట్రెండ్, 24 సెవెన్ కన్వీనియన్స్ స్టోర్‌లు తదితర వాణిజ్య సంస్థల ద్వారా రాయితీ కూపన్‌లను కూడా పొందొచ్చని మెట్రో అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఎల్‌టీఎమ్‌ఆర్‌హెచ్‌ఎల్.ఇన్ సందర్శించగలరు. హైదరాబాద్ మెట్రోలో విద్యార్థులకు రాయితీతో కూడిన పాసులు మంజూరు ప్రకటనను ఎస్ఎఫ్ఐ స్వాగతిస్తుందని, ఈ రాయితీ పాసులు తమ పోరాట ఫలితమే అని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, కె.అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ - జమ్మికుంట

అప్పుల బాధ భరించలేక ఓ రైతు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శనివారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో 18వ గేటు వద్ద జరిగింది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన పంజాల అశోక్(40) తన ఎకరం వ్యవసాయ భూమితోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసేవాడు. వరుసగా పంట దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అప్పులు పెరిగాయి. సుమారు రూ.5లక్షల వరకు అప్పులు ఉండగా.. ఎలా తీర్చాలోనని ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య పంజాల అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపారు.

ఇండ్లు, స్థలాల కోసం పోరుబాట..



నవతెలంగాణ - కరీంనగర్

అర్హులైన వారికి ఇండ్లు, స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శనివారం మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల వేదిక బాధ్యులు గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇస్తామని, సొంత ఇంటి స్థలం ఉన్న వారికి 5లక్షలు ఇస్తామని పేదలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 9సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయడం లేదని విమర్శించారు.

కరీంనగర్ నియోజకవర్గంలో 5,729 ఇండ్లు మంజూరు కాగా, 58 మాత్రమే పూర్తి చేశారని అవి కూడా పేదలకు కేటాయించలేదని అన్నారు. ఇండ్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.10లక్షలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పేదలకు ఇవ్వకుంటే తాళాలు పగలగొట్టి ఆక్రమిస్తామని హెచ్చరించారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ అధికారికి అర్హులైన పేదలతో దరఖాస్తులు, వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం ఉపాధ్యక్షులు శీలం అశోక్, సంపత్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.భీమాసాహేబ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు యమున, లావణ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంపల్లి సాగర్, తిప్పారపు సురేష్, గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-బాసర

మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా గోదావరి నదిపై ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం ఎత్తి నీటిని కిందికి వదిలారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇరు రాష్ట్రాల ఇంజినీరింగ్ అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి సుమారు ఒక టీఎంసీ నీటిని కిందికి వదిలినట్టు ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధి కారులు తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్ చౌగలే, ఇంజినీర్ చక్ర పాణి, కె.రవి, ఎస్సారెస్పీ ఏఈ వంశీ పాల్గొన్నారు.



పోలీసు రిక్రూట్‌మెంట్‌పై తప్పుడు సమాచారం ఇచ్చేవారిపై కఠిన చర్యలు

- వారి వివరాలు ఇచ్చినవారికి రూ.3 లక్షలు రివార్డు
- ముగిసిన ఎస్సై, కానిస్టేబుల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ


నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి


(ఫైల్)

రాష్ట్రంలో సాగుతున్న ఎస్సై, కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులను మోసపుచ్చే రీతిలో తప్పుడు సమాచారం ఇచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామనీ, అలాగే ఇలాంటి వారికి సంబంధించిన సమాచారం ఇచ్చినవారికి రూ. 3 లక్షల మేరకు నగదు రివార్డును కూడా ఇస్తామని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వి.వి శ్రీనివాస్‌రావు శనివారం ప్రకటించారు. కచ్చితమైన నిబంధనల మేరకు పారదర్శకంగా ఎస్సై, కానిస్టేబుళ్ల పోస్టుల నియామక ప్రక్రియను జరుపుతున్నామనీ, అది తుది దశకు చేరుకున్నదని ఆయన తెలిపారు. తుది పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ 26 తేదీ నాటికి పూర్తయిందని ఆయన చెప్పారు. 97,175 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశామని అన్నారు. అయితే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోని అభ్యర్థులను పక్కనబెట్టామనీ, ఇందులో విద్యార్హతలు సరిగ్గా లేనివారు, నిర్దిష్ట వయోపరిమితి కంటే తక్కువ, ఎక్కువ పేర్కొన్నవారున్నారని తెలిపారు. నియామక నోటిఫికేషన్ జారీ చేసే సమయంలోనే అభ్యర్థులకు ఉండాల్సిన విద్యార్హతలు, వయోపరిమితితో పాటు ఇతర నిబంధనలను కచ్చితంగా పేర్కొనడమేగాక వాటికి సంబంధించిన పూర్తి వివరాలను పెట్టామని ఆయన స్పష్టం చేశారు. అలాగే, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైనా వివరాలను మొదట్లో తప్పుగా పేర్కొన్నవారికి వాటిని సరి చేసుకోవడానికి కూడా తుది రాతపరీక్ష అనంతరం అవకాశం ఇవ్వడం జరిగిందని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే, కొందరు కావాలని ఈ నియామక ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులను మోసపుచ్చే రీతిలో తప్పుదోవ పట్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటివారిని ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. ఈ విధంగా మోసపూరితంగా వ్యవహరించేవారి సమాచారాన్ని అందించినవారికి రూ.3 లక్షల మేరకు నగదు రివార్డును ఇస్తామని, అలాగే వారి వివరాలనూ అత్యంత గోప్యంగా ఉంచుతామని చెప్పారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని 9393711110కు కూడా సమాచారాన్ని అందజేయొచ్చని ఆయన తెలిపారు.

పోరాడితేనే ఇంటి స్థలాలు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ




నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ పెంట్లవెల్లి

తెగించి పోరాటాలు చేస్తేనే పేదలకు గుడిసె జాగాలు వస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో మహంకాళి అమ్మమిట్ట పరిధిలో పేదలు వేసుకున్న గుడిసెల జాగాలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేయగా.. శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయాయని విమర్శించారు. 20ఏండ్ల కిందట పేదల కోసం పాలకులు కేటాయించిన భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాల భూములు పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తున్న పాలకులు.. పేదలు 100 గజాల స్థలాన్ని అడిగితే ఎందుకివ్వరని ప్రశ్నించారు.

మహంకాళి అమ్మమిట్ట దగ్గర 14 ఎకరాల భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారికి పట్టాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని చెప్పారు. పెంట్లవెల్లిలో 22,27 సర్వే నెంబర్లలో 14 ఎకరాల 36 గుంటల భూమిని రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్ల స్థలాల కోసం కొన్ని ఏండ్ల కిందట కొనుగోలు చేసి నేటికీ పంచకపోవడం దుర్మార్గమన్నారు. 125 గజాల ఇంటి స్థలం ఇచ్చి.. ఇంటి నిర్మాణానికి రాష్ట్రం రూ.5లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, పెంట్లవెల్లి మండల కార్యదర్శి ఈశ్వర్, కొల్లాపూర్ మండల కార్యదర్శి శివవర్మ తదితరుల పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల గడువు 27 వరకు పొడిగింపు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈనెల 27 వరకు ప్రభుత్వం పొడిగించింది.

ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల్లోనే ప్రవేశాలు పొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఆ కాలేజీల జాబితాను పొందుపర్చామని వివరించారు.



"స్వాతంత్ర్య పోరాటంలో పత్రికలు ప్రముఖ పాత్ర పోషించాయి. నేడు మీడియా కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. అంబానీ, అదానీలను కాదని వార్తలు ప్రసారం చేసే స్థితి మీడియాకు లేదు. వాస్తవాలు వెలికితీసే మీడియా సంస్థలకు ఆదాయం రాకుండా ప్రకటనలు నిలిపివేస్తున్నారు. ఆదాయం కోసం వార్తా సంస్థలు మౌనంగా ఉంటున్నాయి. కాబట్టి మీడియా గుత్తాధిపత్యాన్ని పగలగొట్టాలి" అని ప్రముఖ పరిశోధక పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ అన్నారంటే, పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

వార్త యందు జగము వర్థిల్లుచున్నదా!

సంపాదకీయం

'వార్తయందు జగము వర్థిల్లు చున్నది' అనే వాక్యం పాతదైనప్పటికీ ఆనాటి దానర్థం ఏమైనప్పటికీ, నేడు వార్తలు తెలియకపోతే ప్రపంచంలో చైతన్యయుత పౌరులంగా మెలగలేమన్నది వాస్తవం. ఆధునిక ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో, ఏయే పరిణామాలు సంభవిస్తున్నాయో, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంకేతిక విషయాలు అర్థం చేసుకోవటానికి పత్రికలు, వార్తాచానళ్లు, మీడియా ప్రధానపాత్ర పోషిస్తాయి. అయితే ప్రపంచాన్ని, పరిణామాలను ఇవి వాస్తవంగా ప్రతిబింబిస్తున్నాయా! లేదా! అన్నది ఒక పెద్ద సమస్య. "ఏది సత్యం, ఏదసత్యం, ఓ మహాత్మా!" అని కవి పాడుకున్నట్లు మనమూ పాడుకోవాల్సిందేనా! ఇదొక సంశయాత్మక విషయం ఒకటయితే, వార్తలు అందించే సంస్థలకు, వ్యక్తులకూ సత్యాన్ని, వాస్తవాన్ని అందించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయా అనేది మరో సమస్య. ఇప్పుడిది ప్రశ్నార్థకంగా మారిన సమస్య. అందుకనే అప్పుడెప్పుడో కవి 'పెట్టుబడికి కట్టుకథకు పుట్టిన మన పత్రికలు' అని తీవ్ర ధ్వనితో తిట్టారు. తిట్టటం తేలికే కానీ బాగుచేసుకోవడం మహాకష్టం. అయితే ఇప్పటికీ ప్రజల పక్షాన నిలిచి నిబద్ధంగా వార్తలనందిస్తున్న పత్రికలూ, చానళ్లూ సంఖ్య రీత్యా తక్కువే, అయినా ఉన్నాయి. వాటి విస్తృతీ తక్కువే.

శాస్త్ర సాంకేతికత పెరిగాక ఎలక్ట్రానిక్ చానళ్లు, సోషల్ మీడియా పెద్దయెత్తున జన సామాన్యాన్ని ప్రభావితం చేసే సాధనంగా మారాయి. అందుకనే చానళ్లు అన్నీ ఇప్పుడు కార్పొరేటు శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆయా వ్యాపార వర్గాల ప్రయోజనాలకు భిన్నమైనవేవీ ఇక వార్తలుగా రావు. ప్రజలు, సమాజము అనే ప్రాధాన్యం నుండి వ్యాపారులు, వ్యాపార ప్రయోజనం అనే ప్రాధాన్యానికి మారిపోయిందనేది జగమెరిగిన సత్యం. మనదేశంలోనైతే మోడీ కార్పొరేట్ మిత్రుల ఆధీనంలోనే మీడియా అంతా చేరిపోయింది. ఒక్క అంబానీ చేతిలోనే 27 చానళ్లు ఉన్నాయి. ఆదానీ గుప్పిట్లోకి 11 చానళ్లు, సుభాష్‌చంద్ర చేతిలోకి 15 చానళ్లు చేరిపోయాయి. ఇక స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా వార్తలూ, కథనాలు, నిజాలు చెబుతాయని భావించవచ్చా!

"స్వాతంత్ర్య పోరాటంలో పత్రికలు ప్రముఖ పాత్ర పోషించాయి. నేడు మీడియా కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. అంబానీ, అదానీలను కాదని వార్తలు ప్రసారం చేసే స్థితి మీడియాకు లేదు. వాస్తవాలు వెలికితీసే మీడియా సంస్థలకు ఆదాయం రాకుండా ప్రకటనలు నిలిపివేస్తున్నారు. ఆదాయం కోసం వార్తా సంస్థలు మౌనంగా ఉంటున్నాయి. కాబట్టి మీడియా గుత్తాధిపత్యాన్ని పగలగొట్టాలి" అని ప్రముఖ పరిశోధక పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ అన్నారంటే, పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకు ముందు బాగుందని కాదుగానీ, ఈ పదేండ్లుగా మీడియాపై నియంత్రణ బాగా పెరిగిపోయింది. డైరెక్టుగానే కార్పొరేట్ సంస్థలు మీడియా సంస్థల్ని వారి చేతుల్లోకి తెచ్చేసుకున్నారు. వారి కనుసన్నల్లోనే ఏ కథనమైనా వెలువడుతుంది మరి! ఈ నియంత్రణలు, వొత్తిళ్లు భరించలేని నిజాయితీగల జర్నలిస్టులు, న్యూస్ రీడర్స్ ఒక్కొక్కరుగా సంస్థల నుండి బయటపడ్డారు. అందుకు రవీశ్‌కుమార్ ఒక ఉదాహరణ మాత్రమే.

దీని పర్యవసానంగానే స్వతంత్ర జర్నలిస్టులు నేడు ప్రజాభిప్రాయాలను, జనం సమస్యలను, కార్పొరేట్, మతోన్మాదశక్తుల కుతంత్రాలను బయటపెట్టేందుకు కృషి చేస్తున్నారు. ఇది తట్టుకోలేని ప్రభుత్వాలు, పాలకులు, ఉన్మాదులు జర్నలిస్టులపై ట్రోలింగ్‌కు తెగబడుతున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు. నిర్బంధాలకూ పూనుకుంటున్నారు. అనేక ఆటంకాలనూ కల్పిస్తున్నారు. ఇందుమూలంగానే ప్రపంచంలోని 180 దేశాలతో పోల్చినప్పుడు వరల్డ్ ప్రెస్‌ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 161కి మనదేశం పడిపోయింది. మనకంటే శ్రీలంక, పాకిస్థాన్ ప్రెస్ ఫ్రీడమ్‌లో ముందున్నాయి. ఇది అత్యంత విచారించాల్సిన విషయం. కానీ మన అధినాయకుడు మాత్రం అమెరికాలో మాత్రం దేశంలో స్వేచ్ఛా సమానత్వం వర్థిల్లుతున్నాయని, ఏరకమైన వివక్షతలూ లేవని నిఖార్సయిన అబద్ధాలను సెలవిచ్చారు. చివరకు బైడెన్‌తో పాటుగా జరిగిన ప్రెస్‌మీట్‌లో మోడీని భారత్‌లో ప్రజాస్వామ్యంపై ప్రశ్నించిన వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ సబ్రినా సిద్ధిక్‌పై కూడా ట్రోలింగ్స్ మొదలవ్వటం, దానిని వైట్‌హౌజ్ కూడా ఖండించడం చూస్తే ఎంత భయంకరంగా పరిస్థితి ఉందో అర్థమవుతుంది! మొన్న మన రాష్ట్రంలో తులసీచందుపైనా ఇలాంటి బెదిరింపులే జరిగాయి. ఇవికొన్ని మాత్రమే.

ఒకవైపు ప్రజల పట్ల వారి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేసే మీడియా, రెండోవైపు నిజాలు చెప్పే, ప్రశ్నలు సంధించే జర్నలిస్టుల పట్ల నిర్బంధం, వేధింపులు - ఇదీ నేటి వార్తా పరిస్థితి! దీని నుండి బయటపడటానికి ప్రజా సమూహాలు చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉంది. నిజాయితీగా పనిచేస్తున్న వారికి అండగా నిలిచినప్పుడే వార్తయందు జగతి వర్థిల్లుతుంది.

"ప్రభుత్వంలో కీలకమంత్రిగావున్న నిర్మలా సీతారామన్ ఇప్పుడు మాత్రం వాటన్నిటినీ గుర్తుచేస్తూ 'మా వ్యవహారాల్లో మీ జోక్యం ఏమిటని' రెచ్చిపోయారు. ఆరు ముస్లిం దేశాలపై దాడిచేసిన అమెరికా మాకు మైనార్టీల గురించి చెప్పడమేమిటని వాఖ్యలు చేశారు. అంతటితో ఆగక ప్రతిపక్షాలనూ జతచేశారు. తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టి కష్టపడుతుంటే ప్రతిపక్షాలు సరైన సమస్యలపై పోరాడలేక మాజీ అమెరికా అధ్యక్షుడితో కలసి ఈ అప్రధానమైన అంశం ఎత్తుకున్నారని వాపోయారు.

"ఒబామా అయినా సిద్దికి అయిన ప్రయివేటు వ్యక్తులుగానే మాట్లాడారు తప్ప అమెరికా తరపున కాదు. తమకు ఇబ్బంది కలిగింది గనకనే కనీస దౌత్య మర్యాదలు కూడా పాటించక ఒబామాపై విరుచుకుపడటం బీజేపీ ద్వంద్వనీతికి అద్దం పడుతోంది. కొంత కాలం కిందట బిబిసి ఆనాటి గుజరాత్ పరిస్థితిపై డాక్యుమెంటరీ ప్రసారంచేసినప్పుడు కూడా మోడీ సర్కార్ ఇలాగే దాడి చేసింది. దానిపై నిషేధం విధించి మనకు ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛపట్ల గౌరవం లేదని చాటుకుంది.

'విశ్వగురు' విద్వేషం... వేధింపుల పరివారం

ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటన ఏదో అసాధారణ సందర్భమైనట్టు ప్రచారం జరిగింది. అమెరికా స్టేట్ విజిట్(ప్రభుత్వ పర్యటన)కు ఆహ్వానించడం, అరుదైన గౌరవంగానూ మీడియా హైప్ ఇచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం అది విశేషం కావచ్చు గాని అదేదో ప్రపంచానికే ప్రతిష్ట అన్నట్టు చెప్పడం కన్నా హాస్యాస్పదమైన విషయం మరోటి ఉండదు. అధికార, అనధికార పర్యటన, కార్యక్రమ పర్యటన, కార్యక్రమ సహిత అధికార పర్యటన ఇన్ని ఉంటాయట. వాస్తవానికి మొదటి రెండింటిలో అన్నీ కలసి ఉన్నాయి. కాని ప్రపంచాధిపత్య రాజకీయాలలో అమెరికా అనేక వ్యవహారాలు జరపడానికి వీలుగా



తెలకపల్లి రవి

అధ్యక్షుడికి మట్టి అంటకుండా ఇన్ని రకాలు నిర్ణయించారు. అధ్యక్షుడు ఆహ్వానిస్తేనే అది రాజ్య పర్యటన. ఇంతవరకూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మార్కోస్, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సక్ యోల్‌లను మాత్రమే బైడెన్ ఆహ్వానించారట. అంటే మోడీకి ఎంత ప్రాధాన్యత అన్నది ఆనందం. అదెంత దూరం వెళ్లిందంటే మొదటిసారి శ్వేతసౌధం తలుపులు తనను పిలిచాయని ప్రధాని కూడా పరవశంగా ట్వీట్ చేసేంత! నిజానికి ఇండియా వంటి చరిత్ర ప్రతిష్ట కలిగిన దేశాధినేత మరో దేశానికి వెళ్లి అంతగా ఆనందోత్సాహాలు వెలిబుచ్చడం దేనికి నిదర్శనమవుతుందో చెప్పనవసరం లేదు. మర్యాదల కింద వదిలేద్దాం. ఈ పర్యటన ఫలితాలేమిటి, భారత దేశం అమెరికా దృతకాష్ఠ కౌగిలిలో చిక్కుకోవడం ఎటు దారితీస్తుంది ఇదివరకే 'ప్రజాశక్తి' వ్యాసాలలో వివరంగా ప్రస్తావించబడింది. కాగా విశ్వగురుగా మనకు మనం చెప్పుకుంటున్నా విశ్వవేదికపై మన ప్రజాస్వామ్యం పట్ల ఎలాంటి అభిప్రాయం ఏర్పడుతోంది అనేది మీడియాలో అంతగా చర్చకు నోచుకోని మరో కోణం.

మస్క్‌నోట కూడా...

ఏదో సామెత చెప్పినట్టు ఇండియా పట్ల ప్రపంచ దేశాల తాజా అంచనా ఎలా ఉండి మోడీ వైట్‌హౌస్ చేరకముందే తెలిసిపోయింది. పారిశ్రామిక వేత్తలు వరసకట్టి ఆయనను కలుసుకుంటున్నారని పెద్ద హంగామా చేశారు. వారిలో ఒకరైన విపరీత వాణిజ్యవేత్త ఎలన్‌మస్క్ టెస్లా కార్ల కంపెనీ ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నారన్న వార్త బాగా ప్రచారంలో పెట్టారు. మస్క్ మోడీని కలుసుకున్నాక మీడియాతో మాట్లాడుతూ ప్రశంసలతో ముంచెత్తారు. అయితే మీ యాజమాన్యంలోని ట్విటర్‌పై మోడీ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుందట కదా! అని విలేకరులు అడిగితే సమాధానం దాటేశారు. (రైతాంగ నిరసనలపై ట్విటర్ ఇవ్వడం పట్ల కేంద్రం అభ్యంతరాలు తెల్పిందనీ వాటిని తొలగించవలసి వచ్చిందని ట్విటర్ బాధ్యుడైన అంతకు ముందు ప్రకటించి ఉన్నారు) మళ్లీ మళ్లీ అడిగినప్పుడు ఏ దేశంలోనైనా అక్కడి చట్టాల ప్రకారమే పనిచేస్తుంటామని దాటవేత సమాధానమిచ్చారు.

ఇక స్టేట్ విజిట్ లేదా రాజ్య పర్యటనలో అదనపు ఆకర్షణ లాంఛనాలే. వాటిలో స్వాగతాలు విందులతో పాటు ఉమ్మడిగా మీడియా గోష్టి నిర్వహించడం ముఖ్యమైంది. అసలు అమెరికా తన వ్యూహాలకు లోబడి ఉండేవారికే ఈ ఆహ్వానం అందిస్తుంది. మన దేశం కోణంలో చూస్తే ప్రధానిగా మోడీ మీడియాతో మాట్లాడటం, ప్రశ్నలకు స్పందించడం ఇంతవరకూ తెలియని విషయం. ఆయన ఇండియాలో ఉండగా ఎందుకు మీడియాను పిలవకుండా తిరుగుతారో కూడా స్పష్టమైపోయింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా టీవీ ఇంటర్వ్యూలను పూర్తిగా బహిష్కరించడం కూడా ఇందుకే. 'చరిత్ర అడక్కు చెప్పింది విను' చందంగా తన 'మన్‌కీ బాత్' వినిపించడం తప్ప జన్‌కీ బాత్ వినడం ఆయన నిఘంటువులోనే ఉండదు. కాబట్టి ఆయన అమెరికాలో ముఖాముఖి విలేకరులతో మాట్లాడటం పెద్ద వార్తయింది.

మైనార్టీల మాటేంటి మోడీజీ?

మళ్లీ వైట్‌హౌస్‌కు వస్తే మీడియా గోష్టిలో సబ్రినా సిద్దికి అనే మహిళా జర్నలిస్టు ప్రశ్న ఆయనకూ సంఘ్ పరివారానికి బొత్తిగా మింగుడు పడలేదు. నిజానికి మోడీ పర్యటనకు ముందే వైట్‌హౌస్ తాము అధికారికంగా మైనార్టీల పరిస్థితిపై మోడీతో మాట్లాడనున్నట్టు స్పష్టం చేశారు. మాట్లాడారు కూడా. వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు చెందిన సిద్దికి ఇండియాలో మైనార్టీల పరిస్థితుల గురించి వారిపై వివక్ష గురించి మోడీని నేరుగా అడిగారు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అందరూ సమానమేననీ, భారత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నందున మతపరమైన వివక్షకు అవకాశమేలేదని, అందుకే బైడెన్ తనతో అదే అన్నారని మోడీ సమర్థనతో బయటపడ్డారు. ప్రజాస్వామ్యం మా డీఎన్‌ఏలో ఉందన్నారు. ఇవన్నీ సూక్తులే తప్ప ఆమె ప్రశ్నకు సమాధానాలు కాదు. ఇదంతా ఒక ఎత్తయితే తర్వాత జరిగిన ప్రహసనం మరో ఎత్తు. సిద్దికి అలా ప్రశ్నించినందుకు ఆమెపై సంఘ్ పరివారీయులు ట్రోలింగ్స్ మొదలెట్టారు. ఆమె ఉద్దేశపూర్వకంగానే ఈ అంశం లేవనెత్తారని దాడి చేశారు.

"పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టు కపటనాటకమాడుతున్న మోడీ తదితరులు ఇప్పటికైనా ఈ అప్రజాస్వామిక పోకడలు విరమించితే దేశానికి శ్రేయస్కరం. నిర్మలా సీతారామన్ విమర్శ చేసేవరకూ ఒబామా వ్యవహారం పెద్దగా ప్రచారమివ్వమని మోడీ అనుకూల బడా మీడియాకు కూడా ఇది గుణపాఠమే.

బీజేపీ ఐటి విభాగం బాధ్యుడైన అమిత్ మాలవీయ ట్వీట్ చేస్తూ మోడీ ఆమె దురుద్దేశాన్ని తుత్తునియలు చేశారని పొగడ్తలు గుప్పించారు. ఇవన్నీ భరించలేని సిద్దికి 2011లో భారత క్రికెట్ టీం విజయం సాధించినప్పుడు ఆ డ్రెస్సు వేసుకుని తండ్రితో కలసి కేరింతలు కొడుతున్న తన చిన్నప్పటి ఫొటో ఒకటి ట్వీట్ చేశారు. కొన్నిసార్లు ఫొటోలే ఎక్కువ విషయాలు చెబుతాయని అని వ్యాఖ్య జోడించారు. మరోవంక వైట్‌హౌస్‌లో జరిగిన గోష్టిలో ప్రశ్న వేసిన వారినే ఇలా వెంటాడి వేధించడం అమెరికాలోనూ విమర్శలకు గురైంది. చివరకు అక్కడి ఉన్నతాధికారి జాన్ కిర్బీని మోడీ పర్యటన ముగిశాక జరిగిన గోష్టిలో ఆమెను అదే పత్రిక ప్రతినిధి ఈవిషయమై అడిగినప్పుడు మీడియా గోష్టిలో దీనిపై తమ అసమ్మతి ప్రకటించారు. ప్రశ్నించిన వారిని ఇలా వెంటాడటం సరైంది కాదని స్పష్టంచేశారు. ఆమెతో పాటు పత్రికా వ్యవహారాల కార్యదర్శి కెరెన్ జీన్ పిర్రే కూడా వేధింపులను ఖండించారు

ఒబామా అయితే మాకేంటి?

ఇది ఎవరో విలేకరి విషయమే అనుకుంటే సాక్షాత్తూ అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా విషయంలోనూ ఇదే అప్రజాస్వామిక పోకడలు ప్రదర్శించారు బీజేపీ పరివార్ నేతలు. డెమొక్రటిక్ పార్టీ



నాయకుడూ తొలి నల్లజాతి అధ్యక్షుడు అయిన ఒబామా ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పరిపాటి. మోడీ ప్రధాని అయిన కొత్తలో వచ్చిన ఒబామా మత సామరస్యం గురించి ఆర్భాటాలకు దూరంగా ఉండాల్సిన అవసరం గురించి చెప్పడం గుర్తుండే ఉంటుంది. మోడీని నరేంద్ర అనీ బారక్ అని పిలుచుకునేంత చనువు వారిమధ్య ఏర్పడిందని అప్పట్లో చెప్పేవారు. భారత దేశం మైనార్టీల హక్కుల రక్షణ గురించి జాగ్రత్త వహించాల్సి ఉంటుందని ఒబామా అనడం బీజేపీ భరించలేకపోయింది. నేనే బైడెన్ స్థానంలో ఉంటే ఈ సమస్యను తప్పక ప్రస్తావించేవాడినని కూడా ఒబామా అన్నారు. వెంటనే పరివార్ రంగంలోకి దిగింది. ఒబామా ఆఫ్రికన్ ముస్లిం మూలాలు గలవాడు కావడం వారి కోపాన్ని రెట్టింపు చేసింది. ఇటీవలి కాలంలో చవకబారు వ్యాఖ్యలకు మారుపేరుగా మారిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాస్ శర్మ హుసేన్ గనక ఇలా చేయడం ఆశ్చర్యమేమీ లేదని, ఆయనను మత కోణంలో అవహేళన చేస్తూ ట్వీట్ పెట్టారు. వాస్తవంలో ఒబామా క్రైస్తవుడే గాక వారి మతాచారాలు పాటిస్తారు! శర్మ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరింత తీవ్రంగా సుదీర్ఘంగా ఇదే విషయమై దాడి చేశారు. ఒబామా హయాంలో అమెరికా ఏ ముస్లిం దేశాలపై దాడి చేసిందీ ఏకరువు పెట్టారు. వాస్తవానికి ఆ సమయంలో భారతదేశం లేదా బీజేపీ అందుకు అభ్యంతరం చెప్పిందేమీ లేకపోగా అమెరికా నాయకత్వంలో టెర్రరిజంపై పోరాటంలో పాల్గొనాలని వత్తాసు పలికింది. బిన్‌లాడెన్ వంటివారికి అమెరికానే అండగా నిల్చిన విషయం మర్చిపోయింది. డోనాల్డ్ ట్రంప్ హయాంలోనైతే మోడీ ఎంతగా చెట్టపట్టాలేసుకుంది ఎవరూ మర్చిపోరు. ఆఖరుకు ఒకరికొకరు ఎన్నికల ప్రచారంలోనూ సహకరించుకున్నంత పనిచేశారు. ట్రంప్‌కు మద్దతు పలకడంలో మోడీ మామూలు దౌత్య మర్యాదలను కూడా దాటిపోవడం అమెరికాలోనూ విమర్శకు గురైంది. అలాంటి ప్రభుత్వంలో కీలకమంత్రిగావున్న నిర్మలా సీతారామన్ ఇప్పుడు మాత్రం వాటన్నిటినీ గుర్తుచేస్తూ 'మా వ్యవహారాల్లో మీ జోక్యం ఏమిటని' రెచ్చిపోయారు. ఆరు ముస్లిం దేశాలపై దాడిచేసిన అమెరికా మాకు మైనార్టీల గురించి చెప్పడమేమిటని వాఖ్యలు చేశారు. అంతటితో ఆగక ప్రతిపక్షాలనూ జతచేశారు. తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టి కష్టపడుతుంటే ప్రతిపక్షాలు సరైన సమస్యలపై పోరాడలేక మాజీ అమెరికా అధ్యక్షుడితో కలసి ఈ అప్రధానమైన అంశం ఎత్తుకున్నారని వాపోయారు. దేశంలో ప్రభుత్వాన్ని మార్చడం కోసం పాకిస్థాన్‌తో చేతులు కలిపారని, విదేశీ టూల్‌కిట్లు దిగుమతి చేసుకుంటున్నారనీ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణ చేశారు. రాజ్‌నాథ్‌సింగ్ వంటి సీనియర్ మంత్రి కూడా ఇదేపాట పాడటం గమనించదగింది.

కళ్లు మూసుకున్న పిల్లి

ఒబామా అయినా సిద్దికి అయిన ప్రయివేటు వ్యక్తులుగానే మాట్లాడారు తప్ప అమెరికా తరపున కాదు. తమకు ఇబ్బంది కలిగింది గనకనే కనీస దౌత్య మర్యాదలు కూడా పాటించక ఒబామాపై విరుచుకుపడటం బీజేపీ ద్వంద్వనీతికి అద్దం పడుతోంది. కొంత కాలం కిందట బిబిసి ఆనాటి గుజరాత్ పరిస్థితిపై డాక్యుమెంటరీ ప్రసారంచేసినప్పుడు కూడా మోడీ సర్కార్ ఇలాగే దాడి చేసింది. దానిపై నిషేదం విధించి మనకు ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛపట్ల గౌరవం లేదని చాటుకుంది. ఎన్‌డిటివి, వైర్ వంటివాటితో సహా మీడియా సంస్థలపై ఎలా ఒత్తిడి సాగిందీ అందరికీ తెలుసు. అది ముదిరి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరిందన్నమాట. రాహుల్‌గాంధీనో లేక గతంలో మన్మోహన్‌సింగ్ వంటివారు విదేశాల్లో ఏదో మాట్లాడితే దేశ ప్రతిష్ట దెబ్బతినిపోయిందని గగ్గోలు పెట్టిన ఈ దేశ భక్తులు విశ్వగురువులమంటూనే వికృత వివాదాలు ఎలా పెంచుతున్నదీ దేశంలో తమ నడవడి ద్వారా ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నదీ దాచిపెట్టాలని చూస్తున్నారు. కానీ వారెన్ని తంటాలు పడినా ప్రజాస్వామ్య ప్రమాణాలు ఘోరంగా దెబ్బతింటున్నాయని ప్రపంచం గమనిస్తున్నదని ఈ సందర్భాలు స్పష్టం చేస్తున్నాయి. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టు కపటనాటకమాడుతున్న మోడీ తదితరులు ఇప్పటికైనా ఈ అప్రజాస్వామిక పోకడలు విరమించితే దేశానికి శ్రేయస్కరం. నిర్మలా సీతారామన్ విమర్శ చేసేవరకూ ఒబామా వ్యవహారం పెద్దగా ప్రచారమివ్వమని మోడీ అనుకూల బడా మీడియాకు కూడా ఇది గుణపాఠమే. ■


రోడ్డెనక రోడ్డు వేసి...

భాయియో ఔర్ బెహనో, సజ్జణో ఔర్ దేవియో, మే ఏక్ బినతీ కర్తాహు. వాసే యా తక్ ఏ రోడ్ హమ్నే బనయా హై. నాయకుడు దంచుతూ పోతున్నాడు. ఇన్ని వేల కిలో మీటర్ల రోడ్డు మేమే వేశామన్నాడు. అందుకే ఫలానా రాష్ట్రం నుండి మీ రాష్ట్రం దాకా ఒకేసారి ప్రయాణం చేయొచ్చన్నాడు. మీరు ఆ రహదారి గుండా వచ్చారా అని ప్రశ్నిస్తే లేదు హెలికాప్టరులో వచ్చానన్నాడు నాయకుడు. మరి రోడ్డెందుకు అంటే ప్రజలకోసమన్నాడు. ప్రజలే తన బంధువులన్నాడు. కాని తాను ప్రజల్లో లేనన్న విషయాన్ని ఒప్పుకున్నట్టే అనిపించింది. అయితే ఓటు లేనివాళ్ళు కొందరున్నారంటే వాళు ౢ వేలువిడిచిన, బీరకాయ పీచు బంధువులన్నాడు. హమ్కు ఉన్ లోగోసే కామ్ నహీ హై అనీ అన్నాడు. ఉన్ లోగోసే హమ్ కామోష్ రెహతేహై అనీ అన్నాడు. ఇన్నిన్ని మాటలు పైనుండి వచ్చిన నాయకుడే మాట్లాడితే తానేమైపోవాలను కున్నాడో ఏమో చెవిలో ఏదో గుసగుసలాడాడు. కోపమొచ్చినా నవ్వింది బడా నాయక్.



జంధ్యాల రఘుబాబు

వింటున్న ప్రజల్లో కొందరు మైమరచిపోయారు. ఇన్నేసి కిలోమీటర్లు రోడ్డెనక రోడ్డు వేస్తే ఇదెలాంటి సడక్ యోజననో కదా అని నర్సింగ్ అడిగీ అడగకనే "ఏ అధికార్ సడక్ యోజనలా" ఉందన్నాడు యాద్గిరి. ఏం చెప్పినావ్‌ర భై నువ్వు మామూలోడవు కాదురా, పైకి మాట్లాడితే అందరూ వింటారని లోలోన అనుకున్నాడు నర్సింగ్. అంటే బ్రిటిషోళ్ళే కాదు, మనోళ్ళు కూడా తమ వ్యాపారానికి అవసరమైతేనే రోడ్లు వేస్తారని ఈపాటికి అందరికీ అర్థమైపోయుంటుంది నర్సింగు యాద్గిరితో సహా. ఆంగ్లేయులు ముడిసరుకును తమ దేశానికి తీసుకుపోయి, తయారైన వస్తువులను మనదేశానికే తెచ్చి మనకే అమ్మేవాళ్ళని చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్నాం. ఇదీ అంతే, తామేసుకున్న రోడ్లు, అంతకు ముందు ఉన్న రోడ్లు అన్నీ కలిపి మేమే వేశామని దేశమంతా తిరిగి, అంటే రోడ్డు మీద కాదు ఏ హెలికాప్టరో, విమానమో వాటిద్వారా అన్న మాట తమ రాజకీయ వ్యాపారానికి మనోళ్ళు వాడుకుంటున్నారంతే. మిగతా అంతా సేం టు సేం, తెల్లోడికి నల్లోడికి వ్యాపార విషయంలో తేడాలేమీ లేవు. అందుకే ఆ రహస్యాలను బట్టబయలు చేసేవాళ్ళను దాడిచేస్తామని భయపెట్టి మరీ లోగుట్టు బయటకు రాకుండా చూసుకుంటున్నారు. అవి దాగుతాయా? దాగవు. ఎంత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేద్దామని చూసినా ఎదురు తిరిగే ధైర్యస్తులు ఉండనే ఉంటారు. దేశమేమీ గొడ్డు పోలేదు ఈ విషయంలో. గాంధీ ఎలాగైతే బ్రిటిష్ వాళ్ళు వేసిన రైళ్ళలో దేశమంతా తిరిగాడో ఆ లెక్కనే ఈ రోడ్లను ఆసరా చేసుకొని ప్రజాస్వామ్యవాదులు తిరిగి



ప్రజలక్కావలసిందేదో తెలియజేస్తారు.

ఆల్ రోడ్స్ లీడ్ టూ రోమ్ అన్నట్టు ఇప్పుడు అన్ని రోడ్లు పుణ్యక్షేత్రాలవైపు దారికడుతున్నాయ్. దేశాభివృద్ధిని ఇప్పుడు ఏ క్షేత్రానికి ఎంతమందిని బస్సుల్లో, రైళ్ళలో, విమానాల్లో తీసుకుపోతున్నారో లెక్క కట్టి మరీ చూపిస్తున్నారు. వినేవాళ్ళు, చదివేవాళ్ళలో కూడా వహ్వా వహ్వా అని చప్పట్లు చరిచేవాళ్ళు భజన బృందాలుగా మారి జేకొడుతున్నారు. సమస్యల వైపు ప్రజల దృష్టి పోకుండా వారిని జోకొడుతున్నారు. విప్లవ గీతాలు పాడినోళ్ళు కూడా దేవుళ్ళ గురించి మాట్లాడి దాన్ని ఫిలాసఫీగా చూస్తున్నామని తెలియజేస్తున్నారు. అలా రోడ్డెనక రోడ్డు వేసేవాళ్ళే కాదు, రోడ్లు మారుస్తున్నోళ్ళూ ఉన్నారు అంటే తయారవు తున్నారు. ఇది రోడ్లు మారే కాలం కూడా. ఏరువాక లాగా తమ రాజకీయ పంటలు ఏ రోడ్డు గుండా పోయి ఎక్కడ ఆగితే ఎక్కువగా పండుతాయో అక్కడికి పోవడం సహజ లక్షణం. కప్పలు ఒక చెరువులోనుంచి ఇంకో చెరువులోకి ఎలా దూకుతాయో ఇప్పుడు అంతకన్నా వీరలెవెల్లో ఇంకా చెప్పాలంటే ఒలింపిక్స్‌లో పాల్గొంటే బంగారు పతకాలు వచ్చే విధంగా గెంతులు ఉంటాయిప్పుడు. రహదారి కూడలిలో అంటే క్రాస్ రోడ్స్‌లో ఉన్నామని చెప్పేవాళ్ళు ఇప్పుడు విద్యార్థులే కాదు రాజకీయ నాయకులూ అలాగే ప్రవర్తిస్తారు. ఇది రోడ్డు ఎంచుకునే సమయం మరి.



మాది బైపాస్ రోడ్డు అంటే అందుకే మీరు ఊర్లోకి రారు బయట్నుంచి బయటే వెళ్ళిపోతారు అందుకే మీకు ఊరిలోని సమస్యలేమి తెలుస్తాయి అని కొందరంటే, మీది సర్వీసు రోడ్డు బైపాస్ రోడ్డు గురించి మీకేమి తెలుసునని అటువైపువాళ్ళంటారు. అందుకే మా రోడ్డును కూడా పెద్దరోడ్డు చేసేసి దేశం మొత్తం తిరుగుతామని కొందరు బయలుదేరవచ్చు. ఆసంత పనీ చేస్తారు. ఇక తమ రోడ్డంతా గుంతలు పడ్డ వాళ్ళు మాదే అసలు సిసలైన రోడ్డు దాన్ని బాగా చేస్తే మీ ఇద్దరి రోడ్లు పనికేరావు, మీ రోడ్డులోకి వచ్చిన వారిని కూడా లాగేసి మరీ మా రోడ్డులోకి తెచ్చు కుంటామనవచ్చు. అసలు మీ రోడ్లన్నింటినీ చాపను చుట్టినట్టు చుట్టేసి సముద్రంలో పారేస్తానని ఇంకో పెద్దాయన అనొచ్చు. అసలు సముద్రమే లేని, తెలియని మీరు సముద్రం కోసం చాలా దూరం పోవాలని, మమ్మల్ని దాటి ఎలా పోతారో చూస్తాను అని అసలు రోడ్లే ఎప్పుడూ వేయని ఇంకో చిన్న రాజావారు అనొచ్చు. ఊ అంటే మా మంత్రులను, మమ్మల్ని తిడతారని కోప్పడవచ్చు కూడా.

ఒక్కో రాష్ట్రంలో ఒక రకం రోడ్లు ఉంటాయి. ఒక వేళ తొందరలో తాత్కాలికంగా వేసినామనిపించినా, తరువాత వర్షాలకు అవి కొట్టుకుపోతాయి. ఏ రాష్ట్రంలో ఎలాంటి భూమి ఉందో, అక్కడ ముందుగా వేసిన రోడ్లెలా ఉన్నాయో అని అక్కడి వాళ్ళ సాయం తీసుకుందామంటే అది అన్నిచోట్లా కుదరదు. కానీ ప్రజలు మాత్రం ఏదో ఒక రోడ్డు ఎంచుకోవడం ఖాయం, ఆ ఎంచుకునేదేదో మంచిదే ఎంచుకొమ్మని మాత్రం చెప్పగలం.

సెల్:9849753298

కుక్కలు.. పిక్కలు....

పిక్క బలం లేని వాడి వెంట కుక్కలు పడితే ఎలా ఉంటుంది. ఎలా ఉంటుందంటే... ఒంటిపై నాలుగు గాయాలు, బొడ్డు చుట్టూ ఐదు సూదులు అన్నట్టుగా ఉంటుంది. ఈ కుక్కల పురాణం ఇప్పుడు దేనికంటే... ఈ మధ్య రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో సైతం ఈ గ్రామ సింహాలు హల్ చల్ చేస్తున్నాయి. దొరికిన వాణ్ని దొరికినట్టు కరిచి పారేస్తున్నాయి. వాటికి ఆడ, మగ, చిన్నా, పెద్దా అనే తేడా లేదు. అందరూ సమానమే. ఈ క్రమంలో కుక్కల దవాఖానాలకు జనం క్యూ కడుతున్నారు. సూదులు వేయించుకుంటాం సరే... కానీ ఆ తర్వాత పత్యం చేసుకుంటూ, పనులకు పోకుండా ఉండాలంటే మాకు పూటెలా గడుస్తుంటున్నారు కుక్కల బాధితులు. జంతు ప్రేమికుల గురించి పదే పదే మాట్లాడే అక్కినేని అమల లాంటి వారు దీనిపై స్పందించాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. అమలా మేడమ్.. ఒక్కసారి వారి గోస వినండి ప్లీజ్...

-కేఎన్ హరి

మంత్రిగారి నిద్ర...

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఈ మధ్య ప్రతిష్టాత్మంగా అనేక పథకాలు, కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. అందులో భాగంగానే హైవేలు, స్కైవేలు, ఫ్లైఓవర్లను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. పలు జిల్లాల్లో కలెక్టరేట్లు, ఎస్పీ ఆఫీసులు పూర్తయి ప్రారంభోత్సవాలు కూడా అయిపోయాయి. కొత్త సెక్రటేరియట్, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం కూడా కొలువుదీరాయి. హుస్సేన్ సాగర్ తీరాన అమరుల స్ఫూర్తితో జ్యోతి కూడా వెలుగుతోంది. వీటన్నింటినీ ఆర్ అండ్ బీ శాఖ పర్యవేక్షించి, పనులు పూర్తి చేసింది. మరో దిక్కు నిమ్స్‌లో కొత్త బిల్డింగు, వరంగల్ ఎంజీఎంలో 28 అంతస్తుల నూతన భవనం పనులు స్టార్ట్ అయ్యాయి. ఈ పనులన్నింటితో ఇప్పటిదాకా బిజీబిజీగా గడిపిన సదరు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి... ఈ మధ్య మీడియా మిత్రులతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఆయా నిర్మాణాల విశేషాలను ఆయన వారితో పంచుకున్నారు. ఈ క్రమంలో ఓ సీనియర్ పాత్రికేయుడు... 'అన్నా... కంగ్రాట్స్, పట్టు వదలని విక్రమార్కుడిలా మొత్తానికి పనులన్నింటినీ దిగ్విజయంగా పూర్తి చేశారు...' అంటూ ప్రశంసలు కురిపించారు. ఆ తర్వాత మరో సీనియర్ అందుకుని... 'సార్... మీ శాఖ యమ స్పీడ్‌గా పరుగెడుతోంది.. ఈ క్రమంలో నిమ్స్‌లో కొత్త భవనం, వరంగల్‌లోని ఆస్పత్రిని ఎప్పటిలోగా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు...' అంటూ మరో ప్రశ్న సంధించారు. దానికి వేముల గట్టిగా నవ్వి... 'అరేబయ్... న్యూ సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరుల జ్యోతి నిర్మాణ పనుల్లో ఈ మధ్య ఫుల్ బిజీ అయ్యా. ఒక్కోసారి రాత్రుల్లో కూడా పనులను పర్యవేక్షించి, సమీక్షల మీద సమీక్షలు చేశా. బాగా అలసిపోయా. అమరుల జ్యోతి ప్రారంభం రోజున కళ్ల మీద ఒకటే నిద్ర. అందుకే ఆ మర్నాడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఏకధాటిగా 14గంటలు నిద్రపోయా...మళ్లీ ఇప్పుడు మీరు నిమ్స్, వరంగల్ ఎంజీఎం అంటే భయమేస్తోందిరా బయ్.. కొద్ది రోజులు నన్ను వదిలిపెట్టండ్రా బయ్...' అంటూ విలేకరులకు విజ్ఞప్తి చేయటంతో అక్కడున్న వారంతా మంత్రి ప్రశాంత్ వైపు చూశారు ప్రశంసాపూర్వకంగా. అనుకుంటాం గానీ...ఎంతో విలాసంగా, దర్జాగా ఉండే రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల జీవితాల వెనుక అంతకుమించిన రిస్క్, కష్టం కూడా ఉంటుంది కదా...

-బి.వి.యన్.పద్మరాజు

పుడమి గర్భంలో...

'పుడమి గర్భంలోని తడికి జలదరించిన విత్తు లోకాన్ని చూద్దామని రెండు పచ్చని కనురెప్పలు పైకెత్తుతుంది' అన్న ఓ కవయిత్రి ఆశలు నీరుగారుతున్నాయి. తొలకరికి విత్తిన విత్తనం మట్టిలోనే కలిసిపోయింది. విత్తనాలు నాటిన తర్వాత జల్లులు పడకపోవడంతో పుడమిగర్భంలోనే విత్తనం ఉండిపోయింది. భూమిని నమ్ముకున్న రైతులు... అధిక ధరలకు విత్తనాలు కొని తెచ్చి నాటితే మట్టిలోనే కలిసిపోయాయి. చిరుజల్లులు పడలేదు కానీ అన్నదాత నుంచి కన్నీటి ధార కురుస్తున్నది. మరోసారి విత్తనం కొనుక్కోవాల్సి పరిస్థితి వస్తున్నది. ఈ వానాకాలం సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది విత్తనాలు నాటారు. కానీ అనేక చోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తినవేమో ఎండలకు కమిలిపోయాయి. విత్తన ఖర్చులు, దున్నడానికి, చదును చేయడానికి, చేసిన ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరైంది. సర్కారోళ్ల విత్తనాలు సరఫరా చేయకపోవడంతో ప్రయివేటోళ్ల దగ్గర కొనాల్సి వస్తుంది. వారు ఇష్టారీతిన అధిక ధరలకు అమ్ముతున్నారు. అడ్డూ, అదుపు లేకుండా ధరలు పెంచి, రైతుల రక్తాన్నీ జలగల్లా పీలుస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతన్నలను సర్కార్ ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

-గుడిగ రఘు

ఎకో ఎలిజీ

వెలుగుల పలకపై
ఎవరెవరో
చీకటిని చల్లుతుంటారు

పలకను వెతుకుతూ
వెన్నెల కాటుకాలిసిపోతుంది

కాటుకలిసిన వెన్నెలను గుర్తించక
కాలుతున్న అరణ్యాలు
ఎప్పటిలా పరుగులు పెడుతుంటాయి

గమ్యాలు తెలియకున్నాయి
అరణ్యాలు కాలుతున్నాయి
వెన్నెల
కాటుకలిసిపోతోంది
దిక్కు తోచక వెలుగు పలక
తనపైకి
చీకటిని లాక్కుంటోంది దుప్పటిలా

- ఫణిమాధవి కన్నోజు
7659834544

ఎల్బాక వాసికి ఉత్తమ వైద్య విద్యార్థి అవార్డు

నవతెలంగాణ - వీణవంక

మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన వీణవంక పీఏసీఎస్ చైర్మన్ మావురపు విజయ్‌భాస్కర్‌రెడ్డి కుమార్తె నారాయణిరెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ వైద్య విద్యార్థి అవార్డు అందుకుంది. ఈ అవార్డును డాక్టర్స్ డే సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మావురపు నారాయణిరెడ్డిని మంత్రితో పాటు సినీ నటుడు సుమన్ అభినందించారు. ఉన్నత చదువులు చదివి పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు.


డాక్టర్ నారాయణి రెడ్డిని అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా
- పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు
- ప్రజా సంఘాల పోరాట వేదిక బాధ్యుడు గీట్ల ముకుందరెడ్డి


వినతిపత్రం అందిస్తున్న గీట్ల ముకుందరెడ్డి, నాయకులు



ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్

పేదలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ప్రజా సంఘాల పోరాట వేదిక బాధ్యుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల వేదిక బాధ్యుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో టీఆర్ఎస్ తాము అధికారంలోకి వస్తే అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇస్తామని, సొంత ఇంటి స్థలం ఉన్న వారికి 5లక్షలు ఇస్తామని పేదలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటి స్థలం ఇవ్వడం లేదని అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో 5,729 ఇండ్లు మంజూరు కాగా కేవలం 58 ఇండ్లు మాత్రమే పూర్తి చేశారని అవి కూడా పేదలకు కేటాయించలేదని, ఎలక్ట్రికల్, మున్సిపల్ వాటర్ లేదని సాకులు చెబుతూ పూర్తి చేసిన ఇండ్లను కూడా పేదలకు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. తీగలగుట్టపల్లి, ఆరేపల్లిలోని నిర్మించిన డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు అసాంఘీక కార్యకలాపాలకు అండగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని మభ్యపెట్టి విలేకరులకు ఇండ్ల స్థలాలు కేటాయించలేదని అన్నారు. ఇండ్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలు గుర్తించి గుడిసెలు వేయిస్తామని, పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరులైన పేదలకు ఇవ్వకుంటే తాళాలు పగలగొట్టి ఆక్రమిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం చుట్టూ పక్కల ఉన్న రేకుర్తి, కమాన్‌పూర్, చింతకుంట, బొమ్మకల్, తిమ్మాపూర్ గ్రామాలలో ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి కబ్జాలకు పాల్పడుతున్నా, ప్రభుత్వ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నా రని అన్నారు. పద్మానగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు సంవత్సరాల కొద్దీ అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని, తీగలగుట్టపల్లి, ఆరేపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి అర్హులైన పేదలందరికీ పంచాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం ద్వారా ఇస్తున్న డబ్బులు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారికి అర్హులైన పేదలతో దరఖాస్తులు ఇస్తూ వినతిపత్రం ఇచ్చారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం ఉపాధ్యక్షులు శీలం అశోక్, సంపత్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.భీమాసాహేబ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు యమునా, లావణ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంపల్లి సాగర్, తిప్పారపు సురేష్, ఉపాధ్యక్షుడు సుంకరి సంపత్, గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్ యాదవ్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు రత్నం సురేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, కోశాధికారి జి.రాజేశం, కేవీపీఎస్ జిల్లా నాయకులు కనకరాజు, ప్రభాకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మారెళ్ల శ్రీలత, కొప్పుల శంకర్, బోడ మోహన్ నాయక్, రాజేందర్, జరీనా బేగం, రమ, భారతి, రజిత, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్లకు ఘన సన్మానం

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండిలో మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మల్లేశం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, రాజేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, క్యాషియర్ నలుమాచు శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు బి.ఎల్లారెడ్డి, ఎస్.రామస్వామి, పి.కృష్ణ, ఎన్.తిరుపతి, పి.రాజేష్, కే.రాజిరెడ్డి, ఏ.నాగరాజు, బీ.సతీష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్


తిమ్మాపూర్ : సన్మానిస్తున్న జలపతి

జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువ జన సంఘం మండల అధ్యక్షుడు పారునంది జలపతి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు కళ్లెం రాజేశ్వర్‌రెడ్డి, బొజ్జ ఎల్లయ్య, అరుకాల సత్తయ్య, కందుకూరి ఈశ్వరచారి,నాంపల్లి శ్రీనివాస్ తదితర వైద్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడి అంజయ్య, వార్డు సభ్యుడు నార్ల అశోక్ నాయకులు సానకొండ నరసింహస్వామి, దుర్గం మధునయ్య, పోతుగంటి శ్రీనివాస్, ఆసోద అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కవ్వంపల్లి పర్యటన

నవతెలంగాణ - మానకొండూర్ : మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మోసగిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, నాయకులు రామిడి తిరుమల్‌రెడ్డి, సాయిరి దేవయ్య, మల్లేశం, కొండ్ర సురేష్ పాల్గొన్నారు.

చొప్పదండి సింగిల్ విండోను సందర్శించిన నల్లగొండ జిల్లా పీఏపల్లి సభ్యులు



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని శనివారం నల్లగొండ జిల్లా పీఏపల్లి సహకార సంఘం అధ్యక్షుడు ఎలుగురి వల్లపురెడ్డి, సీఈవో వెంకటేశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగస్తులు సందర్శించారు. ఈ సందర్భంగా చొప్పదండి సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి సంఘంలో చేపట్టిన ఎరువుల గోదాం, తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గుర్రం ఆనందరెడ్డి, లంబు రాజిరెడ్డి, నాంపల్లి మల్లయ్య, సంఘం కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికి కేంద్ర పథకాలను తీసుకెళ్లాలి'

నవతెలంగాణ - జమ్మికుంట

ప్రతి ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను బిజెపి కార్యకర్తలు తీసుకు వెళ్లాలని పార్టీ తమిళనాడు నాయకుడు రాధా కిషన్ అన్నారు. శనివారం మేరా భూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా ఆబాది జమ్మికుంట, కొత్తపల్లి పరిధిలో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, పల్లపు రవి, స్వామి, సరూప, మోడం రాజు, కైలాసకోటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన కొర్రి కుమార్ తండ్రి కొర్రి రాజయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని శనివారం శంకరపట్నం వైస్ ఎంపీపీ పులికోట రమేష్ పరామర్శించారు. 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయనవెంట కో ఆప్షన్ మెంబర్ పులికోట మహేందర్, వార్డు మెంబర్స్ పులికోట విద్యానందం, రాచర్ల నరేష్, నాయకులు ఉన్నారు.

వర్షాలు కురువాలని పూజలు

నవతెలంగాణ - వీణవంక : వర్షాలు కురువాలని మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామస్తులు శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కప్పతల్లి ఆట ఆడుతూ గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ ప్రత్యేక పూజలు చేశారు. సార్ల సుధాకర్, పోతరాజు భాస్కర్, యార కుమారస్వామి, అప్పని ఐలయ్య, అప్పని కుమారస్వామి, ఎజ్జు మొగిళి, అమ్మ బాలయ్య, ఎజ్జు వెంకట్రాజం, యార రాజయ్య, అప్పని హరీష్ వర్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్పీఎస్సీ గ్రూప్-4 పరీక్ష

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్


కరీంనగర్ : పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్ష కరీంనగర్ జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. జిల్లాలో శనివారం జరిగిన టీఎస్పీఎస్సీ గ్రూప్-4 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కరీంనగర్ పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలలో పరీక్ష నిర్వహణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించారు. ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరాల ఎదుట తెరవాలని, మెటీరియల్ తెరిచే విధానాన్ని పూర్తిగా రికార్డ్ చేసి పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 154 పరీక్షా కేంద్రాలలో మొత్తం 54019 అభ్యర్థులకు ఉదయం 43374 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 10645 మంది అభ్యర్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 43176 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 10843 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

నవతెలంగాణ - హుజరాబాద్

హుజురాబాద్ పట్టణంలోని 8 పరీక్ష కేంద్రాలలో గ్రూప్-4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి హుజురాబాద్ పట్టణంలోని న్యూ శాతవాహన హైస్కూల్, కృష్ణవేణి హై స్కూల్, మాంటిసోరి పాఠశాల, మాతృశ్రీ డిగ్రీ కళాశాల, ఏకశిలా పాఠశాల, టెట్రా హైస్కూల్, శ్రీ కాకతీయ హై స్కూల్, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 2503 మంది, మధ్యాహ్నం 2496 మంది పరీక్షలు రాశారని అధికారులు తెలిపారు. సిఐ బొల్లం రమేష్, ఎస్సై ఆసిఫ్ ఇతర పోలీసు అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు. హుజురాబాద్ ఆర్డీవో హరిసింగ్ రూట్ ఆఫీసర్లను లిజనింగ్ ఆఫీసర్లను సమన్వయం చేస్తూ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. సాయంత్రం రూట్ ఆఫీసర్లు ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ కోమల్‌రెడ్డి పరీక్ష పత్రాలను పోలీసు బందోబస్తుతో జిల్లా కేంద్రానికి వాహనాల్లో తరలించారు.

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలో శనివారం గ్రూపు-4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని కాకతీయ విద్య సంస్థలలో రెండు సెంటర్లు, విద్యోదయ హై స్కూల్, ప్రభుత్వ బాలుర హై స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కేరళ స్కూల్, సాయిరాం డిగ్రీ కాలేజీ ,చాణిక్య డిగ్రీ కాలేజీ, న్యూ జయభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఆవాస విద్యాలయం సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 3,360 మందికి 953 అభ్యర్థులు గైరాజరు అయినట్లు తహసీల్దార్ బండి రాజేశ్వరి తెలిపారు. ఐదు సెంటర్లను తహసీల్దారు, మరో ఐదు సెంటర్లను డిప్యూటీ తహసీల్దారు సమ్మయ్య పర్యవేక్షించారు.

తెలంగాణ డయోగ్నిస్టిక్ కేంద్రం ద్వారా 2,45,000 మందికి పరీక్షలు

కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



నవతెలంగాణ - కరీంనగర్ : తెలంగాణ డయోగ్నిస్టిక్ కేంద్రం ద్వారా రెండు సంవత్సరాలుగా జిల్లాలో 2లక్షలా 45వేల మందికి వివిధ రకాల పరీక్షలను నిర్వహించినట్టు కరీంనగర్ మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 8 పాథలజీ, 16 రేడియోలజీ కేంద్రాలను మంత్రి హరీశ్‌రావు ఆన్‌లైన్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా మేయర్ పాల్గొని అనంతరం మాట్లాడారు. జిల్లాలో గతంలో రెండు ప్రైమరీ హెల్త్ సెంటర్లు మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 4 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 4బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. డయోగ్నిస్టిక్ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న 57 పరీక్షలను 134 కు పెంచుకోవడం ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందుతాయని అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. డయోగ్నిస్టిక్ కేంద్రాల ద్వారా నిర్వహించిన వైద్య పరీక్షల రిపోర్టులను అందజేసి, ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో కేక్ కట్ చేశారు. వైద్యులను, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. జిల్లా వైద్యాదికారి లలితాదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషన్ ప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎంఓ జ్యోతి, అడిషనల్ ఆర్ఎంఓ నవీన పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల ఎంపికకు 4, 5న పోటీలు

నవతెలంగాణ - జమ్మికుంట/ఇల్లందకుంట

2023 - 24వ విద్యా సంవత్సరానికి గాను 4వ, 5వ తరగతి విద్యార్థులకు క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం ఈ నెల 4 నుండి నుండి 5 వరకు పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ విడపు శ్రీనివాస్, మండల ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ కే.రేణుక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట మండలానికి చెందిన వారు ఈ నెల 3న విద్యార్థులు తమ పేర్లను స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇల్లందకుంట మండలం వారు జడ్పీహెచ్ఎస్ పీఈటి పత్తి రాజు దగ్గర తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 4న 4వ తరగతి, 5న 5వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం జమ్మికుంట మండల ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ 9705113132 నెంబర్ ద్వారా, ఇల్లందకుంట మండలానికి సంబంధించి పిఈటి పత్తి రాజు సెల్ 9573851514, మండల ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ సిహెచ్ శ్రీనివాస్ సెల్ 8096791096 ద్వారా సంప్రదించాలని ఎంఈఓ సూచించారు.

'రజకులు ప్రభుత్వ శాఖలో చేరాలి'

నవతెలంగాణ - కరీంనగర్ : ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు రజకులు ప్రభుత్వ శాఖలో చేరాలని రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రజక సొసైటీలకే దోభీ సేవలు చేసుకోవాలని జీఓ విడుదల చేయడం గురుకులాలు, వసతి గృహాలు, క్రీడా హాస్టళ్లు, దేవాలయాల్లో ఆర్ అండ్ బీ పోలీస్ శాఖ, డీఎంఈ, డీహెచ్ఏ, టీవీవీపీ ఆస్పత్రిలలోని దోభి సేవలను రజక సొసైటీలకే ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖకు ఉత్తర్వులు ఇవ్వటం హర్షనీయమన్నారు. గతంలో ఆర్థికంగా ఉన్న కులాల నేతరే కాంట్రాక్టు పద్ధతిన నడిచేదని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించిందని, దీన్ని గ్రామాలలోని రజక సహకార సొసైటీలు పేద రజకులనే గుర్తించి ఆయా పోస్టులలో భర్తీ చేసేలా తీర్మానాలు చేసుకోవాలని, ప్రభుత్వం లక్ష రూపాయలే కాకుండా రజక బంధు పథకం పెట్టి రజక నిరుద్యోగ యువకులను ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనపర్తి శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నాల తిరుపతి, రాపాల శంకర్, జిల్లా కన్వీనర్ ఎడవెల్లి రమేష్, నంగునూరి ఎల్లయ్య, వేదిర వెంకటేష్ పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌కు వీడ్కోలు సన్మానం

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక ప్రెస్ భవన్‌లో శనివారం సన్మాన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు హాజరై శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు-స్వర్ణకుమారి దంపతులను డివిజన్ అధికారులు, ఉద్యోగులు, ఆత్మీయులు జ్ఞాపికలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఇన్‌చార్జి పోస్టల్ ఎస్పీ ప్రభాకర్, సికింద్రాబాద్ డిప్యూటీ ఎస్పీ శ్రీనివాసరావు, రిటైర్డ్ పోస్టల్ అధికారులు వై.వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, ప్రసాదరావు, షబ్బీర్, సుబానీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభ సన్నాహక సమావేశం

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు జరిగే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవరెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఎన్నిక

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో శనివారం గ్రామ మున్నూరు కాపు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదె రాములు, ఉపాధ్యక్షుడిగా గాదె రాజు, ప్రధాన కార్యదర్శిగా గాదె మల్లయ్య, కార్యదర్శిగా దానబోయిన రాజ్‌కుమార్, కోశాధికారి గా సుంకరి మల్లేశం, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగిటి ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీసు అందజేత



నవతెలంగాణ - శంకరపట్నం

తమ సమస్య పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ తెలిపారు. ఈ మేరకు శంకరపట్నం ఎంపీడీవో కార్యాలయంలో సూపరెండెంట్ శ్రీకాంత్‌గౌడ్‌కు శనివారం కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాల పెంపు, పర్మనెంట్ కోసం అనేక సంవత్సరాల నుంచి పోరాడుతున్నా న్యాయం జరగలేదని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారని వాపోయారు. అధికారులు, సర్పంచులు, కార్యదర్శుల వేధింపులు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వాలని అడిగిన కార్మికులను పనులనుండి తొలగిస్తున్నారని వాపోయారు. కార్మికుల ఉద్యోగ భద్రత, జీవో నెంబర్ 60 ప్రకారం 30శాతం పిఆర్సి పెంపు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబానికి 5 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం అందించాలని, మల్టీపర్పస్ 51 జీవోను సవరించి, కేటగిర్ల వారిగనే పనులు కొనసాగించాలని, కారోబార్లను పంచాయతీ సహాయ కార్యదర్శిలుగా నియమించాలని, తదితర డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం,యూనియన్ మండల అధ్యక్షుడు కొయ్యడ సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షులు టి.సురేష్, బుజ్జ మదనమ్మ కార్మికులు ఆడేపు శంకర్, బొజ్జ ఐలవ్వ, బి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కరీంనగర్

ఈ నెల 6 నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేయనున్నట్లు జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ వీరబుచ్చయ్యకి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ యూనియన్ నాయకులు ఎడవల్లి సంపత్, రాచర్ల మల్లేశం, కాశపాక శంకర్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -4 అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్ లైన్

నవతెలంగాణ - హుజురాబాద్



గ్రూప్-4 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థుల కోసం పట్టణంలోని బస్టాండ్ ఆవరణంలో ఆర్యవైశ్య సంఘం హుజురాబాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ.. గ్రూప్-4 పరీక్ష రాసే అభ్యర్థులు సుదురాల నుండి వస్తున్నందున వారిని పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు ద్విచక్ర వాహనాలను సమకూర్చినట్టు చెప్పారు. సహాయ సహకారాలు అందించిన ఆటో యూనియన్, ఓం సాయి టెంట్ హౌస్, వైశ్య యూత్ సభ్యులను మున్సిపల్ చైర్ పర్సన్ సన్మానించారు.

మానకొండూర్‌లో అనాథల అరిగోస దీక్ష

నవతెలంగాణ - మానకొండూర్



మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం అనాథల అరిగోస దీక్ష చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దీక్ష చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కో కన్వీనర్ తుంగ ఆంజనేయులు మాదిగ, ఎంఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ చెంచల నవీన్ మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనాథ పిల్లలకు హామీలు ఇచ్చి నేటికీ 8ఏండ్లు గడుస్తున్నా అమలు చేయడంలో పూర్తిగా విఫల మయ్యారని విమర్శించారు. అనాథల కోసం భువనగిరి జిల్లాలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి రాష్ట్రపతితో ప్రారంభిస్తామని చెప్పి విస్మరించారన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనాథ ఆశ్రమాలలో ఉండే పిల్లల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని మోసపూరిత వాఖ్యలతో మోసగించారన్నారు. ఇప్పటికైనా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను అమలు చేయాలని, అనాతలకు ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసి వారికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్పీఎస్ మానకొండూర్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు బొమ్మకండ్ల అనీల్, పానేటి దుర్గయ్య నూనె మల్లయ్య, నూనె శ్రీనివాస్, కడమంచి శ్రీనివాస్, పర్వతం కనకయ్య, నూనె కొమురయ్య, మోటం రాజు, సిరిగిరి మహేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

నవతెలంగాణ - గన్నేరువరం



మండల లయన్స్ క్లబ్ 320జి ఇయర్ మొదటి రోజున నుంచి నూతన కార్యవర్గం సభ్యులతో కలిసి సామాజిక కార్యక్రమాలను చేపడుతామని మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాంతాల కొండాల్‌రెడ్డి శనివారం అన్నారు. డాక్టర్స్ డే, స్థానిక వైద్యులకు, తపాలా బ్రాంచి పోస్ట్ మ్యాన్, రైతు దినోత్సవం సందర్భంగా పలువురికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. లయన్ సభ్యులు వడ్డే రాజిరెడ్డి జన్మదిన సందర్భంగా కేకు కోసి స్వీట్లు పంపిణీ చేశారు. జన్మదిన పురస్కరించుకొని పేదలకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని పేదలకు నిరంతరం బీపీ, షుగర్ టెస్టులు చేపట్టిన ముడికె బాలరాజు, తిరుమల్, తిప్పారం శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్, గంప వెంకన్న, బొడ్డు సునిల్, బూర రామకృష్ణ, తిప్పారం శ్రీనివాస్, తేల్ల భాస్కర్, మీసాల ప్రభాకర్, కాంతాల అంజిరెడ్డి, జీల ఎల్లయ్య, గౌతమ్, నాగరాజు, కాంతాల కిషన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-4 అభ్యర్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హెల్ప్ సెంటర్

నవతెలంగాణ - జమ్మికుంట


అభ్యర్థులకు పరీక్ష సెంటర్ దారి చూపుతున్న ఎండి.సజు

గ్రూప్-4 పరీక్ష కోసం దూర ప్రాంతాల నుండి వచ్చిన అభ్యర్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జమ్మికుంట బస్టాండ్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సజ్జద్ మొహమ్మద్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు సెంటర్ల సమాచారం అందించి సహాయం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దౌలత్, సాయిచరణ్, రాంరెడ్డి, నాగరాజ్, సాయి, అక్షయ్ రాజ్ పాల్గొన్నారు.

అపోలోలో డాక్టర్స్ డే వేడుకులు

నవతెలంగాణ-కరీంనగర్ : స్థానిక అపోలో రీచ్ హాస్పిటల్‌లో జాతీయ డాక్టర్ల దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో రీచ్ హాస్పిటల్ పరిపాలనాధికారి డాక్టర్ ఎస్.నాగ సతీష్ కుమార్ మాట్లాడుతూ..వైద్యో నారాయణోహరి అన్న నానుడి నిజము అని అన్నారు. మృత్యువు చివరి అంచుల దాకా వెళ్లిన వారికి ప్రాణం పోసే శక్తి ఈ వృత్తికి ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, నర్సింగ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలో..

శనివారం నేషనల్ డాక్టర్స్ డేని పురస్కరించుకొని ప్రఖ్యాత సర్జన్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణని జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్ శాలువాతో సత్కరించారు. అలాగే కరీంనగర్‌లో ప్రభుత్వాస్పత్రిలో గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ శౌరయ్యని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ప్రముఖ గైనకాలజిస్ట్ లిడియా జయరాణిని సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు రవీంద్రాచారి, అనంతగిరి వినయ్, పొన్నం మధు, భరత్, పల్లె సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

నవతెలంగాణ - చొప్పదండి : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలో శనివారం పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రోడ్డవేణి రాజు, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్రం సమర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాజన్నల తిరుపతి, తాడూరి శివకృష్ణ, బొడిగె సురేష్, తాడూరి రామకృష్ణ, గంగు సంపత్, రాకేష్, అనూస్, కళ్యాణ్, సాగర్, ఆకాష్, సాయి, హరీశ్ పాల్గొన్నారు.

దళిత యువతి శేజల్‌కు న్యాయం చేయండి

- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం

నవతెలంగాణ-గోదావరిఖని:

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని, రెండు నెలలుగా ఆందోళన చేస్తున్న దళిత యువతి శేజల్‌కు న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి రాజారత్నం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మద్దెల దినెష్, ఎర్రల రాజయ్యలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని గత రెండు నెలలుగా బెల్లంపల్లితోపాటు ఢిల్లీలో పార్లమెంటు ఎదుట నిరసన దీక్ష చేపట్టిన శేజల్‌కు ప్రభుత్వం గాని, అధికారులు గాని పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని వారు తెలిపారు. తెలంగాణలో అగ్రవర్ణ మహిళలు వేధింపులకు గురైతే ఎన్ కౌంటర్ చేయిస్తున్న ప్రభుత్వం దళిత మహిళలు వేధింపులకు గురైతే చర్యలు ఉండవా అని వారు ప్రశ్నించారు.

డయాగ్నోసిస్ హబ్ ద్వారా 134రకాల పరీక్షలు

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల మాతా శిశు ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంలో 57 నుంచి 134 రకాల పాథాలజీ పరీక్షలు అప్ గ్రేడేషన్ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. బాలింతలకు రక్త పరీక్షల రిపోర్టులు, న్యూట్రిషన్ కిట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా, జిల్లా గ్రంథాయ సంస్థ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ అందజేశారు.అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కోటి 30లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు

ఘనంగా ఏగోలపు సదయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ జన్మదినం దివ్యాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఇల్లందుల అంజిగౌడ్, శంకరి శ్రీకాంత్ గౌడ్,మార్క రాకేష్ గౌడ్, ఎరుకొండ సాయి,రేగుల అనీల్, మాదాసు హరీష్, మామిడిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-రామగిరి

రామగిరి మండలం కల్వచర్ల వద్ద లారీ బైక్‌ను ఢీకొట్టడంతో కారుపాకల సిద్దార్థ్‌కు(7) రెండు కాళ్ళు నుజ్జు నుజ్జు అయ్యాయి. బాలుడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పరామర్శించారు.

మృతురాలి కుటుంబానికి ఆది శ్రీనివాస్ ఆపన్న హస్తం

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఎర్ర మేరమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ 50 కిలోల బియ్యం కార్యకర్తల ద్వారా అందజేశారు. గ్రామ శాఖ అధ్యక్షులు కొత్తపల్లి అజయ్, సీనియర్ నాయకులు ఉప సర్పంచ్ మబ్బుల్, ఎండి సయ్యద్, జీవన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ -మెట్‌పల్లి



ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్‌పల్లి సభ్యులు శనివారం ప్రభుత్వ పాఠశాలలో చదువే విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్, మహేందర్ రెడ్డి,స్కూల్ హెడ్ మాస్టర్ ప్రశాంత్,శ్రినిష్ , దీపక్, రాజేష్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్

నవతెలంగాణ -మెట్ పల్లి



స్వాధీనం చేసుకొన్న ప్లాస్టిక్

మెట్‌పల్లి మున్సిపాలిటీలోని దుకాణ యజమానులు నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే కఠిన చర్యలు తీసుకొంటామని శనివారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని కిరాణా దుకాణాలు, అరటిపండ్ల బండ్లు,హెూల్ సేల్ కూరగాయల దుకాణాలపై దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్‌ని స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ఈ దాడుల్లో ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, సిబ్బంది ముజీబ్, నిజాం,షకీల్,శేఖర్ ,పాల్గొన్నారు.

డాక్టర్లను సన్మానించిన ఆర్‌ఎంపి, పిఎంపి అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ -మెట్ పల్లి

డాక్టర్స్ డే సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని పలువురు డాక్టర్లను మండల ఆర్‌ఎంపి, పిఎంపి అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆర్‌ఎంపి పిఎంపి డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు బండి శంకర్, గౌరవ అధ్యక్షులు గజంగి రాజ మల్లయ్య, ఉపాధ్యక్షులు సామర్ల గంగాధర్, సెక్రెటరీ జోగా నరసయ్య, కోశాధికారి కాషా గౌడ్ ,బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'అనాథల అరిగోస' దీక్ష

నవతెలంగాణ- మల్యాల



పాల్గొన్న నాయకులు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మల్యాల మండల కేంద్రంలో 'అనాథల అరిగోస దీక్ష (నిరసన) శనివారం నిర్వహించారు. దళిత నాయకులు మ్యాక లక్ష్మణ్ దీక్షపరులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. వారికి బొట్ల ప్రసాద్, ఆగంతపు వంశీదర్, జనగాం శేఖర్, బింగి వేణు, కట్కూరి మల్లేష్, ముదుగంటి రాజిరెడ్డి సందర్శించి సంఘీభావం తెలుపుతు మద్దతు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నాలువల సంజీవ్ ఆధ్వర్యంలో ముప్పారపు రవీందర్ కో కన్వీనర్, మారంపల్లి గంగాధర్, మల్యాల నారాయణ, మునుగురి అజయ్ , ఏనుగంటి లింగయ్య, పట జలపతి, విగ్నేష్, దిలీప్, రాజయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ యూత్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ- మల్యాల



ఎన్నికైన సభ్యులు

మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామంలో శనివారం పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ముదిరాజ్ యూత్ కార్యవర్గ యూత్ కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. తొంబై సభ్యులు గల సంఘానికి అధ్యక్షులుగా సబ్బని నరేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా రైల్ల రవి, క్యాషియర్‌గా రేగుల రవిలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సభ్యుని రాజేష్, రంగనేని బాలకష్ట, కోలకాని వెంకటేష్, ఓలపు భూమ గంగులు, గుర్రం అశోక్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రి ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని 48వ డివిజన్ లక్ష్మినగర్‌లో ఏర్పాటు చేసి లహరి డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అత్యాధునికరణ టెక్నాలజీతో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆసుపత్రి ప్రారంభించడం పట్ల అభినందించారు. ఆస్పత్రి వైద్యులు కె.లహరి, డాక్టర్ అశోక్, కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ తానిపర్తి విజయలక్ష్మి గోపాల్‌రావు, 27వ డివిజన్ కార్పొరేటర్ కలవల శిరీష సంజీవ్. డాక్టర్ క్యాస శ్రీనివాస్, సహజ రాజేందర్, డాక్టర్ సందీప్ తదితరులున్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రేపు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

నవతెలంగాణ-గోదావరిఖని:



తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూలై 3న ఇండ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాలో అధిక సంఖ్యలో ప్రజల పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ వేల్పుల కుమారస్వామి, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఐద్వా జిల్లా కార్యదర్శి మహేశ్వరి,సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవీందర్, కేవీపీ ఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, డివైఎఫ్ఐ రామగుండం ఈస్ట్ ఏరియా కమిటీ కన్వీనర్ కృష్ణాకుమార్ కో కన్వీనర్ సురేష్ పిలుపునిచ్చారు. కొన్ని నెలల నుండి కూడా ఇండ్లు లేని నిరు పేదలందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇల్లు నిర్మించు కోవడానికి రాష్ట్ర ప్రభు త్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్లతో నిరు పేదలందరూ కూడా ఇండ్ల సాధనకై పోరాటం సాగిస్తు న్నారని గుర్తు చేశారు. ఇల్లు లేని నిరుపేదల సమస్య రాష్ట్ర ప్రభుత్వం గుర్తించేలా ఎన్నో కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జులై 03న జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలందరినీ కూడా వెంటనే గుర్తించి ఒక్కొక్కరికి 125 గజాల ఇంటి స్థలం ఇచ్చేవరకు కూడా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తాము అని వారు తెలిపారు.

ఆర్జీ-1లో 107శాతం బొగ్గు ఉత్పత్తి

- ఉత్పత్తి వివరాలను వెల్లడించిన జీఎం చింతల శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో బొగ్గు ఉత్పత్తి ఆశా జనకంగా జరుగుతుందని, ఆర్జీ 1 ఏరియా నుంచి జూన్ మాసంలో 3,17,800 బొగ్గు ఉత్పత్తి లక్ష్యంకు గాను 3,41,250 టన్నులతో 107శాతం ఉత్పత్తి సాధించామని జీఎం చింతల శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023-24 సంవత్సరానికి ఆర్జీ 1 ఏరియాకు 43,80,000 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ఆర్జీ-1 ఏరియాలో ఇప్పటి వరకు 1569 మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్‌వాలిడేషన్ అవగా, 1368 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించటం జరిగిందని, అదే విధంగా 122 మందికి 25 లక్షల చొప్పున లంసమ్‌అమౌంట్ తీసుకోవటం జరిగిందని పేర్కొన్నారు. 13 మందికి ఎంఎంసి ద్వారా నెలకు 26 వేలచొప్పున ఇవ్వటం జరిగిందని, ఇప్పటి వరకు ఆర్జీ 1 ఏరియాలో మొత్తం 1503 మందికి లబ్ది చేకూరటం, సిపిఆర్ఎంఎస్ ద్వారా ఇప్పటి వరకు 5284 మందికి మెడికల్ కార్డ్‌లను పదవి విరమణ పొందిన కార్మికులకు అందించామన్నారు. వాటిలో 4851 మంది తమ కార్డులు రెన్యూవల్ చేసుకున్నారని, 433 మంది ఇంకా రెన్యూవల్ చేయాల్సి ఉందని తెలిపారు. వర్షాకాలం దష్ట్యా జీడికే 5 ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగ కుండా తగు చర్యలను చేపట్టటం జరుగుతుందని, క్వారిలో వర్షపు నీటిని తరలించుటకు హై కెపాసిటీ మోటార్లను ఏర్పాటు చేశామని జీఎం తెలిపారు. బొగ్గు రవాణా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ఆర్జీ 1 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి రవాణాను సాధించేందుకు కలిసి కట్టుగా పని చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైద్యుడు దేవునితో సమానమని పలువురు వక్తలు అన్నారు. రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, ట్రెజరర్ మనీషా అగర్వాల్ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని లయన్స్ భవన్‌లో ఘనంగా డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంట్ డే వేడుకలను నిర్వహించారు. మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రమోద్ కుమార్ రెడ్డి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ బి.అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ లక్ష్మీవాణి, డాక్టర్ సంక్షేమ రెడ్డి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సింధూర, డాక్టర్ బి అనిల్ కుమార్, డాక్టర్ సందీప్ కుమార్, డాక్టర్ కే.వెంకటేశ్వర్లుతోపాటు చార్టెడ్ అకౌంటెంట్ అఖిల్‌ను కూడా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. లయన్ సభ్యులు డి.లక్ష్మారెడ్డి, తిలక్ చక్రవర్తి, తానిపర్తి గోపాల్‌రావు, బంక రామస్వామి, మనోజ్ కుమార్, అగర్వాల్, కె రాజేందర్, పి.మల్లికార్జున్, ఎల్లప్ప, భేజీగోపాల్ త్రివేది, ఆంజనేయులు బిక్షపతి పాల్గొన్నారు.

అదేవిధంగా డాక్టర్స్ డే సందర్భంగా రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్‌ను మున్సిపల్ కార్పొరేటర్లు శనివారం ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నూరి సతీష్ కుమార్, మేకల సదానందం, పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్, కాంట్రాక్టర్లు ఉన్నారు. స్థానిక శారద నగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఆయా రంగాల్లో వైద్య సేవలు అందించిన డాక్టర్స్‌కి, చార్టర్ అకౌంటెంట్‌కి, పోస్ట్ మాస్టర్‌కి, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది అధ్యక్షులు కంకణాల ముకుంద రెడ్డి, సెక్రటరీ బాలసాని స్వామి గౌడ్, ట్రెజరర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. డాక్టర్స్ డే చార్టర్, అకౌంట్ డే, పోస్టల్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు రాజశేఖర్ రెడ్డి, అప్పా రావు, రాజేంద్ర ప్రసాద్, శిరీష, తిరుమలేషా, కిరణ్, అశోక్, మనుంజయ్‌లు సన్మానించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని:



ఇండ్లు, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపునిచ్చింది. అధ్యక్షులు వినాగమణి అధ్యక్షతన ఇంద్రమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీ ఇళ్ల స్థలాల పోరాట కేంద్రాల బాధ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి, ఇందిరమ్మ కాలనీ ఇండ్ల స్థలాల సాధన రెండవ కేంద్రం కన్వీనర్ ఎం.రామాచారి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్‌లో పవర్‌హౌస్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీ, జంగాలపల్లి ఈ నాలుగు కేంద్రాలలోని ప్రభుత్వ భూములలో మూడున్నర నెలలుగా పేదలు గుడిసెలు వేసుకుని పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ అనేకసార్లు తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఎనిమిది వేల పైన దరఖాస్తు పత్రాలు ఇచ్చి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. అంతేకాక సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో అనేక వినతి పత్రాలు ఇచ్చి కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశామని చెప్పారు. మూడు నాలుగు నెలలు గడిచిన ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, గుడిసెలు వేసుకున్న వారందరికీ 125 గజాలు భూమి కేటాయించాలని, నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రెండవ మరియు మూడవ కేంద్రం బాధ్యులు ఎన్.బిక్షపతి, సిహెచ్. ఉపేందర్, వి.నాగమణి తదితరులున్నారు.

ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు

టిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న గొర్రె రమేష్

రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ అన్నారు. గోదావరిఖనిలోని ఆర్టీసీ కాలనీలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో దళిత బంధు మొదట 1500 మందికి అని, ఆ తర్వాత 500 మందికి ఇస్తామని, ప్రస్తుత ఎన్నికలు వస్తున్న సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో 1100 మందికి దళిత బంధం అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం దళిత బందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయలేదన్నారు. ఈ పథకాన్ని రేపు మాపు అని ఎన్నికల ముందు కొంత మందికి ఇచ్చి చేతులు దులుపుకుంటారని అన్నారు. దళితులక 3 ఎకరాల భూమి ఇస్తానని మోసం చేసిదానికి దళిత బంధిస్తామంటున్నారని అన్నారు. నాయకులు కందిగంటి జగదీశ్వర్, కందింగటి నర్సింగ రావు, బాగా మల్లేశం, కొంకటి రామచందర్, తాండ్ర రాజయ్య, ప్రభాకర్ రెడ్డి, కోమిటిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజనారాయణ, రాజేందర్ రెడ్డి, మహేందర్, గోపాల్, రాజకుమార్ తదితరులున్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎల్అండ్‌టి సేఫ్టీ డే పురస్కరంచుకుని సంస్థ సహ వ్యవస్థాపకుడు హెన్నింగ్ హెూల్క్ లార్సెన్ 116వ జయంతి సందర్భంగా సింగరేణిలో నడుస్తున్న ఎల్అండ్‌టి సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల శాఖ వారి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎల్అండ్‌టి రామగుండం ఏరియా మేనేజర్ బి.లక్ష్మీ మోహన్ రెడ్డి, జెజె పాండియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరితో పాటు 30 మంది ఎల్ అండ్ టీ ఉద్యోగులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ దానం చేసిన రక్తాన్ని ప్రధానంగా తలసేమియా పిల్లలకు ఉపయోగిస్తామని తెలిపారు. రక్తదానం చేసిన సభ్యులందరికీ ప్రశంసా పత్రాలను అందించారు.

భద్రతా అవగాహన డ్రైవ్

నవతెలంగాణ-గోదావరిఖని:



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింగరేని ఆర్జీ 1 పరిధిలోని జీడీకే1, 3వ గనిపై రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ ఎస్.సాంబయ్య, జీడికె వన్ గ్రూప్ ఏజంట్ బి.సైదులు, ఏరియా భద్రతాధికారి బి.సత్య నారాయణ భద్రతా అవగాహన డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రమాదాలు తగ్గించుటకు, సురక్షిత పని విధానాలు, పద్ధతుల అమలుపై అవగాహన కల్పించారు.గని మెనేజర్ రమేష్ బాబు, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస రావు, టిబిజికెఎస్ ఫిట్ సెక్రటరీ నారాయణ, ఫిట్ ఇంజనీర్ ఎ.శివకుమార్, సంక్షేమాధికారి బి.హనుమంత రావు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ మైనింగ్ పి.కమలాకర్ తదితరులున్నారు.

అమెరికాలో ఎమ్మెల్యే చందర్‌కు ఘన స్వాగతం



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాటి ప్రతినిధులు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఐటి పార్కు ఏర్పాటు, నాటా సభల కోసం అమెరికా పర్యటనకు వెళ్ళిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు అమెరికాలో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ఐటి పారిశ్రామికవేత్తలు నాటా ప్రతినిధులు డల్లాస్ ఎయిర్‌పోర్ట్‌లో ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి పూల బొకేలతో స్వాగతం పలికారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 4 పరీక్ష

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన గ్రూప్ 4 పరీక్షా ప్రశాంతంగా ముగిసింది. రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని సబ్ డివిజన్‌కు చెందిన పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీస్ బందోబస్తును కల్పించారు.

ఘనంగా స్టేట్ బ్యాంక్ డే వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

గోదావరిఖని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్మీ నగర్ శాఖ బ్యాంక్‌లో బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం స్టేట్ బ్యాంక్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. వినియోగదారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రణధీర్ కుమార్, అకౌంటెంట్ శ్రీనివాస్, మల్యాల అంజయ్య, బ్యాంకర్స్, వినియోగదారులున్నారు.

నివాళి అర్పించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ వద్దనున్న కోనేరులో ఈతకు వెళ్లి చనిపోయిన రామగుండం కార్పొరేషన్ 34వ డివిజన్ విఠల్‌నగర్‌కు చెందిన సాయి కుమార్ మృతదేహాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం సందర్శించారు. పూలమాలలు వేసి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తఫా, నాయకులు బొంతల లచ్చన్న తదితరులున్నారు.

మల్యాల మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్

నవతెలంగాణ- మల్యాల

మల్యాల మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు తక్కళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న నిర్వహించనున్నట్టు ఎంఈవో అయిత. శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ప్రోగ్రెస్ రిపోర్ట్ , పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావాల్సి ఉంటుందని,ఎత్తు, బరువు, వయస్సు, వర్టికల్ జంప్, టెన్ ఇన్ టూ సిక్స్ షటిల్ రన్, 30 మీటర్ ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్స్ రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడిసిన్ బాల్ త్రోలలో యోగ్యత ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

ఆర్జీ-1 ఏరియాను సందర్శించిన జీఎం సేఫ్టీ కార్పొరేట్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి ఆర్జీ 1 ఏరియాను శనివారం జిఎం సేఫ్టీ కార్పొరేట్ కె.గురవయ్య సందర్శించారు. ఆర్జీ 1 ఏరియాలో జిడికె సిఎం, ఓసి మైన్‌ను సందర్శించి, బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఆయన వెంట ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్, పిఓ చంద్రశేఖర్, డిజిఎం డి.రామస్వామి, సేఫ్టీ ఆఫీసర్ పొనగోటి శ్రీనివాస్, సర్వే ఆఫీసర్ ఎండి.అలీ, డివై ఎస్ఇ మహేష్, పిసి పటేల్ రిప్రజెంటేటీవ్స్ మనీష్ పటేల్, పి.రవీందర్ తదితరులున్నారు.

ఆట పాటలతో స్ఫూర్తి నింపిన గాయకుడు సాయిచంద్



నవతెలంగాణ-గోదావరిఖని:

రాతి గుండెలను సైతం తన పాటతో కదిలించిన గొంతు మూగబోయిందని, తెలంగాణ ఉద్యమంలో తన ఆట పాటలతో స్ఫూర్తి నింపిన తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అని, ఆయన ఆకస్మిక మరణం పట్ల తెలంగాణ అసోసియేషన్ ఫర్ మాల, మాలల సంక్షేమ ఐక్యవేదిక, అన్ని పార్టీల మాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి గోదావరిఖని పట్టణంలో కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు.గుమ్మడి కుమార స్వామి, మాదాసు రామ్మూర్తి, మాలెం మధు, అయోధ్య రవి, పులి మోహన్, దొంత శ్రీనివాస్, గాదం నందు, అంబ శ్రీనివాస్, బోడ సమ్మయ్య, అందుగుల రాజేష్, బి.శ్యామ్, మర్రి ఐలయ్య, ముడుసు లక్ష్మణ్, సంగాల లక్ష్మణ రావు, నాగరాజు, దాసరి రాజు తదితరులున్నారు.

వేములవాడ పట్టణంలో హై టెన్షన్ వాతావరణం

- వడ్డీ వ్యాపారుల ఇండ్లు, వ్యాపార సముదాయాలపై పోలీసుల దాడులు
- భారీగా నగదు, విలువైన పత్రాలు స్వాధీనం
- అర్ధరాత్రి వరకు కొనసాగిన తనిఖీలు
- ఓ వ్యాపారి ఇంటి వద్ద 6గంటల పాటు కొనసాగిన హైడ్రామా
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవతో ఉత్కంఠకు తెర
- వాట్సప్ మెసేజ్‌కు తక్షణమే స్పందించిన ఎస్పీకి ప్రశంసలు





నవతెలంగాణ - వేములవాడ

రాజన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం వేములవాడ పట్టణంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇండ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. మొత్తం 12బృందాలతో ఈ దాడుల్లో భారీ ఎత్తున నగదు, పలు కీలక పత్రాలు, ప్రామిసరి నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే పట్టణంలోని ఓ వ్యాపారి ఇంట్లో, కార్యాలయంలో జరిపిన దాడుల్లో హైడ్రామా కొనసాగింది. వ్యాపారి దుకాణంలో ఉన్న మూడు బీరువాలకు తాళం వేసి ఉంచడం, తాళాలు పగలగొట్టేందుకు వ్యాపారి కుటుంబ సభ్యులు ఒప్పుకొకపోవడం, సదరు వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో సుమారు 6గంటల పాటు సంఘటన స్థలంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. కొంతమంది మీడియా ప్రతినిధులు, ఒక్క ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ అక్కడే పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే చివరికి విషయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి వెళ్లడంతో తర్వాత ఏమైందో ఏమో గాని అరగంటలోపే సంబంధిత వ్యాపారి ఇంటికి చేరుకోగా పట్టణ సీఐ వెంకటేష్ సమక్షంలో రాత్రి 11గంటల ప్రాంతంలో బీరువా తాళాలు తెరిచి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ సంబంధిత వ్యాపారి హైదరాబాద్ వెళ్లడంతోనే బీరువాల తాళాలు తెరవడంలో జాప్యం జరిగిందని, ఈ తనిఖీల్లో రూ.9.95 లక్షల నగదుతోపాటు పలు కీలక పత్రాలు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులు ఎవరైనా ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు వెంకట్రాజం, నాగరాజు, రామ్ రెడ్డి, సీసీఎస్ ఎస్సై మారుతి, ఎస్బీ ఎస్సై బాలకృష్ణ, ఎల్లారెడ్డిపేట ఎస్సై ప్రేమ్ దీప్, ఏఎస్సై సోనాతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే స్పందించిన ఎస్పీ..

తనిఖీల్లో భాగంగా పట్టణంలోని మటన్ మార్కెట్ సమీపంలోని ఓ వ్యాపారి కార్యాలయంలో చేపట్టిన తనిఖీల్లో ఉత్కంఠ నెలకొంది. సుమారు 6 గంటల పాటు సదరు వ్యాపారి అందుబాటులో లేకపోవడంతో బీరువా తాళాలు లేక సంఘటన స్థలంలోనే మీడియా ప్రతినిధులు, పోలీసులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వాట్సప్ సాయంతో విషయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్టు, ఎస్పీ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి చేరుకున్న వారు చివరికి వ్యాపారి చేత బీరువా తాళాలు తెరిపించి తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

సాయిచంద్ మరణం తీరని లోటు



నవతెలంగాణ - వేములవాడ : తెలంగాణ ఉద్యమ గాయకుడు, పోరాట యోధుడు, కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ రేషన్ చైర్మెన్ సాయిచంద్ ఆకస్మిక మరణం తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థల చైర్మెన్ చల్మెడ లక్ష్మీ నరసింహరావు అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని చల్మెడ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ సాయి చంద్ మరణం తీరని విషాదాన్ని నింపిందని, అతని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్ రావు, నాయకులు తీగల రవీందర్ గౌడ్, జీవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు కాలువ పూడికతీత

'నవతెలంగాణ' కథనానికి స్పందన



మానేరు కాలువలో పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

నవతెలంగాణ - ముస్తాబాద్ : రైతుల పొలాలు సాగు నీరందించే ఎగువ మానేరు ప్రాజెక్టు కాలువలు చెత్త, పిచ్చి మొక్కలతో నిండి ఉండడంపై నవతెలంగాణలో శనివారం ప్రచురితమైన 'మరమ్మతులేవి?' కథనానికి ఇరిగేషన్ శాఖ స్పందించింది. ఇరిగేషన్ డీఈ ఆదేశాలతో ఉపాధి హామీ కూలీల ద్వారా నామాపూర్, గూడెం, పోతుగల్, రామ్ రెడ్డి పల్లె గ్రామాలలో గల మానేరు కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. ముస్తాబాద్ మానేరు కాలువలో మురుగునీటి కాలువలను వదిలిపెట్టారని, ఉపాధి హామీ కూలీలు అందులో తీయడానికి నిరాకరించారని డీఈ తెలిపారు. ఈ విషయాన్ని పైఅధికారులకు కూడా తెలిపామని, మురుగనీటి కాలువలను మళ్లించి త్వరలో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు కాలువలను పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణం

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని తుర్కపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కాశోల్ల పద్మ-దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో సీసీ రోడ్లులేని వాడలలో ఈసీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గ్రామాలు గాంధీ కలలు కన్న స్వరాజంగా మారుతున్నాయన్నారు. పల్లెలన్నీ పచ్చదనంతో సీసీ రోడ్లతో చాలా చక్కగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు గూడూరి భరత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దేవదాస్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బాలయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు దుర్గ ప్రసాద్, దేవాలయ కమిటీ అధ్యక్షులు నర్సయ్య, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు సాయి ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు రంజిత్, శేఖర్, నర్సింలు, గ్రామపంచాయతీ సిబ్బంది పరుశురాములు, సుమన్, వార్డు మెంబర్లు అంబేద్కర్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు భరోసా

నవతెలంగాణ - వేములవాడ : బీఆర్ఎస్‌లో ఉండి, పార్టీ పటిష్టత కొరకు విశేషంగా కృషి చేసి వివిధ ప్రమాదాల్లో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అధిష్టానం భరోసా కల్పించింది. ఈ క్రమంలో వేములవాడ నియోజకవర్గంలో లబ్ధిదారులైన రుద్రంగికి చెందిన అంబటి ధనరాజ్, గుగులోత్ లక్ష్మీ కొనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన భూక్య విజయలకు రూ. 6లక్షల ప్రమాద భీమా చెక్కులను మంజూరు చేసింది. మరో నాలుగైదు రోజుల్లో ఎమ్మెల్యే రమేష్ బాబు చేతులమీదుగా వీటిని లబ్ధిదారులకు అందించనున్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 23మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.46 లక్షల భీమా చెక్కులు అందజేయడం జరిగిందని, దీనికి సహకరించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు.

3న కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా..

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్

నవతెలంగాణ - ముస్తాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన నిరుపేదలందరికీ డబల్ బెడ్రూం ఇండ్లను అందించాలని, లేకుంటే ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని, ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో నివాసం ఉన్న వారందరికీ పట్టాలను అందించాలని, ఖాళీ ప్లాట్లకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని తదితర డిమాండ్లతో జూలై 3న తెలంగాణ ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాతుల మహేష్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. అందులో భాగంగా మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూడా ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన హామీ ప్రకారం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించాలని, నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలని, సొంత స్థలం ఉన్న వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని జిల్లాలో ప్రభుత్వ స్థలాలలో నివాసముకున్న వారందరికీ వెంటనే పట్టాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో జూలై 3 సోమవారం రోజున అర్హులైన వారందరితో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన వారందరూ పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉదాతర చాటుకున్న టూ వీలర్ యూనియన్ సభ్యులు



నవతెలంగాణ - వేములవాడ : తమతో కలిసి పనిచేసే తోటి సభ్యుడి కూతురు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సాయం అందించి గొప్ప మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే వేములవాడ పట్టణానికి చెందిన టూ వీలర్ మెకానిక్ బొర్రోజు జనార్ధన్ కూతురు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అసలే నిరుపేద కుటుంబం, రెక్కాడితే గాని డొక్క నిండని వ్యవస్థ. ఇలాంటి సందర్భంలో తోటి వ్యక్తి ఆపదలో ఉన్నాడని తెలుసుకున్న వేములవాడ టూ వీలర్ అసోసియేషన్ సభ్యులు తమ వంతు సాయంగా రూ.25,500 పోగు చేసి శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆల్ టూ వీలర్ మెకానిక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, వేములవాడ పట్టణ అధ్యక్షుడు పిట్టల నాగరాజ్, ప్రధాన కార్యదర్శి మోటం సంజీవ్, క్యాషియర్ కందుల సురేష్, సంయుక్త కార్యదర్శి బోయిని కిషన్, ముఖ్య సలహాదారులు కటికె శ్రీనివాస్, కోరెం శ్రీనివాస్, నర్సింగోజు శ్రీనివాస్, వేముల భాస్కర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి రజక సంఘాల పాలాభిషేకం

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను రజకులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 102విడుదల చేయడం పట్ల రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగపల్లి దేవయ్య మడేల్ ఆధ్వర్యంలో శనివారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న మాదిరిగా రజకులకు హక్కులు కల్పించడం చాలా సంతోషంగా ఉందని, దీనికి కృషి చేసిన రాష్ట్ర నాయకులు అక్కిరాజు శ్రీనివాస్, దుబ్బాక రమేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే

గిరిజన సంఘాలు



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

పోడు భూములకు పట్టాలు ఇచ్చిన సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు గిరిజన నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు అజ్మీర తిరుపతి నాయక్, భూక్య వసంత్, గుండారం సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్, గుట్టపల్లి చెరువుతండా పుణ్య నాయక్, భూక్య శ్రీరామ్ నాయక్, భూక్య కైలాస్ నాయక్, గూగులోతు సురేస్ నాయక్, అజ్మీర రవి నాయక్, అజ్మీర రాజునాయక్, దేవుని గుట్ట సర్పంచ్ పెంటయ్య నాయక్ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు

- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు
- డయాగ్నోసిస్ హబ్ ద్వారా 134రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహణ
- వ్యాధుల ముందస్తు నిర్ధారణ ద్వారా వేగవంతంగా చికిత్స
- ప్రతి జిల్లాలో రేడియాలజి, పాథాలజీ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి
- రూ.5కోట్ల 25 లక్షలతో డయాగ్నొస్టిక్ హబ్, రూ.కోటితో 5పడకల డయాలసిస్ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - పెద్దపల్లి : రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం ఆధునిక వసతులతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నదని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 8పాథాలజీ, 16 రేడియాలజీ, డయాలసిస్ కేంద్రాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ టి.భాను ప్రసాద్ రావు, టిఎస్ఎంఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మోహంతి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌లతో కలిసి రంగారెడ్డి జిల్లాలోని లోని కొండాపూర్ ఏరియా ఆసుపత్రి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి నుంచి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మెన్ పుట్ట మధుకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ జిల్లాలో ఏఎన్ఎం సబ్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వాటిని త్వరగా పూర్తి చేసే దిశగా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలను జెడ్పీ చైర్మెన్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తప్పనిసరిగా పరిశీలించాలని మంత్రి కోరారు. అనంతరం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో కోటి రూ.25లక్షలతో నిర్మించిన డయాగ్నొస్టిక్ హబ్ భవనాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. రూ.4కోట్ల పైగా విలువ చేసే సామాగ్రి వచ్చిందని, ప్రజలకు మరింత విస్తృతంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. వైద్యరంగంలో అద్భుతమైన మార్పులు వచ్చాయని, పెద్దపల్లిలో సైతం 100పడకల మాతా, శిశు ఆసుపత్రి నిర్మించుకున్నామని, రూ.కోటితో 5పడకల డయాలసిస్ కేంద్రం ప్రారంభించుకున్నామని, ఫిజియోథెరపీ కేంద్రం, సైకాలజీ వైద్య చికిత్సలు సైతం అందుబాటులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా 134రకాల వైద్య పరీక్షలను ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నదని, ప్రైవేట్ ఆస్పత్రులలో 10వేలు ఖర్చు అయ్యే వైద్య పరీక్షలను సైతం ప్రభుత్వం ఉచితంగా అందించడం వల్ల పేదవారికి చాలా ఉపయోగపడుతుందని, డయాలసిస్ కోసం గతంలో హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేదని, నేడు తెలంగాణ ప్రభుత్వం దాదాపు ప్రతి నియోజకవర్గ పరిధిలో అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో రూ.కోటితో ఏర్పాటుచేసిన ఐదు పడకల డయాసిస్ సెంటర్‌ను, ఫిజియోథెరపీ కేంద్రాన్ని, సైకాలజీ, మెంటల్ హెల్త్ క్లినిక్ యూనిట్‌లను మంత్రి ప్రారంభించారు.

కనిపించే దేవుళ్ళే డాక్టర్లు : ఎంపీపీ పిల్లి రేణుక




నవతెలంగాణ- ఎల్లారెడ్డిపేట : సృష్టిలో కనిపించని దేవుడు ఒక్కరైతే మన కళ్ళెదుట కనిపించే దేవుళ్లు డాక్టర్లు అని ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ అధ్యక్షురాలు పిల్లి రేణుక కిషన్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా శనివారం ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్‌లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.సత్యనారాయణ స్వామిని ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డిలు కలిసి శనివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు పిల్లి రేణుక కిషన్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అందుబాటులో వైద్యాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో డాక్టర్ జి.సత్యనారాయణ స్వామి 40ఏళ్లుగా అశ్విని హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు ఎండీ మజీద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అందుబాటులో అశ్విని ఆసుపత్రిలో అత్యాధునిక టెక్నాలజీతో సిటీ స్కాన్, డయాగ్నోస్టిక్ ల్యాబ్, ఆర్థో విభాగం, ఫిజియోథెరపి చికిత్స, ఉచితంగా కంటి ఆపరేషన్లతో పాటు పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీ విభాగాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎలగందుల అనసూయ నర్సింహులు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు అప్సరా ఓన్నిసా, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య సీత్యానాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడ్ల సందీప్, గొల్ల కురుమ యాదవ సంఘం మండల అధ్యక్షుడు మెండే శ్రీనివాస్‌యాదవ్, బందారపు బాల్‌రెడ్డి, బొల్లు భూమయ్య యాదవ్, తిమ్మాపూరం రాజయ్య, జర్నలిస్ట్ రవి, శేఖర్, దీప్తి తదితరులు పాల్గొని డాక్టర్ సత్యనారాయణ స్వామికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే



నవతెలంగాణ- కరీంనగర్ : కరీంనగర్‌లోని డే కేర్ సెంటర్‌లో అంతర్జా తీయ డాక్టర్స్ డే కార్యక్రమం శ్రీసప్తగిరి మహిళా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు పన్యాల సుజాత, కార్యదర్శి కంటే సునీత దేవి ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మానస వీణ, డాక్టర్ భాను ప్రకాష్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి విమల, ఉమారాణి, జోనల్ చైర్‌పర్సన్ శ్రీహరి రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు పన్యాల వెంకటరెడ్డి, జనార్ధన్ రావు, చింతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్, సీఏ లకు సన్మానం



నవతెలంగాణ-కరీంనగర్

డాక్టర్స్, సీఏ డే సందర్భంగా డిస్ట్రిక్ వీ107ఏ రీజియన్ 4లో ఉన్న ఏడు క్లబ్బులు ఒకే వేదికపై డాక్టర్స్, సీఏ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో జంధ్యం మాధవి, ఐపీసీ పబ్బ అరుణ, ఆర్సీ ప్రదీప్, జెడ్సీ రాధాక్రిష్ణ, గాయత్రి, గంగాధర్, అంజనీ ప్రసాద్, ఎంఆర్ వైశ్యభవన్ ప్రెసిడెంట్ శేఖర్, డాక్టర్ పబ్బ కైలాస్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సందీప్, డాక్టర్ దిలీప్, డాక్టర్ రాజు, డాక్టర్ మాధురి, సీఏ ఆదిత్య, నవీన్ తదితరులను సన్మానించారు.

కంటి దవాఖానలో డాక్టర్స్ డే



నవతెలంగాణ-కరీంనగర్

డాక్టర్స్ డే సందర్భంగా కరీంనగర్ లయన్స్ క్లబ్ నేత్ర వైద్యశాలలో ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్లు విజయదేశముక్, పి.శ్వేత, మెతుకు స్వాతి, హారిక, మైమునా మహవీష్, స్వాతిశ్రీ లను కంటి దవాఖాన హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి సిబ్బంది కూడా డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ డి.అపర్ణ రెడ్డి హాజరయ్యారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను వీక్షించి అభినందించారు. చైర్మెన్ కొండ వేణుమూర్తి అభ్యర్థన మేరకు వెంటనే క్యాష్ డిపాజిట్ ఏటీఎంను సాంక్షన్ చేశారు. ఇక ముందు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆస్పత్రికి సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మెన్ చిదుర సురేష్, ప్రకాష్, డాక్టర్ మురళీధర్ రావు, కోల అన్నా రెడ్డి, క్లబ్ అధ్యక్షులు లంబు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి రాగి శ్రీనివాస్, క్లబ్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

ప్రముఖ ఈఎన్టీ వైద్యులు రమణాచారి



నవతెలంగాణ-కరీంనగర్

వైద్య వృత్తి అతి పవిత్రమైందని, వైద్యుల వద్దకే రోగులు వస్తారని, వారికి సరైన వైద్య చికిత్స చేసి సమాజ ఆరోగ్యానికి ప్రాణం పోస్తున్నారని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సిహెచ్ రమణాచారి అన్నారు. శాతవాహన లయన్స్‌క్లబ్ సౌజన్యంతో కేశవ ఈఎన్టీ ఆస్పత్రి ప్రాంగణంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ..ప్రముఖ వైద్యులు డాక్టర్ బీసీ రాయ్ జన్మదినం సందర్భంగా జాతీయ వైద్యుల దినం జరుపుకుంటున్నామని, వారి జీవిత విలువలకు పట్టం కడుతూ వైద్య సమాజం బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా వైద్యం చేసి పుణ్యాన్ని మూటగట్టుకోవాలని కోరారు. అలాగే జాతీయ చార్టర్డ్ ఎకౌంటెంట్ దినం సందర్భంగా ప్రముఖ సీఏ డి.నిరంజనా చారి మాట్లాడుతూ..దేశ ఆర్థిక పరిపుష్టికి సీఏలు ఎనలేని సేవలు చేస్తున్నారని, ప్రభుత్వానికి పన్ను చెల్లింపుదారులకు మధ్య వారధిగా సీఏలు విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం లయన్ యాదగిరి శేఖర్ రావు మాట్లాడారు. నగరంలోని ప్రముఖ వైద్యులు లయన్ సీహెచ్ రమణాచారి, డాక్టర్ వేణుగోపాల్ రావు, డాక్టర్ రవి మల్లారెడ్డి, డాక్టర్ యూసఫ్ మహ్మద్, డాక్టర్ దీక్షిత్ బొజ్జలను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇదే సందర్భంగా ప్రముఖ సీఏలు దుర్శెట్టి నిరంజనాచారి, యశ్వంత్‌లను కూడా క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లయన్ లక్ష్మారెడ్డి, కోశాధికారి లయన్ కోట సత్యం, లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ వడకాపురం జగదీశ్వరాచారి, లయన్ మేచినేని సత్యనారాయణ రావు, లయన్ సంగోజు మనోహరాచారి, లయన్ మేకల అరవింద్ బాబు, లయన్ రాంమోహన్ రావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వినికిడి లోప నిర్ధారణ పరీక్షలు :

జాతీయ వైద్యుల దినం సందర్భంగా కేశవ ఈఎన్టీ ఆస్పత్రి సౌజన్యంతో రూ.1500ల విలువ గల ఆడియోమెట్రీ పరీక్షలను ఉచితంగా చేశారు. ఇందులో 52 మందికి వినికిడి లోప పరీక్షలు నిర్వహించామని డాక్టర్ రమణాచారి అన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

కాంగ్రెస్ జెండా పండుగలో కెకె మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : రాష్ట్రంలోనే కాదు సిరిసిల్లలో కూడా దోపిడీ రాజ్యం నడుస్తున్నదని, ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఓబులాపూర్, వేణుగోపాల్‌పూర్ గ్రామాలలో శనివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని కొంతమంది రైతులు, యువకులు, మహిళలు మేము సైతం అంటూ పార్టీలో చేరేందుకు ముందుకు రావడంతో వారికి కండువా కప్పి కేకే పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్ తెలంగాణ నిర్మించడానికి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, అల్వాల్ లక్ష్మణ్, గట్టు లింగారెడ్డి, మండల నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్, పరశురాములు, మునిగల రాజు, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, బాలసాని శ్రీనివాస్, అరెపల్లి బాలు, శ్యాము, శ్రీనివాస్ చిలుక, తిరుపతి, రాజు మహిళా నాయకులు హారిక రెడ్డి, సరితా, సంగీత, మైనార్టీ నాయకులు ఇక్బాల్, మహమ్మద్, అలీ, మల్లయ్య, కనకయ్య పాల్గొన్నారు.

ఇల్లులేని నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ - బోయినిపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ(ఎం) కార్యకర్తలు ఇల్లు లేని నిరుపేదల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గురుజాల శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో ఎంతోమంది నిరుపేదలు ఇల్లు లేక కిరాయి రూములలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే స్థానిక నాయకులు అధికారులు వారిని గుర్తించి ఇల్లు లేని వారికి డబ్బులు బెడ్ రూమ్ పథకం ద్వారా ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించేలా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 3సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉదయం 10గంటలకు పెద్ద ఎత్తున జరిపే ధర్నా కార్యక్రమానికి ఇల్లు లేని నిరుపేదలు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, రైతు సంఘం అధ్యక్షులు రామంచ అశోక్, ఇల్లు లేని పేదలు టేకు నరసవ్వ, హనరాశి సర్వ, టేకు పద్మ పత్రి కవిత, పత్రి కనకవ్వ, వానరాశి మల్లవ్వ పాల్గొన్నారు.

అలుగునూర్‌లో బోనాల పండుగ



నవతెలంగాణ - తిమ్మాపూర్ : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ముదిరాజు కులస్థులు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ కుల దైవం పెద్దమ్మకు ముదిరాజులు ఐదేళ్లకోసారి నిర్వహించే పెద్ద పట్నాల పండుగ శనివారం సాయంత్రం ప్రారంభం కాగా, ఇంటికో బోనంతో అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. సంఘం అధ్యక్షుడు సిల్ల రాములు ఇంట్లో మొదటి బోనాన్ని కార్పొరేటర్ సల్ల శారద రవీందర్ నెత్తిన ఎత్తుకొని వేడుకను ప్రారంభించారు. డప్పు చప్పుళ్లతో ముదిరాజు కులస్తులు ఆలయానికి ర్యాలీ గా వెళ్లారు.

ఎమ్మెల్సీ పాడీ కౌశిక్ రెడ్డిపై నేషనల్ బీసీ కమిషన్ వైస్ చైర్మెన్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ - హుజురాబాద్ : ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై జాతీయ బీసీ కమిషన్ వైస్ చైర్మన్ హంసరాజు గంగరాజుకు శనివారం ఢిల్లీలో రంగాపూర్ గ్రామ సర్పంచ్ బ్రింగి కరుణాకర్ ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాలతో గ్రామంలో ఒక వ్యక్తి ఇల్లు కూల్చివేసిన విషయంపై ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తనను అవమానకరంగా మాట్లాడాలని వివిధ ఛానల్లో తనను అవమానించారని ఆయనపై చర్య తీసుకోవాలని కోరారు.

మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కిన యువకుడు

నవతెలంగాణ - మానకొండూర్ : మద్యం మత్తులో మండలకేంద్రానికి చెందిన ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేసిన ఘటన శనివారం మానకొండూర్ మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన ఆనంతోజు సాయి కిరణ్ మద్యం సేవించి మత్తులో వైన్స్ సమీపంలోని సెల్ టవర్ పైకి ఎక్కి హంగామా సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికివెళ్లి సాయికి సముదాయించి సెల్ టవర్‌పై నుంచి కిందికి దించారు. అనంతరం ఆ యువకున్ని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వన్య ప్రాణులకు ముప్పు

కుక్కలతో వేట.. హరించుకుపోతున్న నేమళ్లు



నవతెలంగాణ - కొనరావుపేట : మండలంలోని సుద్దాల మంగళపల్లి మారుపాక కుంట సరిహద్దులలో కొన్ని రోజులుగా అర్ధరాత్రి ఫోకస్ లైట్లు వేట కుక్కలతో కొందరు వేటగాళ్ల వన్యకారులను వేటాడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కడ పడితే అక్కడ వలలు బంధించి వాటిలో చిక్కిన వన్యప్రాణులను అంతమొందిస్తున్నారు. నెమళ్లు, కంజు పిట్టలు, అడవి పందులు, కుందేళ్ల అడవి నుంచి మాయమైపోతున్నాయి. ఎక్కువగా అడవి జంతువులు తిరిగే చోట వేటగాళ్లు ఈ ఉచ్చులను వేస్తూ వన్యప్రాణులను బలితీసుకుంటున్నారు.

పల్లెల్లో అంతరించిపోతున్న నెమళ్ళ కూతలు.. : ప్రకృతి ప్రకాష్, సుద్దాల

వన్యప్రాణులకు నిత్యం గ్రామ శివారులోని అటవీ ప్రాంతాల్లో ఉచ్చులు పెడుతూ బలిస్తున్నారు. ఇకనైనా అటవీ అధికారులు చొరవ చూసుకొని కట్టడి చేయాలి. వేటగాళ్లను పట్టుకుని చర్యలు తీసుకోవాలి.

జూన్ మాసానికి ఆర్జీ-3, 116 శాతం ఏఎల్‌పి 70 శాతం

నవతెలంగాణ-రామగిరి

జూన్ మాసానికి సింగరేణి రామగుండం-3 ఏరియా 116 శాతం ఏఎల్‌పి ఏరియా 70శాతం ఉత్పత్తి సాధించాయని ఆర్జీ3 ఏరియా జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతూ... జూన్ నెలకు రామగుండం-3 ఏరియా 3.70 లక్షల టన్నులకు గాను 4.29 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 116 శాతం సాధించినదని తెలిపారు. ఏప్రిల్ నుండి జూన్ వరకు ఆర్జీ-3 ఏరియా మొత్త మ్మీద 119 శాతం బొగ్గుఉత్పత్తిని సాధించాయని తెలిపారు. అదేవి ధంగా మట్టితొలగింపు (ఓబి) లో రామగుండం-3 మొత్తమ్మీద 14.50 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 13.50 లక్షల క్యూ బిక్ మీటర్లు మట్టి తొలగించి 93 శాతం సాధించిందనీ తెలిపారు. ఏప్రిల్ నుండి జూన్ వరకు గాను ఓబి 88 శాతం సాధించిందని, ఓసి-1 సిహెచ్ పి నుండి జూన్ నెలలో 6.62 లక్షల టన్నుల బొగ్గు రవాణ కాగా , ఏప్రిల్ నుండి జూన్ వరకు 19.97 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేసినట్టు తెలిపారు. ఉత్పాదకత (ఓఎం ఎస్) జూన్‌లో ఆర్జీ 3 8.96 కాగా, మూడు నెలల మీద 9.24 సాధించింది.ఈ కార్యక్రమంలో ఏరియ ఇంజనీర్ ఎలీషా, ఓసిపి-ట పిఓ మత్స్యగిరి నరేందర్, డీజీఎంలు ఐఇడి కె చంద్రశేఖర్,సివిల్ పద్మరాజు, డీవైపిఎంలు రవీందర్ రెడ్డి,కె మారుతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని కుస్తాపూర్ గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ సీనియర్ డాక్టర్ సాదుల వెంకటస్వామిని సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ముత్యాల రమేష్, సామాజిక సేవకులు లవంగ శివకుమార్, ఇల్లెందుల మనోజ్‌కుమార్, గన్నారపు సురేష్, తదితరులు ఉన్నారు.

ఆర్జీ-2లో జాతీయ వైద్యుల దినోత్సవం

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:

భారత రత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆర్జీ2 ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ పాల్గొని కేక్ చేశారు. వైద్యం అంటే ఒక వృత్తిగా కాకుండా మనుషులను బతికించే ఓ మహాశక్తిగా కొనియడారు.డీజీఎం పర్సనెల్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పివి.రమణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, డాక్టర్ ఎస్.గౌతమి, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్యారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



గోదావరిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వేములకుర్తి గ్రామానికి చెందిన బక్కి పెద్ద నర్సయ్య(70) వృత్తిరీత్యా గంగపుత్రులు కావడంతో గోదావరి నదిలోకి చేపలు పట్టడానికి శుక్రవారం ఉదయం వెళ్ళాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో గోదావరి ప్రాంతంలో వెతుకగా వలలో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడు బక్కి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వివరించారు.

వ్యాగ్జిన్ తనిఖీ

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:



జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ గురువయ్య, ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్, జీఎం సేఫ్టీ ఆర్జీ రీజియన్ ఎస్. సాంబయ్య, జిఎం ఎక్స్ప్లోజివ్స్ కష్ణ గోపాల్ తివారీ తో కలిసి ఉప్పట్ల కేసారం వద్ద ఉన్న మెయిన్ మాగ్జిన్‌ను శనివారం తనిఖీ చేశారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దాసరి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ఓదెల



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఓదెల మండలం గూడెం గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు పాలాభిషేకం చేశారు.రబీ సీజన్‌లో భారీ వర్షాల దెబ్బతిన్న పంటలకు ఎకరాలకు రూ.10వేలు వేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. శనివారం నష్టపరిహారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్ర పటాలకు పలాభిషేకం చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు రేగుల సంపత్, గ్రామ ఉపసర్పంచ్ బోనగిరి రాజయ్యవార్డ్ మెంబర్ బుడిగే సమ్మయ్య, తిప్పారపు రాజేందర్, ఒజ్జ కొముం"య్య, బుడిగే సతీష్, కర్ర రవీందర్, ఆషాడపు రాకేష్, కొలకాని హరీష్,బండారి రాములు, వీర ముష్టి రాజ్‌కుమార్, కర్ర సుధాకర్, బుడిగే సదయ్యవీర ముష్టి చంద్రమోహన్, నరిగె సంపత్, ఉప్పుల నారాయణ, ఆషాడపు సాంబయ్య, చిట్ల గణేష్, ఆషాడపు రామయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్ష

నవతెలంగాణ-రామగిరి

మంథని జేఎన్టీయూలో శనివారం జరిగిన గ్రూప-4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్స్ జరిగిన పరీక్షలో 82 శాతం మంది విద్యార్థులు హజరైనట్టు ఛీఫ్ సూపరింటెండ్ బి విష్ణువర్ధన్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలో 1369 మందికి గాను 1129 మంది హజరు కాగా 240 మంది గైర్హాజరైనారనీ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 1127 మంది హజరుకాగా 242 మంది పరీక్షకు హజరు కాలేదన్నారు. మధ్యాహ్నం అధికంగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు కాగా ఒక్కరు ఉదయం పరీక్షకు హజరు కాకుండా సాయంత్రం పరీక్ష వ్రాయడం గమనార్హం. ఉదయం ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంథని సిఐ గడిగొప్పుల సతీష్, రామగిరి ఎస్ఐ కటికే రవిప్రసాద్, సిబ్బంది బందోబస్తు నిర్వహిం చారు. మంథని ఆర్డీవో వీరబ్రహ్మయ్య పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

యువ యాదవమహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తిరుపతి యాదవ్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్




అఖిల భారత యాదవ మహాసభల అనుబంధమైన యువయాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మారం తిరుపతి యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు అయిలబోయిన రమేష్ యాదవ్ శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. తిరుపతియాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యాదవ యువతను మమేకం చేస్తూ రాజ్యాధి కారం కోసం సంఘటితం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబురావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జైకే శేఖర్ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, బైకాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ యశ్వంత్ రాజ్ యాదవ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు పలుమారు మల్లేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

పెద్దపల్లి జడ్పీ చైర్మెన్ పుట్టమధూకర్

నవతెలంగాణ-మంథని



మంథని పట్టణంలోని బొక్కలవాగు వంతెనపై ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని పెద్దపల్లి జడ్పీ చైర్మెన్ పుట్ట మధూకర్ కోరారు. ఈ నెల 4న దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ చేపట్టనున్న క్రమంలో శనివారం మంథని పట్టణంలోని రాజగృహలో విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ ,పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, భూపాలపల్లి జెడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్‌లు హాజరుకానున్నట్టు తెలిపారు.

రైస్ మిల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

నవతెలంగాణ-మంథని



మాట్లాడుతున్న ఎరవెల్లి ముత్యంరావు

రైస్ మిల్లుల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. మంథని ప్రాంతంలోని రైస్ మిల్లులను సీఐటీయూ జిల్లా బృందం శనివారం సందర్శించింది. రైస్ మిల్లులో పని చేస్తున్న ఆపరేటర్స్, గుమస్తాలు, హమాలీలు, లేబర్ తదితర కార్మికులను వారి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనేక సమస్యలు కార్మికులు సీఐటీయూ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. చట్టానికి విరుద్ధంగా 12 గంటల పని విధానం రైస్ మిల్లులో అమలు చేస్తున్నారని, పండుగ సెలవులు, ఆదివారాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచాల్సిన కనీస వేతనాలను 2007 నుంచి ఇప్పటి వరకు 15ఏండ్లుగా పెంచకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీని మూలంగా యజమానులతో చర్చించి వేతనాలు పెంచుకునే శక్తి తగ్గిపోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో కార్మికుల కుటుంబాల జీవితం దుబ్బరంగా మారిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లు కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి, నెలకు కనీస వేతనం రూ.26వేలగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లులో చట్ట బద్ధమైన సౌకర్యాలు అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ సంబంధిత కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. రైస్ మిల్లులో పని చేస్తున్న అన్ని విభాగాల కార్మికులందరూ ఐక్యంగా రాబోయే రోజుల్లో జరిగే పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ బృందంలో రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అంజయ్య సీఐటీయూ మంథని డివిజన్ నాయకులు బూడిద గణేష్ పాల్గొన్నారు.

బీసీలకు సర్కారు పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :



వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

రాష్ట్రంలో బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు బీసీ భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని విధంగా సీఎం కేసీఆర్ బీసీల ఆత్మగౌరవం కోసం భవనాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు మానాల కిషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సతీష్ రాజు, కార్యదర్శి బండారి విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు యువజన బీసీ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుల సంఘాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

జగిత్యాల పట్టణంలోని 11,12 వార్డులో రూ.5 లక్షలతో నిత్య వైష్ణవ మిత అయ్యల్వార్ సంఘ భవనం, మరో రూ.5 లక్షలతో దొమ్మరి కుల సంఘం భవన నిర్మాణం, మరో రూ.5 లక్షలతో వడ్డెర కుల సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ బాలే లత శంకర్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు దామోదర్‌రావు, సమిండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

వైద్య వృత్తి పవిత్రమైనదని, వైద్యుల సేవలు వెలకట్ట లేనివని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, గౌరవ సలహాదారు జీఆర్. దేశాయ్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి, ఎం.డి.యాకుబ్, నాయకులు పాల్గొన్నారు.

మొదటి త్రైమాసికంలో 98 శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం ఏ .మనోహ

2023-24 ఆర్థిక సంవత్సరంలో జూన్ మాసానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డన్ వెలికితీత రవాణా వివరాలను ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 22,84,400 టన్నులకు గాను 22,34,596 టన్నులు 98 శాతంలో బొగ్గు ఉత్పతి లక్ష్యాలను అలాగే ఓబీ 94 శాతంగా సాధించినట్టు పేర్కొన్నారు. అలాగే వర్షాల కారణంగా జూన్ మాసంలో 7,55,000 టన్నులకు గాను 6,92,736 టన్నులతో 92 శాతం బొగ్గు ఉత్పతి లక్ష్యాలను, ఓబీ వెలికితీత 48,75,000 క్యూబిక్ మీటర్లగాను 43,31,675 క్యూబిక్ మీటంౕతో 89 శాతం ఓవర్ బర్డన్ వెలికి తీయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఓసిపి-3 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డిజిఎం (పర్సనల్) అధికార ప్రతి నిధి జి.రాజేంద్రప్రసాద్, డిజిఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం సివిల్ ధనుంజయ, డిజిఎం (ఐఈ) మురళి కృష్ణ, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి బాయ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచితంగా కంది విత్తనాలు అందిస్తాం

నవతెలంగాణ-రామగిరి



రత్నాపూర్ గ్రామస్తులతో కెవికె సైంటిస్టులు

రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కే.వీ.కే) ద్వారా ఉచితంగా కంది విత్తనాలు అందిస్తామని కే.వీ.కే సైంటిస్టులు డాక్టర్. పిల్లి కిరణ్ (సాయిల్ టెస్ట్), డాక్టర్ టి.వినోద్‌కుమార్ (వ్యవసాయ విస్తరణ) అన్నారు. శనివారం రత్నాపూర్ గ్రామంలో కంది పంట ఆవశ్యకతపై సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. టి.బి.ఆర్.జీ-59 తాండూర్ సీడ్స్ వంగడాలు ఉచితంగా 50 ఎకరాలకు అందిస్తామని వారు తెలి పారు.ఈనెల 15-30వ తేదీలోగా కంది పంట వేయాలని వారు సూచించారు. 170 రోజులలో పంట చేతికి వస్తుందని, ఉచితంగా సీడ్స్‌తో పాటు కలుపు మందు ఇస్తామని తెలిపారు. క్వింటాల్ కంది ధర రూ.8200 వరకు ఉందన్నారు. ఎకరానికి 8 క్వింటాల వరకు పంట వస్తుందని తెలిపారు. పత్తి పంటలో అంతర్గత పంటగా కంది పంట వేయవచ్చునన్నారు. కంది విత్తనాలు బుధవారం రైతులకు గ్రామపంచాయతీ ఆవరణలో అందిస్తామని, కావల సినవారు కేవీకేలో ఆధార్‌కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్‌తో సంప్రదించాలని వారు కోరారు. సమావేశంలో రైతులు సందేవేన కుమార్ భద్రపు కృష్ణ, పానగంటి ప్రశాంత్, కొండు నగేష్, సోమరపు కనకయ్య, భద్రపు శంకరయ్య, ధర్మల సంజీవ్, మేకల కొమురయ్య, ముక్కెర రంజిత్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేశారు..భవన నిర్మాణం మరిచారు

- నేతకాని సంఘం సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



కమ్యూనిటి భవన నిర్మాణం కోసం నాలుగేండ్ల క్రితం మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని పాలకుర్తి మండలం రామారావుపల్లి నేతకాని కుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం మహేష్, జిల్లా అధ్యక్షుడు గోలె రాజ్ కుమార్ మాట్లాడారు. రామారావుపల్లిలో 126 నేతకాని కుటుంబాలు, 5వందల జనాభా ఉన్నట్టు తెలిపారు. వీరందరి కోసం కమ్యూనిటి భవన నిర్మాణం కావాలని కోరడంతో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపి వెంకటేష్ నేత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ భూమి పూజ చేశారని తెలిపారు. నేటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపి వెంకటేష్ నేత తమ జాతికి చెందినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. గ్రామ అధ్యక్షుడు పాయిడి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మంచినీళ్ళ బాబూనాథ్, జాడి పోచయ్య, లాటుకూరి రమేష్, దుర్గం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కమాన్‌పూర్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పెద్దపల్లి

ఎస్ఎఫ్ఐ కమాన్‌పూర్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు జిల్లాల ప్రశాంత్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అనవేన కార్తిక్, మండల కార్యదర్శిగా మల్యాల వినయ్, మండల ఉపాధ్య క్షులుగా అశ్వంత్, నవదీప్, మండల సహాయ కార్యదర్శులుగా సతీష్, అభిలాష్, కమిటీ సభ్యులుగా రాహుల్, శివకుమార్, వినయ్, ప్రశాంత్, ఉదయ్, కార్తీక్,సారధి, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జిల్లల ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులే కృషి చేయాలన్నారు.

ఎమ్మార్పీస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నాగరాజు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కోండ్ర నాగరాజు నియమితులయ్యారు. శనివారం జరిగిన సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కోండ్ర శంకర్ నియామక పత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య ప్రధాన కార్యదర్శి వంగపల్లి శ్రీనివాస్, తదితరులకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి పెర్క నవీన్, రాజ్ కుమార్, కొయ్యల మొండి, నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో పెద్దపల్లి నాయకులకు చోటు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణశాఖ ఆధ్వర్యంలో జూన్ 28, 29,30 తేదీలలో పాలమూరులో ప్రాంతీయ అభ్యా సవర్గ సమావేశాలు నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.కార్యవర్గంలో పెద్దపల్లి జిల్లాకు ప్రముఖ స్థానం లభించింది. ఏబీవీపీ విభాగ్ కన్వీనర్‌గా కోడి అజయ్, జిల్లా కన్వీనరుగా బండి రాజశేఖరును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి నియామక పత్రం అందించారు.

ఈనెల 4న ధర్మపురి మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక

నవతెలంగాణ-ధర్మపురి

ఈ నెల 4న ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వ హిస్తున్నట్టు మండల విద్యాధికారి బత్తుల భూమయ్య తెలిపారు. ఈ పోటీల నిర్వహణపై శనివారం ధర్మపురి మండల విద్యా వనరుల కేంద్రంలో పీఈటీలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. 2023-24 విద్యాసంవత్సరానికి 4,5 తరగతులల్లో ప్రవేశాలకు గాను బాలబాలికలకు ఈ ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. మూడవ తరగతి పూర్తి చేసి ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 01, 09, 2014 నుంచి 31,08,2015 మధ్య జన్మించి ఉండాలని, నాలుగో తరగతి పూర్తి చేసి 5వ తరగతిలో ప్రవేశం పొందేవారు. 1,09,2013 నుంచి 31,08, 2014 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ప్రస్తుతం చెబుతున్న పాఠశాల నుంచి స్టడీ బోనాఫైడ్ సర్టిఫికెట్స్, జనన ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ప్రోగ్రెస్ రిపోర్ట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు (10), కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జులై 4న ఉదయం 9:30 నిమిషాలకు ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హాజరుకావాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిలో ఒక్కో తరగతి నుంచి పది మంది బాలురు, పదిమంది బాలికల చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పీఈటీలు స్వప్న, రాజేందర్, అప్సర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆగడాలకు అడ్డులేదు..

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం లక్పతిరెడ్డి



మాట్లాడుతున్న లక్పత్ రెడ్డి

నవతెలంగాణ-మల్లాపూర్

కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగడాలకు అడ్డు అదుపు లేదని, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం లక్పతిరెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని సిరిపూర్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక వనరుల మీద దెబ్బతీయాలనే దురుద్దేశంతో బీఆర్ఎస్ నాయకుల తో తన భూమిని ఆక్రమించాలని చేస్తున్నారన్నారు. పౌల్ట్రీ ఫారం మూసి వేయాలని తమ పార్టీ నాయకులతో ఫిర్యాదు చేయిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఉపసర్పంచ్ బొమ్మెన రాజేందర్, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కుంచెం గణేష్,కర్రె పోశెట్టి, గుగ్లవత్ రవి నాయక్,కొగురి రాజేందర్, మిల్కా నవీన్, నడికూడా మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాన్యుడి కష్టాలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



నిరసన తెలుపుతున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

సామాన్యుల కష్టాలను పట్టించుకోని సీఎం కేసీఆర్‌ను రానున్న ఎన్నికల్లో గద్దే దించాలని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవెందర్‌రెడ్డి అన్నారు. ఆలిండియా మహిళా కాంగ్రెస్ పిలుపు మేరకు శనివారం జగిత్యాలలో కూరగాయాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరు గుదలకు నిరసనగా విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ల అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. నిత్యావసర, కూరగాయాల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని ఆమె డిమాండ్ చేశారు. అల్లాల సరిత రమేష్‌రావు, చిట్ల లత, నాగిరెడ్డి రజిత, లత, రూప, సౌజన్య, నాయకులు మన్సూర్, కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, ముంజాల రఘువీర్‌గౌడ్, గోలి శేఖర్, రజినీకాంత్, రియాజ్, సంతోష్, నాగేంద్ర పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యాధికారికి సన్మానం



డాక్టర్ సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీజతో పాటు సిబ్బందిని సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్‌లు చేస్తున్న సేవలు చాలా గొప్పవని కొనియడారు. ఉత్తమ ఫార్మసిస్ట్ అవార్డు అందుకున్న ఉదయ్ ప్రసాద్ కూడా సన్మానించారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ రెబ్బాటి రాజశేఖర్,,సభ్యులు అలిశెట్టి మోహన్, మార భుచ్చన్నజక్క దినేష్,బోల్లం మహేష్, పడాల రాజేందర్, బోల్లవెని రాజేందర్,రాజు హాస్పిటల్ సిబ్బంది ఉదయ్, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

పోడు భూమి హక్కు పత్రాలు పంపిణీ

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపెల్లి జిల్లాలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హక్కు పత్రాలు శనివారం అందజేశారు. పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్‌లో నలుగురు గిరిజనులకు ఎకరం 39 గుంటలకు సంబంధించిన పోడు భూమి హక్కు పత్రాలు అందించారు. అదనపు కలెక్టర్‌లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రఘువీర్ సింగ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు అనంతరెడ్డి, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ అందజేత

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని వేంపల్లి, సిరిపూర్, గొర్రెపల్లి, గ్రామాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ , స్టేషనరీ ట్రస్ట్ చైర్మెన్ సుర్గి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పం చులు బిట్ల సరోజన, గోవింద్ నాయక్, కొంపల్లి సరోజన, ప్రధానో పాధ్యాయుడు బాబురెడ్డి, ప్రశాంత్,శినిష్ ,దీపక్, రాజేష్ పాల్గొన్నారు.





ప్రేమ ఒక్కటే కాదు...

కంటికి కనిపించకుండా నచ్చిన వారిపై చూపించే మధురమైన భావన ప్రేమ.. ఎవరైనా నచ్చితే వారిని బలంగా కోరుకోవడం, వారిపై ఆశలు పెంచుకోవడం సహజం. అయితే కలకాలం జీవించ దానికి, బంధం బలంగా ఉండేందుకు ప్రేమ ఒక్కటి ఉంటే చాలదు.. ప్రేమ ముఖ్య మైనదే అయినప్పటికీ మరికొన్ని అంశాలు కూడా పరిగణలోకి తీసుకోవాలి. జీవితంలో ప్రేమ కంటే ముఖ్యమైనవేంటో తెలుసుకుందాం..

భద్రత : బంధంలో భాగస్వామితో సురక్షితంగా ఉన్నట్టు భావించడం ముఖ్యం. మీ భాగస్వామిని మీరు చాలా ప్రేమించినా.. వారు మీకు ప్రాధాన్యం ఇవ్వకపోతే ఎంత ఇష్టపడినా ప్రయోజనం ఉండదు. ప్రేమ కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం చాలా ముఖ్యం.

నమ్మకం : ప్రేమలో అన్నింటికంటే ముఖ్యమైనది ఒకరిపై ఒకరికి నమ్మకం. మీరు అవతలివారిని ఎంత ప్రేమించినప్పటికీ నమ్మకం లేకపోతే ఆ బంధం నిలబడదు. ఆరోగ్యకరమైన బంధంలో ఒకరిపై ఒకరికి ఉండే నమ్మకం కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే నమ్మకం ద్వారానే ఇద్దరి మధ్య బంధం బలంగా ఉంటుంది.

గౌరవం : ప్రేమికులు ఒకరినొకరు గౌరవించుకోవడం చాలా ముఖ్యం. ఒక జంటకు ఒకే ఆసక్తి లేదా అభిరుచులు ఉండాల్సిన అవసరం లేదు. కానీ వారు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఒకరి ఇష్టాన్ని మరొకరు గౌరవించుకోవాలి. అలా గౌరవించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారంటే బంధం బీటలు వారుతున్నట్లే.

మాటలు : కమ్యూనికేషన్ అనేది ప్రేమకు ఇంధనం లాంటిది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం, పరిస్థితుల గురించి సరిగా చర్చించుకోలేని పరిస్థితిలో ఉంటే బంధం బలహీనంగా ఉన్నట్టే. సరిహద్దులను నిర్ణయించడానికి ప్రేమను వ్యక్తీకరించడానికి, పరిష్కరించడానికి, అవసరాల గురించి మాట్లాడానికి సంభాషణ అనేది చాలా అవసరం. మంచి సంభాషణలు దీర్ఘకాలిక బంధానికి దోహదపడతాయి.

వాషింగ్ మెషిన్ శుభ్రంగా ఉండాలంటే...

చాలా మంది బట్టలు ఉతకడానికి తప్ప వాషింగ్ మెషీన్‌ను పెద్దగా పట్టించుకోరు. దీని వల్ల దుమ్ము ధూళి, మురికి పేరుకుపోయి త్వరగా పాడవుతుంది. అలా కాకుండా వాషింగ్ మెషిన్ ఎక్కువ రోజులు మన్నిక రావాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

- ఒక కప్పు వెనిగర్, కొద్దిగా బేకింగ్ సోడా వేసి ఆ మిశ్రమాన్ని వాషింగ్ మెషీన్ డిటర్జెంట్ బాక్స్‌లో వేసి, బట్టలు వేయకుండా ఉత్తదే 5- 10 నిమిషాల పాటు రన్ చేసి ఆఫ్ చేయాలి. వాటర్ డ్రై అయిన తర్వాత శుభ్రమైన క్లాత్ తీసుకుని లోపల డ్రమ్ తుడవాలి.
- ఫ్రంట్ డోర్ వాషింగ్ మెషిన్లు అయితే డోర్ వద్ద ఆగిన నీటిని శుభ్రం చేసుకోవాలి. తర్వాత డోర్ ఓపెన్ చేసి కాసేపు అలా వదిలేయాలి. ఇలా చేస్తే పాచి పట్టకుండా ఉంటుంది.
- డిటర్జెంట్ బాక్స్‌లో ఇరుక్కుపోయిన వాషింగ్ పౌడర్ అచ్చుగా ఉంటుంది. కొన్ని రకాల పురుగులు కూడా చేరతాయి. సాధ్యమైతే, మొత్తం సొరుగును బయటకు తీసి, ఒక పాత టూత్ బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలి.
- ఫిల్టర్‌ను అన్ బ్లాక్ చెయ్యాలి. దీనిలో కూడా పురుగులు ఎక్కువ జమవుతాయి. దీనిని ఎప్పటికప్పుడు ఖాళీగా ఉంచాలి. లోపలి చెత్త, మురికిని తీసేయాలి.
- వాషింగ్ మెషిన్‌ను గోడకు దగ్గరగా పెట్టకూడదు. దీని వల్ల వెనక ఉండే పైపులు దెబ్బతింటాయి.



- వాషింగ్ మెషిన్ పైపులు లీకేజీ లేకుండా చూసుకోవాలి. మెషిన్లకు పౌడర్లకు బదులు లిక్విడ్ డిటర్జెంట్లు వాడటం మంచిది.
- బట్టలు ఉతికిన తర్వాత డోర్ ఓపెన్ చేసి పెట్టుకోవాలి. దీని వల్ల లోపల తేమ పోయి పొడిగా మారుతుంది. దీని వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా ఉంటుంది.



అనన్య శర్మకు నటనంటే అమితమైన ఆసక్తి. కానీ ఆ రంగంతో అసలు పరిచయం లేదు. పైగా నటనంటూ వెళితే తమ ఒక్కగానొక్క కూతురు భవిష్యత్ ఏమవుతుందో అని తల్లిదండ్రుల ఆందోళన. చివరకు బిడ్డ కోర్కెను కాదనలేకపోయారు. అయిష్టంగానే అంగీకరించారు. ఏమీ లేని దగ్గర నుండి నటనా రంగంలో స్వశక్తితో ఎదుగుతున్న కూతుర్ని చూసి ఇప్పుడు గర్వపడుతున్నారు. ప్రస్తుతం 'ఆహా' ద్వారా 'అర్థమయిందా అరుణ్ కుమార్' వెబ్ సీరిస్‌తో ప్రేక్షకుల ముందు వచ్చిన ఆమె పరిచయం నేటి మానవిలో...

ఓ బెంచ్ మార్క్ క్రియేట్ చేయాలి

నేను పుట్టింది వరంగల్‌లో. అమ్మ ప్రగతి, నాన్న రమేష్ శర్మ. ఇద్దరూ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్స్. అమ్మ జువాలజీ, నాన్న కెమిస్ట్రీ చెప్తారు. ఎక్కడ మంచి అవకాశం వస్తే అక్కడకు వెళ్ళేవారు. దాంతో నేను కూడా చాలా ప్రాంతాల్లో పెరిగాను. ఎక్కువగా హైదరాబాద్, బెంగుళూరులో చదువుకున్నాను. చిన్నప్పటి నుండి సినిమాలు బాగా చూసేదాన్ని. అలా నటనపై ఇష్టం పెరిగింది.

డ్రామా క్లబ్ ద్వారా...

పదిహేన్నేండ్లు వచ్చేసరికి ఆ ఇష్టం మరింత పెరిగింది. అప్పుడే ఇంట్లో నాకు నటనంటే ఇష్టమని చెప్పాను. కానీ అస్సలు ఒప్పుకోలేదు. ముందు చదువు పూర్తి చేయమన్నారు. నాకూ అప్పట్లో అవకాశాల కోసం ఎలా ప్రయత్నించాలో తెలియదు. దాంతో చదువుపై దృష్టి పెట్టి ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరాను. అక్కడ మాకు ఓ డ్రామా క్లబ్ ఉండేది. దాంతో నాకు మంచి అవకాశం దొరికింది. నటనలో ప్రాథమిక విషయాలన్నీ అక్కడే నేర్చుకున్నాను. ఆ క్లబ్ కూడా కాలేజీ తరపునే ఉండేది కాబట్టి నేర్చుకోవడానికి ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదు.

సీనియర్ సహకారంతో..

ఇంజనీరింగ్ పూర్తయ్యే సరికి నటన పట్ల అవగాహన పెరిగింది. యాక్టర్ హర్షిత్ రెడ్డి ఇంటర్‌లో నా సీనియర్. నటన పట్ల నాకున్న ఇష్టాన్ని గమ నించాడు. కోవిడ్ సమయం లో ఓ యూటూబ్ ఛానల్ కు ఆడిషన్స్ జరుగు తున్నాయని చెప్పి అందులో పాల్గొనే అవకాశం నాకు కల్పించాడు. ఈ విషయంలో నాకు అతను చాలా హెల్ప్ చేశాడు. ఆ యూటూబ్ ఛానల్ పేరు చాయ్ బిస్కెట్. కరోనా టైం కావడంతో ఆడిషన్స్ కూడా ఆన్‌లైన్‌లోనే జరిపారు. ఓ వీడియో తీసి పంపించడమంటే పంపాను. అది చూసి వాళ్ళు అవకాశం ఇచ్చారు. అలా మొదటి సారి ఆ ఛానల్‌లో ఓ స్కెచ్ వీడియో కోసం నన్ను తీసుకున్నారు. ఇక అక్కడి నుండి మెల్ల మెల్లగా అవకాశాలు మొదలయ్యాయి.

మంచి అవకాశాలు వచ్చాయి

స్కెచ్ వీడియో చూసిన తర్వాత '30 వెడ్స్ 21' అనే వెబ్ సీరిస్‌కి అవకాశం వచ్చింది. ఇది కూడా చాయ్ బిస్కెట్ యూటూబ్ ఛానల్ వాళ్ళు తీసిందే. అందులో నాకు మంచి గుర్తింపు వచ్చింది. అది చూసే ఇప్పుడు ఆహా వాళ్ళు 'అర్ధమయిందా అరుణ్ కుమార్' వెబ్ సీరిస్‌కు అవకాశం ఇచ్చారు. ఇది ఆహాలో జూన్ 30 నుండి ప్రారంభమయింది.

నేర్చుకోవడమే ఇష్టం

యాక్టింగ్ నేను కొత్తగా మొదలుపెట్టాను కాబట్టి ఎప్పుడూ నేర్చుకోవడానికే ప్రాధాన్యం ఇస్తాను. ఈ ఫీల్డ్ గురించి ఏమీ తెలియకుండా వచ్చాను. అలాంటి నేను ఇప్పుడు ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నాననే చెప్పాలి. నేనైతే చాలా సంతోషంగా ఉన్నాను. ఈ రంగంలో చాలా మంది సపోర్ట్ చేశారు. ఇంకా చేయాల్సింది, చేరుకోవల్సింది చాలా ఉంది. డిజిటల్, ఓటీటీ, యూటూబ్ వల్ల నాలాంటి కొత్త వాళ్ళకు అవకాశాలు బాగా వస్తున్నాయి. టాలెంట్‌కి అనుగుణంగా తమని తాము నిరూపించుకుంటున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే అంతకు ముందు నటించాలంటే తెల్లగా వుండాలి, పొడుగ్గా వుండాలి అనే ఫీలింగ్ ఉండేది. కానీ ఇప్పుడు ఆ ఆలోచన కూడా మారిపోయింది. నటనంటే ఆసక్తి, చేయాలనే తపన, టాలెంట్ ఉంటే చాలు. దీని వల్ల చాలా మంది తమ కలలను నిజం చేసుకోగలుగుతున్నారు.



ఇప్పుడు హ్యాపీగా ఉన్నారు

ఇంజనీరింగ్ తర్వాత కూడా నటన పట్ల నా ఆసక్తి, నా ప్రయత్నాలు గమనించిన అమ్మానాన్న కూడా చివరకు ఒప్పుకున్నారు. కానీ మొదట అయిష్టంగానే ఒప్పుకున్నారు. తర్వాత నా వర్క్, షోలు చూసి వాళ్ళకు కాస్త నమ్మకం వచ్చింది. 'మేము అనుకున్నట్టు ఇందులో భయపడాల్సింది ఏమీ లేదు' అనే అభిప్రాయానికి వచ్చారు. ఎందుకంటే మా ఫ్యామిలీలో ఎవ్వరూ ఈ ఫీల్డ్‌లో లేరు. పైగా ఈ ఫీల్డ్ గురించి రకరకాల అపోహలు ఉన్నాయి. చూసిన దాని కంటే విన్న వాటికే ఎక్కువ భయపడ్డారు. కానీ ఇప్పుడు అమ్మానాన్న చాలా హ్యాపీగా ఉన్నారు. అయితే ఆడపిల్లను కాబట్టి ఇప్పటికీ జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు.



యాక్షన్ మూవీలో నటించాలి

డ్రీమ్ క్యారెక్టర్లు చాలా ఉన్నాయి. సమంతలా యాక్షన్ మూవీ చేయాలనే కోరిక ఉంది. అలాంటి చేస్తే నా నటనా జీవితంలో ఒక బెంచ్ బార్క్ అవుతుంది. దీని కంటే కూడా ముందు జీవితాంతం యాక్టింగ్ చేయాలని నా కోరిక. ఇప్పటి వరకు నేను చేసిన ప్రతి పాత్ర నాకు బాగా నచ్చినవే. ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేకత, ఒక్కో ప్రాధాన్యత ఉంది. ఖాళీ సమయంలో బుక్స్ బాగా చదువుతాను. అలాగే మూవీస్, వెబ్ సీరిస్ చూస్తుంటాను. ఇంకా కొత్త కొత్తవి చేయడం అంటే ఇష్టం. పెయింటింగ్ కూడా అప్పుడప్పుడు చేస్తుంటాను. ఇప్పుడున్న హీరోయిన్లలో శ్రీలీల యాక్టింగ్ నాకు బాగా నచ్చుతుంది.

కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు

అమ్మాయిలకు ఏ ఫీల్డ్‌లో అయినా జాగ్రత్త అవసరం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనుషులను కంట్రోల్ చేయడం మన వల్ల కాదు. ఎవ్వరినీ అంత ఈజీగా నమ్మలేం. అలా అని ఫీల్డ్‌లోకి రావడానికి భయపడాల్సిన పని కూడా లేదు. కాస్త జాగ్రత్తగా ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు అనే నమ్మకం నాకు వచ్చింది. ఇప్పుడు నేను చేస్తున్న 'అర్థమయిందా అరుణ్ కుమార్' సీరిస్ అందరికీ కనెక్ట్ అయ్యే స్టోరీ. ఒక అబ్బాయి అమలాపురం నుండి బతకడానికి మొదటిసారి హైదరాబాద్ వస్తాడు. నగరంలో జీవితం ఎలా గడపాలో అర్థం కాక గందరగోళ స్థితిలో ఉంటాడు. ఇది కొత్తగా సిటీకి వచ్చిన యువతకు చాలా దగ్గరగా వుండే స్టోరి. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఇలాంటి ఫీల్‌ను కచ్చితంగా అనుభవిస్తారు. కాబట్టి అందరికీ ఇది బాగా నచ్చుతుంది.

- సలీమ

తెలంగాణ డయాగ్నస్టిక్స్‌లో మరో
134 వైద్య పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 8 డయాగ్నస్టిక్స్ సెంటర్లు, 16 రేడియాలజీ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ఇప్పటివరకు 54 పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, మరో 134 వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను రోగి మొబైల్‌కు పంపిస్తారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో టిఫా స్కాన్, 2డి-ఎకో రేడియాలజీ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు చాలా కష్టపడ్డారని కొనియాడారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30శాతం ప్రసవాలు జరిగితే.. ఇప్పుడు 70 శాతం అవుతున్నాయని తెలిపారు. పేద ప్రజలకు నిమ్స్‌లో అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని, హైదరాబాద్ చుట్టు పక్కల నాలుగు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మాట్లాడుతూ.. పేదల కోసమే తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలు ప్రారంభించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 27 లక్షలు మంది టి డయాగ్నస్టిక్ సేవలు వినియోగించుకున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు భాను ప్రసాద్, బండ ప్రకాష్, తెలంగాణ రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పాల శ్రీనివాస్‌గుప్తా, జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిక్‌జైన్, హెల్త్ కమిషనర్ శ్వేతామొహంతి, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన, కార్పొరేటర్లు, కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ వరదాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులకు పాత పెన్షన్‌ను
అమలు చేయండి

- సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2004కు ముందు ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు విడుదలై ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. దేశంలో నూతన పెన్షన్ విధానంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, సెప్టెంబర్ ఒకటి తర్వాత నియామకమైన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉద్యోగులను బలవంతంగా ఈ కొత్త పెన్షన్ విధానంలోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దీంతో చాలా మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. అయితే 2004, సెప్టెంబర్ ఒకటి కంటే ముందే ఉద్యోగ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన వారు పాత పెన్షన్ విధానం కోసం వేచిచూస్తున్నారని తెలిపారు. మెమోనెంబర్ 57/05/2021 పి అండ్ పిడబ్ల్యూ 2023, మార్చి మూడో తేదీన కేంద్రం విడుదల చేసిన మెమో ప్రకారం 2003, డిసెంబర్ 12 నాటికి నోటిఫికేషన్ విడుదల చేయబడిన వారందరినీ పాత పెన్షన్ విధానంలోకి తేవాలంటూ ఆదేశాలిచ్చిందని గుర్తు చేశారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి పాతపెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

ప్రతి మురుగునీటి చుక్కనూ శుద్ధి చేస్తాం

నవతెలంగాణ- సిటీబ్యూరో

ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం సివరేజ్ ట్రీట్‌మెంట్ చేస్తామని, ప్రతి మురుగు నీటి చుక్కనూ శుద్ధి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. మురుగునీటిని శుద్ధిచేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. మూడు ప్యాకేజీల్లో రూ.3,866 కోట్లతో 31 మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్టీపీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జలమండలి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోకాపేటలో నిర్మించిన మొదటి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని మంత్రి కేటీఆర్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మురుగు నీటి శుద్ధి కోసం చేసిన ప్రణాళికలు విడతల వారీగా అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. కోకాపేటలో 15 ఎంఎల్‌డీల సామర్థ్యంతో, రూ. 41 కోట్లతో నిర్మించిన మొదటి ఎస్టీపీ ప్రారంభంతో దేశంలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరబాద్ అవతరిస్తుందన్నారు. హైదరాబాద్‌లో నిత్యం దాదాపు 2000 ఎంఎల్‌డీల మురుగు ఉత్పత్తి అవుతోందని, సెప్టెంబర్ చివరి నాటికి నగరంలో ఉత్పన్నమయ్యే ప్రతి మురుగునీటి చుక్కనూ శుద్ధి చేయబోతున్నామని తెలిపారు.దేశంలోని ఏ నగరంలోనూ 40శాతం కూడా మురుగు శుద్ధి చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వం రూ.3866 కోట్లతో 1259ఎంఎల్‌డీల సామర్థ్యంతో మొత్తం కొత్తగా 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టిందని, అన్నీ ఎస్టీపీలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 11 లక్షల కుటుంబాలకు నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచిత తాగు నీరు అందిస్తున్నామని, దీనికోసం ఇప్పటిదాకా రూ.850 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అంతకు ముందు మంత్రి కేటీఆర్ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి ఎస్టీపీలోని మొదటి ప్రక్రియగా పిలిచే వెట్‌వెల్ మోటార్‌ను ఆన్ చేసి ప్రారంభించారు. జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టుకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితా హర్‌నాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్, జలమండలి ఎండీ దానకిషోర్, ఈడీ సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు ఇతర ఉన్నతాధికారులతోపాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

23 రోజులు, 17 సిట్టింగ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. ఈ వర్షాకాల సమావేశాల్లో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. అదే విధంగా దేశ రాజధాని నగరం ఢిల్లీ ప్రభుత్వ సవరణ ఆర్డినెన్స్‌కు చట్ట రూపం ఇచ్చేందుకు ఓ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదించిన నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దాదాపు అన్ని రాజకీయ పార్టీలకు కొత్త పార్లమెంటు భవనంలో కార్యాలయాలను కేటాయించారు. ముఖ్యమైన డిపార్ట్‌మెంట్ల కార్యాలయాలను కూడా తరలిస్తున్నారు.

కేంద్ర పౌర స్మృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జూలై 3న సమావేశం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ శనివారం సమావేశం అయింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ నివాసమైన 10 జనపథ్‌లో సమావేశం అయ్యారు. యుసిసిపై చర్చలో పార్టీ ఎలాంటి వైఖరి తీసుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. జూలై 3న సమావేశానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్సెస్, లా అండ్ జస్టిస్) పిలుపునిచ్చింది. యూసీసీపై సంబంధిత భాగస్వాములందరితోనూ స్టాండింగ్ కమిటీ చర్చించనుంది. బిజెపి రాజ్యసభ ఎంపి సుశీల్ మోడీ సారథ్యంలోని కమిటీ ఇందులోని 31 మంది ఎంపిలు, సభ్యులను తమతమ అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా కోరింది.

ప్రధాన సమస్యలైన ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్‌లో పరిస్థితి వంటి అంశాల నుంచి ప్రజలు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. యుసిసి అమలుతో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ వ్యాఖ్యానించారు. హిందూ-ముస్లిం డైనమిక్స్‌పై మాత్రమే ఎందుకు దృష్టి సారిస్తున్నారని, తమ రాష్ట్రంలోని గిరిజన జనాభాను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. మతం కోణంలో నుంచి సమాజాన్ని రెండుగా చీల్చేందుకు ఉద్దేశపూర్వకంగానే బీజేపీ యూసీసీ చర్చ లేవనెత్తినట్టు విమర్శించారు.

నిరంతర అధ్యయన శీలి కొరటాల..

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్



భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదలందరికీ భూమిని పంపిణీ చేయాలని విద్యార్థి దశలోనే ఉద్యమాల బాట పట్టిన కొరటాల సత్యనారాయణ స్ఫూర్తి నేటి తరానికి చాలా ఆదర్శమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంహెచ్ భవన్ (నవతెలంగాణ)లో నవతెలంగాణ బుక్‌హౌస్ సంపాదకులు కె ఆనందాచారి అధ్యక్షతన కొరటాల 17వ వర్ధంతి సభను నిర్వహించారు. పత్రిక సిబ్బంది కొరటాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొరటాల నిరంతరం అధ్యయనశీలని చెప్పారు. సిద్ధాంత అధ్యయనమేగాక, ప్రజల జీవన విధానాన్ని ప్రత్యక్ష పరిశీలనతో అర్థం చేసుకునేవారని చెప్పారు. తద్వారా పోరాటాలకు రూపకల్పన చేసేవారని గుర్తు చేశారు. పత్రికతోపాటు పలు సంఘాలకు సూచనలు, సలహాలు ఇచ్చేవారన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా శ్రామిక ప్రజల పక్షాన నిలబడి వారి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. నాగార్జునసాగర్ నిర్మాణానికి అనేక ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. పాలమూరు ఆకలి చావులు, వలసలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారనీ, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశారని చెప్పారు. చేనేత కార్మికులు కొరటాలను తమ వాడిగా చెప్పుకున్నారంటే వారి సమస్యలపై ఆయన చేసిన కృషి నిరూపమానమైనదని చెప్పారు. రెండు పర్యాయాలు శాసన సభ్యునిగా చట్టసభలో ప్రజావాణిని వినిపించారని గుర్తుచేశారు. నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక నడత, నడవడికలో ఆయన సూచనలు, సలహాలు మరవలేనివన్నారు. సీపీఐ(ఎం) అగ్ర నాయకుల్లో ఒకరిగా రైతు, చేనేత రంగాల్లో పోరాట యోధుడిగా కొరటాల ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కడవరకూ తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన త్యాగజీవి కొరటాల అన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాతో ప్రజలకు అండగా నిలిచిన కొరటాల జీవితం నేటి తరానికి, భవిష్యత్ తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. రాంపల్లి రమేష్, వేణుగోపాల్, బోర్డు సభ్యులు, జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మతతత్వ అజెండా...

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి బదులు పర్సనల్ లాలో వివక్షాపూరితమైన అంశాలను సవరించేందుకు, సంస్కరించేందుకు కృషి చేయాలని ఆయన కేంద్రానికి హితవు పలికారు. దేశ బహుళత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ప్రతిఘటించాలని ప్రజలకు విజయన్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక సంప్రదింపుల ద్వారా సంస్కరణలు తీసుకువచ్చే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన ట్విటర్‌లో ట్వీట్ చేశారు.

ఈ నెలలో సాధారణ వర్షపాతం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉన్నదని ఐఎండీ అంచనా వేసింది. అందరూ భావిస్తున్నట్టు ఎల్‌నినో ప్రభావం వర్షపాతంపై పడే అవకాశం లేదు. రుతుపవనాల సీజన్ తొలి అర్థభాగంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని ఐఎండీ అంచనాలను బట్టి అర్థమవుతోంది. ఖరీఫ్ పంటలు విత్తుకోవడం ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వాస్తవానికి గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు రైతులు దేశంలోని చాలా ప్రాంతాలలో ఇప్పటికే ఖరీఫ్ పంటలు వేసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు వేసుకున్నారని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. రాబోయే రెండు వారాలలో వ్యవసాయ పనులు మరింత ఊపందుకుంటాయని అంచనా. జూన్‌లో వర్షపాతం లోటు 8శాతంగా ఉంటుందని గతంలో ఐఎండీ అంచనా వేయగా నెలాఖరుకు అది 10శాతానికి చేరింది. కేరళ, కర్నాటక, బీహార్, మహారాష్ట్ర తెలంగాణలో వర్షపాతం లోటు అధికంగా ఉంది. తెలంగాణలో జూన్‌లో సాధారణం కంటే 50శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. దేశంలోని వాయవ్య ప్రాంతంలో మాత్రం అధిక వర్షాలు కురిశాయి.

నేడు ఖమ్మంలో
కాంగ్రెస్ తెలంగాణ జనగర్జన

(మొదటిపేజీ తరువాయి)

వేదికగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరు బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు, మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మెన్ సూతకాని జైపాల్ సహా పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరబోతున్నారు.

టీఎస్ఆర్టీసీ ఆఫర్

- బెంగళూరు, విజయవాడ రూట్లలో 10 శాతం రాయితీ
- రానూపోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటేనే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బెంగళూరు, విజయవాడ రూట్లలో ముందస్తు రిజర్వేషన్ సదుపాయమున్న సర్వీసుల్లో పది శాతం రాయితీ ఇస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ ఆఫర్ ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందన్నారు. రానూపోనూ టిక్కెట్లు ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే తిరుగు ప్రయాణం టిక్కెట్‌పైన మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని వివరించారు. దీనివల్ల విజయవాడ వెళ్లే ప్రయాణీకులకు ఒక్కొక్కరికి రూ.50, బెంగళూరు వెళ్లే ప్రయాణీకులకు ఒక్కొక్కరికి రూ.100 వరకు ఆదా అవుతుందని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం తమ అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.com ను సంప్రదించాలని సూచించారు.

నవచిత్రం


నిహాల్ కోదాటి, కె.ఎస్.రామారావు, అశ్లేష ఠాకూర్

అందమైన సినిమా శాంతల

కర్ణాటక రాష్ట్రంలోని మారుమూల ప్రాంతంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన పీరియాడికల్ చిత్రం 'శాంతల'. యిర్రంకి సుబ్బలక్ష్మి సమర్పణలో ఇండో అమెరికన్ ఆర్ట్స్ పతాకంపై నూతననటుడు నిహాల్ కోదాటి హీరోగా, 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ ఫేమ్ అశ్లేష ఠాకూర్ హీరోయిన్‌గా శేషు పెద్దిరెడ్డి దర్శకత్వంలో డా.యిర్రంకి సురేష్ నిర్మించారు. ఈ సినిమాలోని రెండు పాటలను ప్రసాద్‌ల్యాబ్‌లో శనివారం మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు శేషు మాట్లాడుతూ,' సినిమా అద్భుతంగా రావటానికి నిర్మాత కె.ఎస్.రామారావు ముఖ్యకారణం' అని అన్నారు. 'ఇది సంగీతం, నృత్యం కలగలిపిన క్లాసికల్ మ్యూజిక్ మూవీ' అని సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ చెప్పారు.

నిర్మాత కె.యస్.రామారావు మాట్లాడుతూ,'చాలాకాలం తర్వాత వస్తున్న అందమైన చిన్న సినిమా ఇది. మ్యూజిక్, కంటెంట్, విజువల్‌గా అద్భుతం అనిపించే సినిమా. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడం, మలయాళం మొత్తం 6 లాంగ్వేజెస్‌లో చేశాం. సినిమా మీద మా నమ్మకానికి ఇదో మంచి ఉదాహరణ' అని తెలిపారు. హీరో నిహాల్ మాట్లాడుతూ,'ఇది నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న సినిమా' అని తెలిపారు. 'ఈ సినిమాలో నా ఇష్టాలకు దగ్గరైన పాత్ర చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఈ పాత్రను ఛాలెంజ్‌గా తీసుకుని చేశాను.మంచి సినిమా చేశాం' అని హీరోయిన్ అశ్లేష ఠాకూర్ అన్నారు.

డిసెంబర్‌లో విడుదల


కృష్ణ చైతన్య

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. టైటిల్ పాత్రలో యువ గాయకుడు కృష్ణ చైతన్య, ఆయన భార్య సావిత్రి పాత్రలో మృదుల నటించారు. అన్యుక్తరామ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పతాకంపై శ్రీమతి ఫణి నిర్మాతగా, గాయకుడు జి.వి భాస్కర్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. సి.హెచ్.రామారావు దర్శకత్వం వహించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్ర పోస్టర్‌ను ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్మాత సి.కల్యాణ్ ఆవిష్కరించారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ, 'ఘంటసాల పాత్ర పోషించడం ఓ గాయకుడిగా నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.

నిర్మాణ సారథి జి.వి.భాస్కర్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర టీజర్‌ను ఎస్.పి.బాలు విడుదల చేశారు. దానికి మంచి ఆదరణ లభించింది' అని చెప్పారు. 'ఈ సినిమా పెద్ద స్థాయిలో జనాలకు చేరువవుతుంది' అని సమర్పకులు లక్ష్మీ ప్రసాద్ చెప్పారు. 'దర్శకుడిగా నా మొదటి చిత్రమిది. నేను అభిమానించే ఘంటసాల జీవిత కథతో సినిమా తీసే అవకాశం రావడం నా అదృష్టం. ఘంటసాల గాయకుడి కన్నా వ్యక్తిగతంగా ఎంతో మంచి మనిషి. ఆయన జీవితంతో ఎంత పోరాటం చేశారు' అని దర్శకుడు సిహెచ్ రామారావు తెలిపారు.

పాత్రలన్నీ నవ్విస్తాయి

శ్రీసింహా కోడూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'భాగ్ సాలే'. నేహా సోలంకి నాయిక. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్‌తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించారు. ఈనెల 7న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.


ప్రణీత్ బ్రహ్మండపల్లి

ఈ నేపథ్యంలో దర్శకుడు ప్రణీత్ బ్రాహ్మండపల్లి మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక కల్పిత కథ. నిజాంకి ఉంగరాల పిచ్చి ఉందని అంటారు. అందుకే హైదరాబాద్ బ్యాక్‌గ్రౌండ్‌ని ఎంచుకున్నాను. పూర్తిగా క్రైమ్ కామెడీ జోనర్‌లోనే ఉంటుంది. కామెడీ చాలా బాగా వచ్చింది. అన్ని పాత్రలు నవ్విస్తాయి. వర్షిణి ఓ ఫ్రస్టేటెడ్ అమ్మాయిలా కనిపిస్తుంది. నేహా సోలంకి డాడ్ లిటిల్ ప్రిన్సెస్ పాత్రలో నటించింది. శ్రీసింహాది అయితే కిలాడి లాంటి పాత్ర (నవ్వుతూ). ఈ సినిమాలో అంతా పరిగెత్తడమే ఉంటుంది. అందుకే భాగ్ సాలే అనే టైటిల్ సౌండింగ్ బాగుందని పెట్టాం. కాలభైరవ ఈ చిత్రానికి కనిపించని హీరో. అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. రామకృష్ణ మాస్టర్ మంచి ఫైట్స్ కంపోజ్ చేశారు. మా నిర్మాత అర్జున్ ఎంతో సపోర్ట్‌గా నిలిచారు' అని చెప్పారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

యూవీటీ స్టూడియోస్ హాలీవుడ్ ప్రొడక్షన్ కంపెనీ, శ్రియా ప్రొడక్షన్స్ సంయుక్తంగా 'హర ఓం హర' అనే సినిమాను నిర్మిస్తున్నాయి. కనిక, ఆమని, రవివర్మ, జ్యోతి రెడ్డి, మేక రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను దేవేంద్ర మదన్ సింగ్ నేగి, అశోక్ ఖుల్లార్ నిర్మిస్తుండగా, షేర్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే ఓ ముఖ్య పాత్రను కూడా ఆయన పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రాబోతోన్న ఈ చిత్ర టైటిల్ లోగోను తాజాగా సుమన్ రిలీజ్ చేశారు. టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. షేర్ మాట్లాడుతూ, 'నటుడిగా, హీరోగా, విలన్‌గా, దర్శకుడిగా ఇలా పలు శాఖల్లో పని చేశాను. నాకు ఈ ఇండస్ట్రీలో భాష్య శ్రీ, డైరెక్టర్ బాలా ఎంతో సపోర్ట్‌గా నిలిచారు' అని తెలిపారు.



వెస్టిండీస్ అవుట్

- స్కాట్లాండ్ చేతిలో ఓటమి
- 2023 వన్డే వరల్డ్‌కప్‌కు దూరమైన కరీబియన్లు



హరారే (జింబాబ్వే) : 1975, 1979 ప్రపంచకప్ విజేత, 1983 వరల్డ్‌కప్ ఫైనలిస్ట్ వెస్టిండీస్ అవుట్. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ రేసు నుంచి కరీబియన్ జట్టు నిష్క్రమించింది. జింబాబ్వేలో జరుగుతున్న ఐసీసీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో పేలవ ప్రదర్శన కొనసాగించిన వెస్టిండీస్.. తాజాగా సూపర్ సిక్స్ దశలో స్కాట్లాండ్ చేతిలో పరాజయం పాలైంది. ఈ ఓటమితో టాప్-2లో చోటు సాధించే అవకాశాలు కోల్పోయిన వెస్టిండీస్.. ప్రపంచకప్‌కు అర్హత సాధించలేదు. ఐసీసీ ప్రపంచకప్ చరిత్రలో కరీబియన్ జట్టు లేకుండా వన్డే వరల్డ్‌కప్ (13) జరుగనుండటం ఇదే తొలిసారి కానుంది. శనివారం హరారేలో జరిగిన క్వాలిఫయర్స్ సూపర్ సిక్స్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై స్కాట్లాండ్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత వెస్టిండీస్ 181 పరుగులకే కుప్పకూలింది. జేసన్ హోల్డర్ (45), రోమారియో (36) ఆదుకున్నారు. స్కాట్లాండ్ బౌలర్లు బ్రాండన్ మెక్‌కల్లమ్ (3/32), క్రిస్ సోల్ (2/48), మార్క్ వాట్ (2/25), క్రిస్ గ్రీవ్స్ (2/30) రాణించారు. ఛేదనలో మూడు వికెట్లు కోల్పోయిన స్కాట్లాండ్ 43.3 ఓవర్లలో 185 పరుగులు చేసింది. ఓపెనర్ మాథ్యూ క్రాస్ (74 నాటౌట్), బ్రాండన్ మెక్‌కల్లమ్ (69) అర్ధ సెంచరీలతో రాణించారు.

ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్ గ్రూప్ దశలో జింబాబ్వే, నెదర్లాండ్స్, నేపాల్, యుఎస్‌ఏలతో వెస్టిండీస్ గ్రూప్-ఏలో నిలిచింది. గ్రూప్ దశలో యుఎస్ఏ, నేపాల్‌పై నెగ్గిన కరీబియన్లు.. జింబాబ్వే, నెదర్లాండ్స్ చేతిలో ఓడారు. టాప్-3 పొజిషన్‌తో సూపర్ సిక్స్ దశకు చేరినా.. గ్రూప్ దశలో సాధించిన పాయింట్లు సూపర్ సిక్స్‌లోనూ పరిగణనలోకి తీసుకుంటారు. రెండు విజయాలు, రెండు ఓటములతో సూపర్ సిక్స్‌కు వెస్టిండీస్ 'సున్నా' పాయింట్లతో వచ్చింది. ఇదే సమయంలో శ్రీలంక, జింబాబ్వేలు గ్రూప్ దశ నుంచి నాలుగు పాయింట్లతో సూపర్‌సిక్స్‌కు చేరగా.. నెదర్లాండ్స్ రెండు పాయింట్లతో చేరింది. సూపర్ సిక్స్‌లో టాప్-2లో నిలిచిన జట్లే ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి. వెస్టిండీస్ సూపర్ సిక్స్‌లో తొలి మ్యాచ్‌లో ఓడటంతో.. ఇక తర్వాతి రెండు మ్యాచుల్లో నెగ్గినా గరిష్టంగా నాలుగు పాయింట్లే దక్కించుకుంటుంది. నాలుగు పాయింట్లతో టాప్-2లో నిలిచే పరిస్థితి లేదు. దీంతో సూపర్ సిక్స్ దశలో మరో రెండు మ్యాచులు మిగిలి ఉండగానే వెస్టిండీస్ 2023 వన్డే వరల్డ్‌కప్ రేసు నుంచి నిష్క్రమించింది. 2019 వన్డే వరల్డ్‌కప్‌కు సైతం వెస్టిండీస్ క్వాలిఫయర్స్ ఆడి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పుడూ స్కాట్లాండ్‌తో వర్షం ప్రభావిత మ్యాచ్‌లో వెస్టిండీస్ గట్టెక్కగా.. ఈసారి స్కాట్లాండ్ ప్రతీకారం తీర్చుకుంది.

గ్రామీణ ప్రతిభను వెలికితీయాలి

- మరింత మంది ధోనీలను తయారు చేయాలి
- ఐఎస్‌బిసి గౌరవ ఛైర్మెన్ ఎస్ఎస్ రాజమౌళి



నవతెలంగాణ-హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభాంతులైన క్రికెటర్లకు కొదవలేదు. నైపుణ్యం ప్రదర్శించేందుకు ఓ వేదిక లేకపోవటంతో ఎంతోమంది నాణ్యమైన క్రీడాకారులు కనుమరుగవుతున్నారు. పాఠశాల స్థాయిలోనే మెరికల్లాంటి క్రికెటర్లను వెలికితీసి.. మరింత మంది ధోనీలను తయారు చేయటమే ఐఎస్‌బిసి లక్ష్యం. స్కూల్ క్రికెట్ స్థాయిలో ప్రపంచ కప్ నిర్వహణకు ఆకర్షితుడిని అయ్యాను' అని భారతీయ సినిమా దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి అన్నారు. భారత్‌లో స్కూల్ క్రికెట్ బలోపేతానికి ముందుకొచ్చిన జక్కన్న.. ఇండియన్ స్కూల్స్ బోర్డ్ ఫర్ క్రికెట్ (ఐఎస్‌బిసి) గౌరవ ఛైర్మెన్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఐఎస్‌బిసి ఫౌండర్ సీఈవో సునీల్‌బాబు కొలనుపాక వెల్లడించారు.

మహిపై మక్కువ : 'ఎం.ఎస్ ధోని అంటే ఎంతో ఇష్టం. ధోని వంటి వజ్రాల్లాంటి నాణ్యమైన క్రికెటర్లకు గ్రామీణ స్థాయిలో నిరూపించేందుకు ఓ వేదిక అందుబాటులోకి వచ్చింది. నేను స్కూల్‌డేస్‌లో ఉండగా అందరం ఒకే బ్యాట్‌తో క్రికెట్ ఆడేవాళ్లం. నేను కాలేజ్ జట్టు తరఫున ఆడుతున్నప్పుడు.. ఆ టీమ్‌లోని ఆటగాళ్ల కంటే మా స్కూల్‌లోని ప్లేయర్లు ఎంతో మెరుగు అనిపించింది. కానీ వారికి నిరూపించుకునే వేదిక స్కూల్ స్థాయిలో దక్కలేదు. ఐఎస్‌బిసి స్కూల్ లీగ్‌తో దేశవ్యాప్తంగా వర్ధమాన క్రికెటర్లకు మేలు జరుగనుంది' అని రాజమౌళి తెలిపారు.

జనవరిలో స్కూల్ క్రికెట్ ప్రపంచకప్ : 2024 జనవరిలో స్కూల్స్ క్రికెట్ ప్రపంచకప్ నిర్వహించనున్నారు. ఈ ప్రపంచకప్‌లో ఎనిమిది దేశాలు పోటీపడనున్నాయి. అంతకముందు, ప్రాజెక్ట్ స్కూల్ వరల్డ్‌కప్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 766 జిల్లాల్లో ఇంటర్ డిస్ట్రిక్, ఇంటర్ స్టేట్, ఇండియన్ స్కూల్ టాలెంట్ లీగ్ (ఐఎస్‌టీఎల్) నిర్వహిస్తారు. ఇండియన్ స్కూల్ టాలెంట్ లీగ్‌లో ఎనిమిది ఫ్రాంఛైజీలు ఆడతాయి. ఈ లీగ్‌లో విజేతగా నిలిచిన జట్టు స్కూల్ ప్రపంచకప్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించనుంది.

మెగా టాలెంట్ హంట్ : ఇక ఇండియన్ స్కూల్ టాలెంట్ లీగ్, ప్రాజెక్ట్ స్కూల్ వరల్డ్‌కప్‌లో భాగమయ్యేందుకు ఐఎస్‌బిసి.. మెగా టాలెంట్ హంట్‌కు సిద్ధమైంది. 12-16 ఏండ్ల యువ క్రికెటర్లు తమ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, వికెట్ కీపింగ్ నైపుణ్యాలతో కూడిన 60 సెకండ్ల నిడివి గల వీడియోను ఐఎస్‌బిసి వెబ్‌సైట్ లేదా ఐఎస్‌బిసి యాప్‌లో పోస్ట్ చేయాలి. ఐఎస్‌బిసి చీఫ్ మెంటార్ దిలిప్ వెంగ్‌సర్కార్ సారథ్యంలోని నిపుణులు వీడియోలను పరిశీలించి ప్రతి జిల్లా నుంచి 400 మంది క్రికెటర్లను ఎంపిక చేయనున్నారు. ఈ విధంగా ఎంపికైన 400 మంది వర్ధమాన క్రికెటర్లు జిల్లా స్థాయి స్కూల్ క్రికెట్ లీగ్‌లో పోటీపడేందుకు అర్హత సాధిస్తారు.

రూ.కోట్లల్లో 'మధ్యాహ్న' బిల్లులు పెండింగ్

అప్పుల్లో కార్మికులు

- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పాత అప్పులు తీరట్లే.. కొత్త అప్పులు పుట్టట్లే..
- కొత్త మెనూకు 17 పైసలే పెంపు
- మూడ్రోజుల సమ్మెకు పిలుపు



నవతెలంగాణ- నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజనం కార్మికుల కడుపు మాడుతోంది.. అప్పులు చేసి పిల్లలకు వండి పెడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదు. ఒకవైపు బిల్లులు పెండింగ్, మరోవైపు కార్మికుల వేతనాలు రాకపోవడంతో కార్మికులు అప్పుల్లో కూరుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలు ఏజెన్సీలకు చెల్లించాల్సి ఉంది. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా 'రేపు..మాపు' అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కార్మికులకు చెల్లిస్తున్న వెయ్యి రూపాయల గౌరవ వేతనం సైతం 4 నెలలుగా ఆగింది. కార్మికులకు మూడు వేల వేతనం చెల్లిస్తామన్న సీఎం కేసీఆర్ హామీ అటకెక్కింది. కేంద్రప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా కొర్రీలు పెడుతోందన్న విమర్శలున్నాయి. కార్మికులు తాము ఇబ్బంది పడినా.. పిల్లల కడుపు మాడ్చొద్దన్న ఉద్దేశంతో ఒంటి మీది బంగారం తాకట్టు పెట్టిమరీ వంట చేసి పెడుతున్నారు. ఈ క్రమంలో కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా మూడ్రోజుల సమ్మెకు సిద్ధమయ్యారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కొత్త మెనూ అమలు చేస్తున్నామని సర్కారు చెబుతున్నా.. శ్లాబ్ రేటు 17 పైసలు మాత్రమే పెంచింది. 17 పైసాల్లో కిచిడి, ఫ్రై కర్రీ, సాంబారు ఎలా చేస్తామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో అప్పుల బాధ తాళలేక కార్మికులు ఏజెన్సీలను వదిలిపోయిన పరిస్థితి ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 24 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండ పెడుతున్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 1120 స్కూళ్లలో 2 వేల మంది పైచిలుకు కార్మికులు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. కానీ సర్కారు 2022 అక్టోబర్ నుంచి నిధులు విడుదల చేయలేదు. కోడిగుడ్డు బిల్లులతో పాటు భోజన బిల్లు లన్నీ పెండింగ్ ఉన్నాయి. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే కార్మికులకు సర్కారు నుంచి రూ.9 కోట్ల మేర రావాల్సి ఉంది. నిజామాబాద్‌లోని బోర్గాం(బి) జెడ్పీ హెచ్ఎస్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు ఉంది. ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుడికి రూ.13 లక్షల బిల్లు సర్కారు నుంచి రావాల్సి ఉంది. ఎన్నో ఆందోళనల తరువాత కోడిగుడ్డు ధర రూ.4 నుంచి రూ.5కు పెంచగా.. పెరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ బిల్లులు చెల్లించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఉన్నత తరగతులకు మధ్యాహ్న భోజన శ్లాబ్ రేటు కేవలం రూ.8.17 పైసలు మాత్రమే చెల్లిస్తోంది. ఇక ప్రైమరీ విద్యార్థులకు రూ.5.45 పైసలుగా శ్లాబ్ రేటు నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ ప్రకటించిన విషయం తెలిసిందే. కొత్త మెనూ ప్రకటించిన తరువాత శ్లాబ్ రేటు కేవలం 17 పైసలు మాత్రమే పెంచింది. కానీ మెనూలో మాత్రం కిచిడి, ఫ్రై కర్రీ, సాంబారు అందించాలని సూచించింది. 17 పైసలతో ఇవన్నీ ఎలా సాధ్యమని కార్మికులు వాపోతున్నారు. దీనికితోడు కోడిగుడ్డు ధర రూ.6కు పెరిగింది. కేంద్రం కోడిగుడ్డుకు నిధులు ఇవ్వడం లేదని తెలిసింది. మారుమూల గ్రామాలకు ఈ గుడ్లు చేరాలంటే అదనంగా మరో రూపాయి ఖర్చవుతుంది. శ్లాబ్ రేటును కనీసంగా రూ.15 నిర్ణయించాలని, కోడిగుడ్డుకు రూ.6 పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అమలు కాని సీఎం హామీ.. సమ్మెకు సై..

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.2 వేలు పెంచి ప్రస్తుతం అందిస్తున్న వెయ్యితో కలిసి మూడు వేలు చెల్లిస్తామన్న సీఎం కేసీఆర్ హామీ అటకెక్కింది. 2022 మార్చి బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ హామీ ఇవ్వగా.. ఎన్నో పోరాటాల తరువాత 2023 ఫిబ్రవరి 3వ తేదీన జీఓ ఎంఎస్ నెం.8ని విడుదల చేశారు. జీఓ విడుదలై నాలుగు నెలలవుతున్నా ఇప్పటికీ అమలు చేయడం లేదు. పైగా ఏజెన్సీని స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తామని కార్మికులను బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెరిగిన వేతనాలు అమలు చేయాలని, శ్లాబ్ రేటు పెంచాలని, సబ్సిడీపై ప్రభుత్వమే సిలిండర్ ఇవ్వాలని, కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాట పడుతున్నారు. జులై 10, 11, 12వ తేదీల్లో మూడ్రోజుల పాటు సమ్మె చేయనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో డీఈఓలకు నోటీసులు అందజేస్తున్నారు.

అప్పులు చెల్లించలేక చేతులెత్తేస్తున్నారు..

రాష్ట్ర ప్రభుత్వం నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించకపోవడంతో ఆ ప్రభావం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులపై పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులు తమ స్థాయికి మించి అప్పులు చేసి వంటలు చేస్తున్నా సర్కారు బిల్లుల చెల్లింపుల్లో కనికరించడం లేదు. ఫలితంగా వంట చేద్దామన్నా అప్పు పుట్టక, సర్కారు నుంచి బిల్లుల రాక కార్మికులు స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు. నిజామాబాద్ కొత్త కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఖానాపూర్‌లో స్కూల్ ప్రారంభమై 15 రోజులు కావొస్తున్నా ఏజెన్సీ లేదు. రెండ్రోజుల కిందట అక్కడ వీడీసీ ఒకరిని నియమించింది. మోపాల్ మండలం బాడ్సి ప్రైమరీ స్కూల్ ఏజెన్సీ నిర్వాహకులు అప్పులోల్ల వేధింపులు భరించలేక గ్రామాన్ని వదిలిపోయారు. ఎడపల్లి మండలం కుర్నాపల్లి జెడ్పీహెచ్ఎస్‌లోనూ ఏజెన్సీ లేదు. పైగా కొత్త మెనూ అధికారికంగా అమలు చేయాలని ఉత్తర్వులు రాలేదు. కానీ కొత్తమంది హెచ్ఎంల నుంచి కార్మికులకు వేధింపులు ఎక్కువయ్యాయి.

రూ.13 లక్షల బిల్లులు రావాలి



మధ్యాహ్న భోజన బిల్లులు రూ.13 లక్షలు రావాలి. ఇందులో రూ.6 లక్షలు బయట 3-5 శాతం చొప్పున వడ్డీకి తీసుకొచ్చిన. మిగిలిన డబ్బులు బంగారం తాకట్టు పెట్టి తెచ్చిన. ప్రభుత్వం చెల్లిస్తుందని భావించాను. 2022 అక్టోబర్ నుంచి నాకు బిల్లులు రాలేదు. భార్య మెడపై ఉన్న నల్లపూసల దండ సహా బ్యాంకులో ఉంది. ఇప్పుడు అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి చేస్తున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- చంద్రశేఖర్, జెడ్పీహెచ్ఎస్ బోర్గాం(బి)

తిప్పుకుంటున్నారు..



గర్ల్స్ హైస్కూల్ మోర్తాడ్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్నాను. 8 నెలలుగా కోడిగుడ్ల పైసలు రాలేదు. అలాగే 8, 9వ తరగతికి చెందిన మధ్యాహ్న భోజన బిల్లులు రాలేదు. ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు రావాలి. చాలాసార్లు డీఈఓ సారును కలిశాం. రేపు, మాపు అంటున్నారు తప్ప బిల్లులు అయితే రావడం లేదు. వంటకు అవసరమైన పప్పులు, ఉప్పులు తీసుకొద్దామంటే షావుకారు కూడా నమ్మే పరిస్థితి లేదు.

- పి. నిరంజన, గర్ల్స్ హైస్కూల్, మోర్తాడ్

పెరిగిన వేతనాలు అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలి. భోజన ఏజెన్సీలను రద్దు చేసి స్వచ్ఛంద సంస్థలకు కట్టబెట్టే చర్యలను మానుకోవాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా శ్లాబ్ రేటు పెంచాలి. సబ్సిడీపై గ్యాస్ అందజేయాలి. కార్మికులకు ప్రమాద బీమా చేయాలి. చాలా మంది కార్మికులు వంట చేస్తున్న సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. వంట షెడ్లు నిర్మించాలి.

- మల్యాల గోవర్ధన్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి

వేధింపులు ఆపాలి



రాష్ట్ర ప్రభుత్వం వేతనం పెంచుతామని ప్రకటించగానే.. కొన్ని పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వహకులపై హెచ్ఎంలు, టీచర్ల వేధింపులు ఎక్కువయ్యాయి. కానీ పెంచిన వేతనం ఇవ్వడం లేదు కానీ.. వేధింపులు ఆగడం లేదు. 15 సంవత్సరాల కిందట ఇచ్చిన వంట పాత్రల్లోనే వంటలు చేస్తున్నాం. ఆ పాత్రలు వంటకు ఉపయోగకరంగా లేవు. కొత్తవి అందజేయాలి. మోడల్ స్కూళ్లలో ఇప్పటికీ వంట పాత్రలు ఇవ్వలేదు. ఎన్ని సంవత్సరాలు కిరాయిలకు తీసుకొస్తాం? వెంటనే వంటపాత్రలు అందజేయాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలి.

- చామంతి లక్ష్మి, యూనియన్ జిల్లా అధ్యక్షులు.

చేతివృత్తులకు కేసీఆర్ చేయూత

- వృత్తికులాల కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ఛైర్మెన్లు



నవతెలంగాణ-హైదరాబాద్

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అన్ని రకాలుగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఎన్నడూ లేనివిధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని వృత్తి కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు ఛైర్మెన్లు అభిప్రాయపడ్డారు. శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని గొర్రెల మేకల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఛైర్మెన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మెన్ పిట్టల రవీందర్ ముదిరాజ్, కల్లుగీత కార్పొరేషన్ ఛైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్, టెక్స్‌టైల్ అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ గూడూరి ప్రవీణ్ నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన చేతివృత్తుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సహాయ సహకారాల ఫలితంగా రాష్ట్రంలో లక్షలాదిమంది చేతివృత్తుల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను లబ్ధిదారులకు సరైన రీతిలో అందేలా వృత్తి కులాలకు చెందిన కార్పొరేషన్లు, ఫెడరేషన్లు తమ వంతు కృషిని కొనసాగిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను, వాటి ఫలితంగా అనుభవంలోకి వస్తున్న ఫలితాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. వెనుకబడిన తరగతులతో పాటుగా అందులో భాగమైన అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని, అమలుపరుస్తున్న పథకాలని ఇంటింటికి చేరవేసేందుకు కార్పొరేషన్లు, ఫెడరేషన్లు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలతోపాటుగా దళిత, మైనారిటీ, గిరిజన, ఆదివాసి, మహిళ, వికలాంగుల అభ్యున్నతి కోసం గడచిన తొమ్మిదేండ్లుగా పనిచేస్తున్నదని వారు అభిప్రాయపడ్డారు.

పోడు రైతులను దగా చేసిన ప్రభుత్వం : ఏఐకేఎంఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోడు రైతులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) విమర్శించింది. శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల బిక్షపతి, బి భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పోడు సేద్యం చేసుకుంటున్న రైతులకు 11 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామంటూ గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కేవలం నాలుగున్నర లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చి పోడు రైతులని దగా చేశారని విమర్శించారు.

ఎన్నికల తాయిలాలలో భాగంగా కొద్ది మందికి తూతూ మంత్రంగా పట్టాలిచ్చి మెజారిటీ పోడు రైతులను వారి భూములు నుంచి వెళ్లగొట్టడానికి కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పట్టాలు రాని వారందరూ భూములను వదిలి వెళ్లాలంటూ అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని వివరించారు. మరోవైపు అధికార పార్టీ నేతలు పోడు రైతుల నుంచి పట్టాలిప్పిస్తామంటూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. అటవీ హక్కుల చట్టం నిర్దేశించినట్టుగా, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వ దాగాకోరు విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

సీఎం కేసీఆర్‌కు 475 అసోసియేషన్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరించినందుకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకుకు 475 అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ ధన్యవాదాలు తెలిపారు. అయితే మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ మేరకు సీఎంకు వారు ఆన్‌లైన్ ద్వారా శనివారం లేఖ రాశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో తెలంగాణ ఆదర్శంగా ఉందని తెలిపారు. మరి కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులు గత 23 ఏండ్లుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారి విషయంలో కొంతమందికి సాంక్షన్ పోస్టులు, తగిన విద్యార్హతలు, అదనపు అర్హతలు లేవంటూ చిన్న చిన్న కారణాలు చూపుతూ క్రమబద్ధీకరణ చేపట్టలేదని వివరించారు. వీటికి కాంట్రాక్టు అధ్యాపకులు బాధ్యులు కాదని, సంబంధిత అధికారులు సమయానుకూలంగా తగిన ఉత్తర్వుల్లో మార్పులు చేయకపోవటం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. వారి క్రమబద్ధీకరణ విషయంలో తగిన మినహాయింపునిచ్చి క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరారు. ఈ అంశాలను మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు వాటిపై ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో క్రమబద్ధీకరణ కాని కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని మినహాయింపులిచ్చి క్రమబద్ధీకరణ అయ్యేలా చూడాలని కోరారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

జ్ఞాపకాల పదును

నీవు పరిచయమయిన కొత్తలో చెప్పిన
కబుర్లన్నీ నేడు పాతగిలవడ్డ గురిగి,
ముంతల పాత్రలయినయేమో వాటి విలువ
ఇప్పుడు చీప్...

నీతో గడిపిన ఆ క్షణాలన్ని
నేడు ఒక్కో యుగంలా గడుస్తుంటే
గుండె బండలా బరువెక్కి చెక్కలు
ముక్కలయింది
మళ్ళీ కొత్తగా యిగువెట్టడం నేర్వాలి...

నువ్ చేసిన ఫోన్ కాల్స్, టెక్స్ట్ మెసేజ్లు అన్ని
అన్నీ యిప్పుడు నాలా ఒంటరై పోయాయి
చెవుల్లో ఎయిర్ ఫోన్స్ పెట్టుకోకుండానే
లోనంతా గడెలువడ్డ శబ్దాలు నీ పేరు తప్ప
నాకేమి వినిపియ్యడం లేదు...

మనిద్దరం కల్సి తిరిగిన తోవల్లో
జారిడిసిన "(నీ)నా" అడుగు జాడలు
కన్నీటి సంద్రంలో మునిగి తేలినయేమో
అచ్చం మా ఊరెనికి సెర్వులో
తుమళ్ళ వనం మొల్సినట్టే అనిపిస్తుంది...

నెమరేద్దామంటే
నీవిపుడు నాతోడు లేవని దెల్సి
తనువు ఆకాలేయడమే ఆపేసింది...

మరేం పర్వాలేదు నన్ను అంటిపెట్టుకొనున్న
నీ పచ్చిజ్ఞాపకాల పదునుతో
హృదయాంతరంగంలో నే అస్తమించేంత వరకు
తిరిగి మళ్ళీ మళ్ళీ ఉదయిస్తూనే ఉంటా
మిస్ యు బంగారం...

- తలారి సతీష్ కుమార్



సిగరెట్ పీకలతో సాఫ్ట్ టాయ్స్.. రోడ్లు...

సాధారణంగా ఇంట్లో సినిమా చూస్తున్నా, థియేటర్ లోనై సినిమా కన్నా ముందు ఒక ప్రకటన వెలువడుతుంది. 'పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం'అనే ప్రకటన అందరం చూసే ఉంటాం. అయితే వీటిని ఏమాత్రం పట్టించుకొని అనేక మంది బహిరంగ ప్రదేశాల్లో కూడా ధూమపానం చేస్తూ ఉంటారు. అయితే దూమపానం చేసే వారి కన్నా, వారి పక్కన ఉండే వారికి ఇది అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా తాజా అధ్యయనాలలో సిగరెట్ కన్నా, సిగరెట్ తాగి పడేసిన పీక ఎంతో ప్రమాదకరమని వెల్లడైంది. సిగరెట్ ఎక్కువగా తాగడం వల్ల వాటి ప్రభావం నెమ్మదిగా ఊపిరితిత్తుల మీద పడుతుంది. ఫలితంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యల బారిన పడతారు అన్న విషయం తెలిసినదే. అయితే తాజాగా సిగరెట్ తాగి పడేసిన పీకలో నికోటిన్ అనే పదార్థం ఉండటం వల్ల మనం తాగి పడేసినప్పుడు దానిలో ఉండే నికోటిన్ గాలిలో కలిసి దాని ప్రభావం గాలిలో ఒక వారం వరకు ఉంటుందని అమెరికాకు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు తాజా పరిశోధనల్లో తెలిపారు.



నీరు కాలుష్యం కాకుండా..

ఇప్పటిదాకా 250 కోట్ల సిగరెట్ పీకలను ఇలా ప్రాసెస్ చేసిందా సంస్థ. అంటే సుమారు 125 కోట్ల లీటర్ల నీరు కాలుష్యం కాకుండా అడ్డుకుందన్నమాట!

ఈ పరిశోధనల ప్రకారం దాదాపు 15 శాతం నికోటిన్ సిగరెట్ పీకలో నిల్వ ఉండిపోవడం వల్ల మనం సిగరెట్ తాగి దానిని యాష్ ట్రే లో కానీ లేదా బహిరంగ ప్రదేశాలలో వేసినప్పుడు అందులో వుండే నికోటిన్ గాలిలో కలవడం వల్ల మానసిక ఆరోగ్య స్థితిపై ప్రభావం పడుతుంది. చిన్న పిల్లలపై,ముసలి వారిపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని అనేక పరిశోధనలు తెలుపుతున్నాయి. అందువల్ల సిగరెట్ తాగకపోవడం ఎంతో మంచిది. కానీ, దానిని పాటించేవారేందరు? అనేది వేల డాలర్ల ప్రశ్న.

కాల్చి పారేసిన సిగరెట్ పీకలు ఎందుకూ పనికి రావని అందరూ అంటారు. ఎందుకూ పనికి రాని వస్తువులను, సంపాదన లేని మనుషులను వాడి పారేసిన సిగరెట్ పీకలతో పోలుస్తుంటారు. అయితే అలాంటి సిగరెట్ పీకలతోనే ఓ వ్యక్తి డబ్బులు సంపాదిస్తున్నాడు. రోడ్ల మీద పడి ఉండే సిగరెట్ పీకలను సేకరించి వాటితో బొమ్మలను, ఎరువులను తయారు చేస్తున్నాడు. అంతేకాదు మరికొంత మందికి ఉపాధి కూడా కల్పిస్తున్నాడు. అతని కథ తెలుసుకుంటే చాలా ఆశ్చర్యం అనిపించకమానదు.

సిగరెట్ పీకలో ఉండే దూదిలాంటి ప్లాస్టిక్- సెల్యులోజ్ అసిటేట్ భూమిలో కలిసిపోవడానికి కనీసం కొన్ని ఎండ్లు పడుతుందంటాడు నమన్ గుప్తా. అంతేకాదు, ప్రతి పీకా అరలీటరు భూగర్భ జలాన్ని కలుషితం చేస్తుందని అంటున్నాడు. అందుకే ఈ సిగరెట్ పీకల్ని రీసైక్లింగ్ చేయడానికి సరికొత్త పద్ధతిని కనిపెట్టాడు నమన్ గుప్తా. నొయిడాకు చెందిన గ్రాడ్యుయేట్ నామన్ గుప్తా, విశాల్ కనెత్ అనే ఇంజినీర్ కలిసి కొన్నాళ్ల కిందట 'కోడ్ ఎఫర్ట్' పేరుతో 2018లో స్టార్టప్ కంపెనీని ప్రారంభించారు. ఈ కంపెనీ ద్వారా సిగరెట్ పీకలను శుభ్రపర్చి బొమ్మలు, కుషన్లు తయారు చేస్తున్నారు. ఇవి భూమిలో కలిసిపోవడానికి పదేండ్లుకుపైగా సమయం పడుతుంది.



దీన్ని బట్టి ఆలోచించండి.. రోజుకు కోట్ల సిగరెట్ పీకలు భూమిలో కలిసిపోకుండా.. ఎంత భారీ భూకాలుష్యానికి కారణమవుతున్నాయో! ఈ ఆలోచనే 'కోడ్ ఎఫర్ట్' స్టార్టప్ కంపెనీ స్థాపనకు శ్రీకారం చుట్టింది.



వీబిన్స్‌తో సిగరెట్ పీకల సేకరణ

సిగరెట్ల వినియోగం, చెత్తబుట్టలకు చేరుతున్న సిగరెట్ పీకలు వంటి అంశాలపై నామన్.. విశాల్ బాగా అధ్యయనం చేశారు. అనంతరం 'కోడ్' కంపెనీ స్థాపించి.. యంత్రాలను సమకూర్చుకున్నారు. అయితే, సిగరెట్ పీకలను ఎలా సేకరించాలనేదే వీరికి పెద్ద సవాల్ గా మారింది. అందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న స్క్రాప్ డీలర్‌లను సంప్రదించాడు. దీనికోసం కోడ్ సంస్థ వీధి వ్యాపారులు, చెత్త సేకరించేవాళ్లకు 'వీబిన్స్' పేరుతో డబ్బాలు పంపిణీ చేసింది. రోడ్ల పక్క దుకాణాలు, టీ స్టాల్స్, కార్యాలయాల్లోని చెత్తబుట్టల వద్ద వీటిని పెట్టి కేవలం సిగరెట్ పీకలను సేకరించాలని సూచించింది. ఇలా సేకరించిన సిగరెట్ పీకలను ఈ సంస్థే కిలో రూ.250 చొప్పున కొనుగోలు చేస్తుంది.

ఆ సంస్థ ద్వారా దేశంలోని 250కి పైగా జిల్లాల నుంచి సుమారు రెండువేల మంది కార్మికుల ద్వారా రోజూ వెయ్యి కిలోల సిగరెట్ పీకల్ని సేకరిస్తున్నారు. వాటి నుంచి పొగాకు, సన్నటి కాగితం, దూదిలాంటి ప్లాస్టిక్(సెల్యూలోజ్ అసిటేట్)ను వేరు చేస్తున్నారు. పొగాకును సూక్ష్మజీవుల సాయంతో ఎరువుగా మారుస్తున్నారు. సన్నటి పేపర్‌ను ప్రత్యేక రసాయనాలతో పల్ప్‌గా మార్చి... 250 జీఎస్ఎం మందంలో పేపర్‌లని తయారు చేస్తున్నారు. వాటితో కవర్లూ, లెటర్‌హెడ్లూ వంటివి రూపొందిస్తున్నారు. చివరగా దూదిలాంటి ప్లాస్టిక్- సెల్యూలోజ్ అసిటేట్‌ని బొమ్మలు, తలగడలు, ఇతర అలంకరణ వస్తువుల్లో నింపే ప్లాస్టిక్ స్టఫింగ్‌గా వాడుతున్నారు.


రానున్న ఐదేళ్లలో దేశవ్యాప్తంగా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు చెబుతున్నారు. నిజంగానే ఇది మంచి ఆలోచన కదా!

బొమ్మలు.. కుషన్లు..

ఇలా సేకరించిన సిగరెట్ పీకల్ని న్యూఢిల్లీ శివారులో ఉన్న వీరి పరిశ్రమలో శుభ్రపరిచిన తర్వాత ఆ పీకల్లో ఉండే దూదిలాంటి ఫైబర్‌ను బయటకు తీసి బ్లీచ్ చేస్తున్నారు. ఈ ఫైబర్‌తో అందమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. అలాగే పిల్లోస్ తయారీలో కూడా ఈ ఫైబర్‌ను వాడుతున్నారు. తొలినాళ్లలో 10 గ్రాముల సిగరెట్ బట్ ఫైబర్ సేకరించేవారు. ఇప్పుడది వేయి కిలోలకు చేరింది. ఇందుకోసం నిత్యం లక్షలాది సిగరెట్ పీకలను సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నారు. వీరు తయారుచేసిన సాఫ్ట్ టాయ్స్ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో అమ్మకానికి ఉంచారు. చిన్నారులు వీటిని అమితంగా ఇష్టపడుతున్నారు. ఈ సంస్థలో పనిచేయడం వల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా జరుగుతున్నదని అక్కడ పనిచేసే ఉద్యోగుల అభిప్రాయం. ఢిల్లీకి చెందిన నమన్ గుప్తా ఆలోచనలకు ప్రతిరూపంగా ఈ సిగరెట్ బట్ సాఫ్ట్ టాయ్స్, పిల్లోస్ తయారవుతున్నాయి.

మహిళలకు ఉపాధి

కాగితాన్ని రీసైకిల్ చేసి, ఫైబర్‌ను ప్రాసెస్ చేసి సరికొత్త రకం పత్తిని తయారు చేస్తారు. ఆ పత్తితో మృదువైన బొమ్మలు, ఇతర కళాకృతులను తయారు చేస్తారు. ఆన్‌లైన్ ద్వారా, రిటైల్ స్టోర్స్ ద్వారా వాటిని విక్రయిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను నోయిడాలోని ఓ ప్లాంట్‌లో చేస్తారు. నమన్‌కు వచ్చిన ఆలోచన తనకు వ్యాపారం మారడమే కాకుండా స్థానిక మహిళలకు ఉపాధి కూడా కల్పిస్తోంది.





సిగరెట్ పీకలతో రోడ్లు

దునియా మే కోయీ చీజ్ నహీ బేఖార్ థీ అంటారు. ఈ ప్రపంచంలో పనికిరాని వస్తువంటూ లేదు. ఆఖరికి కాల్చి పారేసిన సిగరెట్ పీక కూడా. సిగరెట్ బట్స్ తో పర్యావరణానికి ముప్పుందని అనేక హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో.. వాటితో ఉపయోగం కూడా వుందన్న వార్త నిజంగా సంతోషమే కదా. పారేసిన సిగరెట్ పీకలతో ఎంచక్కా రోడ్ల గుంతల్ని పూడ్చేయవచ్చట. ప్రతీ ఏటా 6 ట్రిలియన్ల సిగరెట్ పీకలు భూమ్మీద పోగవుతున్నాయి. అంటే 1.2 మిలియన్ టన్నుల పీకలు వేస్టేజీ కింద పడుతున్నాయి. ఈ లెక్కన చూసుకుంటే 2025కల్లా ఆ బరువు యాభై శాతం పెరుగుతుందని అంచనా. పెరుగుతున్న జనాభా, మారుతున్న అలవాట్లు పర్యావరణాన్ని మరింత కాలుష్యం చేస్తాయన్నది కఠోర వాస్తవం. పదినుంచి పదిహేను సంవత్సరాల దాకా డీ కంపోజ్ కాని సిగరెట్ పీకల్ని తారులో కలిపి రోడ్లు వేస్తే ఆ రహదారి చెక్కుచెదరకుండా వుంటుందట. రోడ్డు ఎంతటి ట్రాఫిక్ నైనా తట్టుకుంటుందట. థర్మల్ కండక్టివిటీని కూడా తగ్గించే శక్తి సిగరెట్ పీకలకు ఉందని మెల్ బోర్న్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది.


మెల్ బోర్న్ ఆర్ఎంఐటీ యూనివర్సిటీలో లెక్చరర్ గా పనిచేసే అబ్బాస్ మోహజెరాని ఈ విషయంపై ఎడతెగని పరిశోధన చేశారు. సిగరెట్ పీకల నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు అబ్బాస్ ఎన్నో సస్టెయినబుల్ ప్రాక్టికల్ మెథడ్స్ ఉపయోగించారు. వందలాది టాక్సిక్ కెమికల్స్ తో తయారుకాబడిన సిగరెట్ పీకల్ని వేడిచేసిన తారులో మిక్స్ చేస్తే రోడ్డు వేస్తే దారినంతా ఇటుకలతో కప్పేసినంత గట్టిగా వుంటాయని తేల్చి చెప్పారు. ఇకనైనా పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన సిగరెట్ పీకలతో రోడ్లు వేయడం వలన భవిష్యత్ లో పర్యావరణానికి ముప్పు కొంత తగ్గుతుంది. ప్రభుత్వాలు ఇలాంటి వాటిపై దృష్టి పెడితే అటు పర్యావరణానికి మేలు చేస్తుంది. అదే విధంగా గుంతలు లేని అందమైన రోడ్లు నిర్మాణం అవుతాయి.

- మోహన్

సంస్థ ద్వారా దేశంలోని 250కి పైగా జిల్లాల నుంచి సుమారు రెండువేల మంది కార్మికుల ద్వారా రోజూ వెయ్యి కిలోల సిగరెట్ పీకల్ని సేకరిస్తున్నారు. వాటి నుంచి పొగాకు, సన్నటి కాగితం, దూదిలాంటి ప్లాస్టిక్(సెల్యూలోజ్ అసిటేట్)ను వేరు చేస్తున్నారు. పొగాకును సూక్ష్మజీవుల సాయంతో ఎరువుగా మారుస్తున్నారు. సన్నటి పేపర్‌ను ప్రత్యేక రసాయనాలతో పల్ప్‌గా మార్చి... 250 జీఎస్ఎం మందంలో పేపర్‌లని తయారు చేస్తున్నారు. వాటితో కవర్లూ, లెటర్‌హెడ్లూ వంటివి రూపొందిస్తున్నారు. చివరగా దూదిలాంటి ప్లాస్టిక్- సెల్యూలోజ్ అసిటేట్‌ని బొమ్మలు, తలగడలు, ఇతర అలంకరణ వస్తువుల్లో నింపే ప్లాస్టిక్ స్టఫింగ్‌గా వాడుతున్నారు. రానున్న ఐదేళ్లలో దేశవ్యాప్తంగా సేకరించాలని లక్ష్యంగా ఎట్టుకున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు చెబుతున్నారు.



శోభ



ప్రఫుల్ల సాగర వదనంపై
ప్రపంచ జీవన మధనంపై
కదులుతున్నది కవితా తరంగం..
భానుడి లేలేత కిరణాల సోయగం
ఆహ్వానించి - ఆస్వాదించిన
పసిడి కడలి సౌందర్యం..
పచ్చటి పచ్చిక ఆదరాన
వెచ్చటి పవన చుంబనం
ఇది అనుదినం అరుదైన సంగమం..
ముద్దులొలికే మూగజీవుల విన్యాసం
సన్నని పిల్లగాలుల మురళీ గానం...
పవిత్ర హృదయానికి పరాకాష్ఠ
ధరిత్రి నుదుటన సింధూరమై
సంచలిస్తూ సంచరించే దివాకరం..
అడుగుజాడలను
ఆరాధించే ఆడపడుచులు
మడుగు అడుగులను ఆఘ్రాణించే
మత్స్యరాజములు..
మబ్బులకనువుగా మయూర నర్తనములు
మృదు, మధుర కోకిల
వసంత సంకీర్తనములు..
అంతరాయాలను ఆగ్రహించి
ఆంతరంగిక సౌదంలో.,
నిశ్శబ్ద సంభాషణ సాగించే
వృక్ష తేజమ్ములూ...
చరిత్ర తెలిపినా/ చరిత్ర నిలిపినా..,
జగతి జీవన భ్రమరంలో
ధనపడగ ధరిత్రి నిండా
పరచుకుంటున్నప్పుడు
ఎంతటి అమలిన సౌందర్య మైనా...,
అంతర్ధానమేనా...
కదిలే కాల భ్రమణంలో

- బొడ్డుపల్లి సాయిశంకర చారి,
8978972067

ఎంత ఘాటు ప్రేమయో...

ప్రేమలేఖలు
Voice Of Love

ఓయ్,

ఏంటి ఇలా మొదలు పెట్టానని అదిరి పడకు. రొటీన్‌గా ఏదీ ఉండకూడదంటావు కదా, అందుకే ఇలా... వర్షం, వెన్నెల, సంగీతం, మంచి పుస్తకాలు ఇంకా.... ఇలాంటి కొన్ని విషయాలు నాకు ఇష్టం. నువ్వు పరిచయం కాకముందు ఓ వెన్నెల రాత్రి మైదానంలో అలా నడుస్తున్నప్పుడు, చల్లగాలి మెల్లగా వీస్తున్నప్పుడు, చెవిలో వినిపిస్తున్న కమ్మని సంగీతం, చేతిలో పుస్తకం ఓ చిరుదిగులుని మనసులో విడిచి పెట్టేవి. తొలకరి జల్లులు కురుస్తున్నప్పుడు, తడిసిన మట్టి వాసన మత్తెక్కిస్తున్నప్పుడు అలాగే అనిపించేది. మనసుకి కలిగే ప్రతీ ఫీలింగుకీ ఒక పేరు పెట్టుకోలేం కానీ, ఎప్పుడో ఓ రోజు అదేమిటో కచ్చితంగా తెలుసుకోగలుగుతాం. - ఇప్పటికయినా తెలిసిందా? - అంటున్నావా? ఆ విషయం చెప్పడానికీ, నీ మీద ఫిర్యాదు చెయ్యడానికీ ఈ ఉత్తరం!

నీతో మాట్లాడి పూర్తిగా అరగంటైనా కాలేదు. మళ్ళీ మాట్లాడాలనే కోరిక ఈ లేఖని రాయిస్తుంది. ఒకసారి నువ్వు నవ్వినప్పటి జ్ఞాపకం మువ్వల పట్టీల శబ్దంలా నా గుండెల్లో - ఘల్లు - మంటే, ఇంకోసారి నువ్వు ఐ లవ్ యూ చెప్పినప్పటి తీపి గుర్తు గుండెల్లో వెలిగించిన చుచ్చుబుడ్డి కాంతి కళ్ళల్లో మెరిసినట్టు నా మొహం నాకే ముద్దొస్తుంది. అంతలోనే నువ్వు నా ప్రక్కన లేవన్న స్పృహ నిస్పృహ కలిగిస్తుంది. చూశావా ఇదీ దిగులే!

నీ ఫీలింగేమిటో అర్థమయ్యిందా? - అని నువ్వు అడిగిన ప్రశ్నకి సమాధానం ఇదే. అప్పుడెప్పుడో నువ్వు పరిచయం కాకముందు నాకు కలిగిన దిగులు పేరు ప్రేమ! - ఎవరి మీద!? - అంటావా? నీ మీదే. అలా ఆశ్చర్య పోవద్దు. - నేనెవరో తెలియదట, కానీ అప్పటికే నామీద ప్రేమట! - అని కోపం చూపించకు.

వెన్నలా, వర్షం అని ఈ ఉత్తరం మొదట్లో నేను చెప్పిన మాటలన్నీ ఒక జిగ్సా పజిల్లో ముక్కల్లాంటివి. వాటన్నింటినీ నాకిచ్చి, అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించుకోమని అంటే, ఎన్నిసార్లు మార్చి మార్చి పేర్చినా ఒక ముక్క తగ్గేది. అసంపూర్తి చిత్రం ఎప్పుడూ ఆనందాన్ని ఇవ్వదుకదా? అప్పుడు నాకు తెలియకుండా నీకోసం వెతుక్కొనే నా తపనే, నా దిగులు. అది ఖచ్చితంగా నీ మీద ప్రేమే!



బీచ్ దగ్గరకి వెళ్ళి నిశ్శబ్దంగా కూర్చుంటానా, దూరంగా సముద్రంలో మునుగుతున్న డాల్ఫిన్ నోస్, అలల మీదనుంచి వచ్చే చల్ల గాలి, ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలు, పెద్ద శబ్దంతో ఒడ్డుమీద విరిగి పడుతున్న కెరటాలు నిన్ను మళ్ళీ జ్ఞాపకం చేస్తాయి. చూశావా మళ్ళీ నా భావాలని సరిగా చెప్పలేకపోతున్నాను! అసలు నిన్నెప్పుడైనా మరచి పోతే కదా, మళ్ళీ, మళ్ళీ జ్ఞాపకం చేసుకోవడానికి?

తొందరగా వచ్చెయ్యకూడదా, నాకు ఈ ప్రేమలేఖలు రాసుకొనే ఇబ్బంది తప్పుతుంది. నువ్వు దూరంగా ఉంటే నీ గురించి వందల ఆలోచనలు మనసులో ఉక్కిరి బిక్కిరి చేసేస్తూ ఉంటాయి. నీకు రాద్దామని మొదలుపెడతానా, ఒక్కసారిగా అన్నీ ముందుకు తోసుకొని వచ్చి - నన్ను రాయి - అంటే - నన్ను రాయి - అని ఉత్తరాన్ని మ్యానిపులేట్ చేస్తున్నాయి.

ఏమొహో చిగురుటదరముల- యెడనెడ కస్తూరి నిండెను. భామిని విభునకు రాసిన పత్రిక కాదుకదా...? - అని అన్నమయ్య ఆశ్చర్య పోతాడు. నా ఉద్దేశ్యంలో ఇలాంటివే అత్యుత్తమమైన లేఖలు. నువ్వు కూడా నాకోసం అలాంటి లేఖలు రాయడానికి ప్రయత్నించవచ్చు కదా?

విశ్వకవి ఏమంటాడంటే *'I would ask for more, if I had the sky with all its stars, and the world with all its endless riches. But I would be content with the smallest corner of the earth if only you were mine'* ప్రపంచంలో ఏ మూలయినా, చిన్న జాగా ఉన్నా నీ సాహచర్యంతో ఆనందంగా జీవించచ్చు. అందుకే నీకోసం ఎదురు చూస్తూ..

నీకై పరితపించే...
శేషు

దీపిక


కలకత్తా చీకటి గది ఉదంతం అంటే ఏమిటి?



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

పోటీ పరీక్షల ప్రత్యేకం ఇండియన్ హిస్టరీ

భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో బెంగాల్‌కి ఒక విశిష్టమైన స్థానముంది. మొఘల్ సామ్రాజ్యంలో ఆంగ్లేయులు ఆక్రమించిన మొదటి రాష్ట్రం బెంగాల్. ఫ్రెంచ్, బ్రిటీషు వ్యాపార కంపెనీలకు సంబంధించిన ప్రధాన స్థావరాలు బెంగాల్‌లోనే ఉండేవి. బెంగాల్‌లోని చంద్రానగర్ ఫ్రెంచ్ వారికి ప్రధాన స్థావరంగా ఉంటే, కలకత్తా బ్రిటీషు వారికి ప్రధాన స్థావరంగా ఉండేది. క్రీ.శ. 1700వ సంవత్సరంలో ఔరంగజేబు కాలంలో ముర్షిద్ కులీఖాన్ బెంగాల్ గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ముర్షిద్ కులీఖాన్ ఆ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేయటంతో పాటు అనేక పట్టణాల నిర్మాణాన్ని కూడా చేపట్టాడు. ముర్షిద్ కుజ్ అనే నగరం ఆయన నిర్మించిందే. ముర్షిద్ కులీఖాన్‌ను 'ఆధునిక స్వాతంత్ర్య బెంగాల్ రాజ్య స్థాపకుడు' అని కూడా పిలిచేవారు. అనంతర కాలంలో ముర్షిద్ కులీఖాన్ మనవడు సర్ఫరాజ్ ఖాన్‌ని వధించి ఆలీవర్దిఖాన్ ఆ ప్రాంతానికి పాలకునిగా ప్రకటించుకున్నాడు. ఇటు దక్షిణ భారతదేశంలో ఆంగ్లో - కర్ణాటక యుద్ధాలు ముమ్మరంగా జరుగుతున్న కాలంలో ఆలీవర్దిఖాన్ బెంగాలు పాలకుడిగా ఉన్నాడు.



ఆ యుద్ధాల ప్రభావం దేశంలోని అనేక ప్రాంతాలతో పాటు బెంగాల్ మీద కూడా ఉండేది. ఆలీవర్ధిఖాన్ మరణించాక అతని మనవడు సిరాజుద్దౌలా బెంగాల్ సింహాసనాన్ని అధిష్టించాడు. సిరాజుద్దౌలా పట్టాభిషేక కార్యక్రమాన్ని ఆంగ్లేయులు బహిష్కరించారు. సిరాజుద్దౌలాకి ఆది నుండి బ్రిటీషు వారంటే గిట్టేది కాదు. కలకత్తా ప్రధాన స్థావరంగా ఏర్పాటు చేసుకున్న బ్రిటీషు ప్రభుత్వం ఆ ప్రాంతాలలో రక్షణ కోటలు నిర్మాణాన్ని కొనసాగించాలనుకుంది. సిరాజుద్దౌలా ఈ ప్రయత్నాలకు గండి కొట్టాడు. కలకత్తా పరిసర ప్రాంతాలలో ఆంగ్ల, ఫ్రెంచి కంపెనీలు తమ వర్తక స్థావరాలు, రక్షణ కోటల నిర్మాణాలను చేపట్టరాదని హుకుం జారీ చేశాడు. సిరాజుద్దౌలా ఆజ్ఞలను అంగీకరించిన ఫ్రెంచి కంపెనీ తన నిర్మాణాలను నిలిపి వేసింది. కానీ బ్రిటీషు కంపెనీ ఆ ఆజ్ఞలను ఏమాత్రం పట్టించుకోకుండా తమ నిర్మాణాల కార్యకలాపాలను యధావిధిగా కొనసాగించింది. దీంతో ఆగ్రహోదగ్రుడైన సిరాజుద్దౌలా 1756లో 3వేల మంది సైనిక బలగంతో దండెత్తి వెళ్లి ఆంగ్లేయుల వర్తక స్థావరాలైన కాశీం బజార్, కలకత్తాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆక్రమించుకున్న తర్వాత కలకత్తా నగరానికి సిరాజుద్దౌలా ఆలీ నగర్‌గా నామకరణం చేశాడు. ఈ నగరానికి మాణిక్ చంద్‌ని పాలకుడిగా నియమించాడు.

ఈ యుద్ధంలో సిరాజుద్దౌలా ధాటికి ఎదురు నిలవలేమని గ్రహించిన అప్పటి గవర్నర్ జాన్ డ్రక్, తన అధికారులు, సైనికులతో హుగ్లీ నదిలో ఒక పడవ ద్వారా ఫుల్టాన్ దీవికి తప్పించుకుని పారిపోయాడు. పారిపోగా మిగిలిన వారిని సిరాజుద్దౌలా సైనికులు బంధింస్తారు. 1756 జూన్ 20న కలకత్తాను ఆక్రమించుకునే సందర్భంలో పట్టుబడిన 146 మంది బ్రిటీషు సైనికులను ఒక చిన్న గదిలో బందిస్తాడు. కొంత మంది చరిత్రకారులు వీరిని ఆ గదిలో బంధించమని సిరాజుద్దౌలా ఆదేశించలేదని, ఆయన పరోక్షంలో బ్రిటీషు సైనికులకి, సిరాజుద్దౌలా సైనికుల మధ్య జరిగిన వాగ్వివాదం కారణంగా సిరాజుద్దౌలా సైనికులే వారిని కేవలం ఆరుగురిని బంధించడానికి నిర్మించిన ఒక చిన్న గదిలో వారిని బంధించారని వారి రచనలలో పొందు పరిచారు. ఒక రాత్రంతా వారిని ఆ చిన్న చీకటి గదిలో బంధించటం వల్ల ఊపిరి ఆడక 123 మంది ప్రాణాలు కోల్పోగా, కేవలం 23 మంది బతికి బయట పడ్డారు. ఈ ఉదంతం అంతటినీ ఆ ఘటన నుండి బ్రతికి బయటపడిన సైనికులలో ఒకడైన హల్ వేల్ తను స్వయంగా రచించిన 'ది బ్లాక్‌హోల్ ట్రాజెడీ' అనే గ్రంథంలో వెల్లడించాడు. ఈ ఘటననే ఆధునిక చరిత్రకారులు 'కలకత్తా చీకటి గది ఉదంతం'గా అభివర్ణిస్తారు. తమ సైనికులు 123 మంది సిరాజుద్దౌలా చేతిలో ప్రాణాలు కోల్పోడాన్ని సహించని బ్రిటీషు ప్రభుత్వం రాబర్ట్ క్లైవ్‌ను రంగంలోకి దించుతుంది.

సిరాజుద్దౌలా సేనాని మీర్ జాఫర్‌ని లంచం ఆశ చూపి సిరాజుద్దౌలాకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేలా క్లైవ్ పథక రచన చేస్తాడు. మరొక పక్క సిరాజుద్దౌలా శత్రువు మరియు ప్రముఖ వర్తక వ్యాపారి అయిన అమీన్ చంద్‌కి ఫోర్ట్ విలియంలో ఆశ్రయమిస్తాడు. తర్వాత జరిగిన పరిణామాల వల్ల తిరిగి కలకత్తా ఆంగ్లేయుల స్వాధీనంలోకి వస్తుంది. పరిస్థిలను అంచనా వేసుకున్న సిరాజుద్దౌలా 1759లో బ్రిటీషు వారితో ఒక సంధి చేసుకుంటాడు. దీనినే ఆలీనగర్ సంధి అంటారు. బ్రిటీషు సైన్యం ఫ్రెంచి స్థావరాలపై దాడి చేయకూడదనేది ఈ సంధి నియమాలలో ఒకటి. ఈ నియమాన్ని ఉల్లఘించి రాబర్ట్ క్లైవ్ ఫ్రెంచ్ వర్తక స్థావరమైన చంద్రానగర్‌పై దాడి చేసి, ఆ స్థావరాన్ని స్వాధీనం చేసుకుంటాడు. దీనికి ఆగ్రహించిన సిరాజుద్దౌలా ఆంగ్లేయులతో జరిగిన యుద్ధంలో ఓడిపోయిన ఫ్రెంచ్ సైనికులకి ఆశ్రయమిస్తాడు. ఇది ఆంగ్లేయులో మరింత ఆగ్రహాన్ని కలిగించటంతో పాటు, ఆ తర్వాత జరిగిన ప్లాసీ యుద్ధానికి ఆజ్యం పోసింది.

1. ఆంగ్లేయులు ఆక్రమించిన మొఘల్ సామ్రాజ్యంలోని మొదటి రాష్ట్రం ఏది?
ఎ. కలకత్తా బి. బెంగాల్
సి. హైదరాబాద్ డి. పైవేవీ కావు.

2. దక్షిణ భారతదేశంలో ఆంగ్లో - కర్ణాటక యుద్ధాలు జరుగుతున్న సమయంలో బెంగాల్ పాలకుడు ఎవరు?
ఎ. ఆలీవర్దిఖాన్ బి. సిరాజుద్దౌలా
సి. ముర్షిద్ కులీఖాన్ డి. పైవేవీ కావు.

3. ఆధునిక స్వాతంత్ర్య బెంగాల్ రాజ్య స్థాపకుడిగా ఎవరిని పిలుస్తారు?
ఎ. ముర్షిద్ కులీఖాన్ బి. ఆలీవర్ది ఖాన్
సి. సిరాజుద్దౌలా డి. మీర్ జాఫర్

4. ఏ బెంగాల్ నవాబు పట్టాభిషేకాన్ని ఆంగ్లేయులు బహిస్కరించారు?
ఎ. మర్షిద్ కులీఖాన్ బి. మీర్ జాఫర్
సి. ఆలీవర్దిఖాన్ డి. సిరాజుద్దౌలా

5. ఆంగ్లేయులు విలియం ఫోర్టు కోటలో ఆశ్రయమిచ్చిన సిరాజుద్దౌలా శత్రువు ఎవరు?
ఎ. ఆమీన్ చంద్ బి. మీర్ జాఫర్
సి. హల్ వేల్ డి. మాణిక్ చంద్

6. సిరాజుద్దౌలా కలకత్తాను ఆక్రమించుకున్న తర్వాత దానికి ఏ పేరు పెట్టాడు?
ఎ. ఫోర్టు విలియం
బి. ఆలీ నగర్
సి. చంద్రానగర్ డి. ముర్షీద్ కుజ్

7. కలకత్తా చీకటి గది ఉదంతం ఎప్పుడు జరిగింది?
ఎ. 1756 జనవరి 20 బి. 1756 జూలై 20
సి. 1756 జూన్ 20 డి. పైవేవీ కావు

8. కలకత్తా చీకటి గది ఉదంతంలో ఎంత మంది ప్రాణాలు కోల్పోయారు, ఎంత మంది బ్రతికారు?
ఎ. 146 మందిలో 123 మంది చనిపోగా 23 మంది బతికారు
బి. 146 మందిలో 23 మంది చనిపోగా 123 మంది బతికారు
సి. 148 మందిలో 124 మంది చనిపోగా 24 మంది బతికారు
డి. 148 మందిలో 24 మంది చనిపోగా 124 మంది బతికారు

9. కలకత్తాను ఆక్రమణ అనంతరం సిరాజుద్దౌలా ఎవర్ని కలకత్తా పాలకుడిగా నియమించాడు?
ఎ. మీర్ జాఫర్ బి. మాణిక్ చంద్
సి. ఆమీన్ చంద్ డి. హాల్ వేల్

10. కలకత్తా చీకటి ఉదంతాన్ని వెల్లడించిన బ్రిటీషు సైనికుడు ఎవరు?
ఎ. పాల్ వేల్ బి. జాన్ డ్రక్
సి. హాల్ వేల్ డి. రాబర్ట్ క్లైవ్

11. కలకత్తా ఉదంతాన్ని వెల్లడిస్తూ హాల్‌వేల్ రచించిన గ్రంథం పేరు ఏమిటి?
ఎ. గ్రీన్‌హోల్ ట్రాజెడీ బి. స్మాల్‌హోల్ ట్రాజెడీ
సి. డార్క్‌హోల్ ట్రాజెడీ డి. బ్లాక్‌హోల్ ట్రాజెడీ

12. సిరాజుద్దౌలా పాలకుడిగా ఉన్న కాలంలో బ్రిటీషు గవర్నర్ ఎవరు?
ఎ. రాబర్ట్ క్లైవ్ బి. హాల్‌వేల్
సి. జాన్ డ్రక్ డి. విలియం ఫోర్డ్

13. సిరాజుద్దౌలా ధాటికి తట్టుకోలేమని జాన్ డ్రక్ ఏ దీవికి పారిపోయాడు?
ఎ. అండ్‌మాన్ నికోబార్ దీవులు బి. ఫ్లూటాన్ దీవులు
సి. లక్ష దీవులు డి. పైవేవీ కావు

14. రాబర్ట్ క్లైవ్ లంచమిచ్చి లొంగదీసుకున్న సిరాజుద్దౌలా సేనాని ఎవరు?
ఎ. మీర్ జాఫర్ బి. మాణిక్ చంద్
సి. ఆమీన్ చంద్ డి. ముర్షిద్‌ఖాన్

15. రాబర్ట్ క్లైవ్, సిరాజుద్దౌలా మధ్య జరిగిన సంధి పేరు ఏమిటి?
ఎ. చంద్రానగర్ సంధి బి. ఆలీనగర్ సంధి
సి. కలకత్తా సంధి డి. పైవేవీ కావు

సమాధానాలు

1.సి	2.ఎ	3.ఎ	4.డి	5.ఎ	6. బి
7. సి	8. ఎ	9. బి	10.బి	11. డి	12.సి
13. బి	14. ఎ	15. బి			

జవహర్ నవోదయ స్కూళ్ల ప్రవేశాలకు నోటిఫికేషన్

JNVST 2024: జవహర్ నవోదయ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ వచ్చేసింది

JNVST 2024: దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ అప్పుడే మొదలైపోయింది. పూర్తి వివరాలివే..

ఢిల్లీ: దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో (JNV) ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ వచ్చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశంలోని 649 జేఎన్‌వీల్లో సీట్ల భర్తీకి రెండు విడతల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా నవంబర్ 4(శనివారం) ఉదయం 11.30గంటలకు పర్వత ప్రాంతాల్లోటీ 2024 జనవరి 20 (శనివారం) తేదీన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ప్రవేశ పరీక్ష (Jawahar Navodaya Vidyalaya selection test) నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఆగస్టు 10వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

అర్హత: ప్రవేశానికి అర్హత పొందాలంటే విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాల్లో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయించారు. వారు 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లోనే చదివి ఉండాలి. మిగిలిన 25శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు.

వయసు: దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మే 1, 2012 నుంచి జులై 31, 2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలి.

ప్రవేశ పరీక్ష: జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్షలో వచ్చే మార్కులు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు(మెంటల్ ఎబిలిటీ, అరిథ్‌మెటిక్, లాంగ్వేజ్) ఉంటాయి. మొత్తం 80 ప్రశ్నలు 100 మార్కులకు 2 గంటల సమయంలో ప్రవేశ పరీక్ష ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో JNV అధికారిక వెబ్‌సైట్ https://navodaya.gov.in/nvs/en/Home1 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీంతో పాటు అభ్యర్థి ఫొటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/ నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు. రెండు విడతల్లో నిర్వహించే ఈ పరీక్ష ఫలితాలను వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో విడుదల చేసే అవకాశం ఉంది.లి

పరీక్ష ఇలా..

నిర్ణీత తేదీల్లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు రెండు గంటల పాటు జరిగే ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మొత్తం 80 ప్రశ్నలు ఇస్తారు. దీంట్లో మెంటల్ ఎబిలిటీ నుంచి 40 ప్రశ్నలకు 50 మార్కులు ఉంటాయి. దాంతో పాటు అర్థమెటిక్ నుంచి 20 ప్రశ్నలకు 25 మార్కులుటీ లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలకు 25 మార్కుల చొప్పున ఇస్తారు. మెంటల్ ఎబిలిటీకి గంట సమయం ఉండగా.. మిగతా రెండింటికీ చెరో అర్ధగంట పాటు సమయం ఇస్తారు.

ఐఎఫ్ఎస్ ఆలిండియా టాపర్‌గా బాపట్ల యువకుడు





- తెలంగాణ యువతికి 48వ ర్యాంకు

నవతెలంగాణ-న్యూఢిల్లీ: ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) ఫలితాల్లో తెలుగు అభ్యర్థులు సత్తాచాటారు. 2022 సంవత్సారా నికి గానూ నిర్వహించిన ఐఎఫ్ఎస్ ఫలితాలను యూపీఎస్సీ శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన కొల్లూరు వెంకట శ్రీకాంత్ ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. హైదరాబాద్‌కు చెందిన పన్నాల సాహితీరెడ్డి 48వ ర్యాంకు, తొగరు సూర్యతేజ 66వ ర్యాంక్ సాధించారు. కాగా గత ఏడాది నవంబర్ 20 నుంచి 27 వరకు ఐఎఫ్ఎస్ రాత పరీక్ష నిర్వహించగా, ఈ ఏడాది జూన్‌లో ఇంటర్వ్యూలను పూర్తి చేసిన యూపీఎస్సీ ఇవాళ తుది ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 147 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. మరో 12 మందిని తాత్కాలికంగా ఎంపిక చేసింది.

గేమింగ్‌లో ఆధునిక యుగాన్ని పరిచయం చేసిన శాంసంగ్

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ 2023 శ్రేణి ఒడిస్సీ జీ 9 ఓఎల్ఎస్ఈడీ గేమింగ్ మానిటర్స్ ను ఆరంభించింది. నియో క్వాంటమ్ ప్రాసెసర్ దీనికి మద్దతు చేస్తోంది. ఒడిస్సీ జీ 9 డిస్ ప్లే హెచ్ డీఆర్ ట్రూ బ్లాక్ 400తో పవర్ తో పనిచేసే గేమింగ్ మానిటర్. ఈసందర్భంగా శాంసంగ్ ఇండియా కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఎంటర్ ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ సేథీ మాట్లాడుతూ... కొత్త గేమింగ్ మానిటర్స్ శ్రేణితో, భారతదేశంలో ఓఎల్ ఈడీ గేమింగ్ కొత్త యుగాన్ని పరిచయం చేయడానికి తాము గర్విస్తున్నామన్నారు. అత్యంత అనుభవ జ్ఞులైన గేమర్స్ డిమాండ్స్, అంచనాలకు అనుగుణంగా ఉండటానికి తాము జీ 9 సీరీస్ ను ఆధునిక టెక్నాలజీతో, గొప్ప ఫీచర్స్ తయారు చేశామన్నారు. నియో క్వాంటమ్ ప్రాసెసర్ ప్రోతో మద్దతు చేయబడిన, ఒక వివరణాత్మకమైన, స్పష్టమైన డిస్ ప్లే, సాటిలేని గేమింగ్ ఫీచర్స్ మద్దతు చేయబడిన ఓఎల్ఈడీ జీ9 సీరీస్ భారతదేశంలో వాస్తవంగా ఓఎల్ఈడీ స్థాయిని పెంచిందన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో విలీనం అవుతున్న హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అవసరమైన అందరు వాటాదారులు, నియంత్రణ సంస్థల అనుమతులు పొందిన తరువాత, భారతదేశంలోని ప్రధాన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనాన్ని విజయవంతంగా పూర్తి చేశామని ప్రకటించింది. విలీనం పూర్తయిన సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిఇఒ అండ్ ఎండి శశి జగదీషన్ మాట్లాడుతూ... ఇది తమ ప్రయాణాన్ని నిర్వచించే సంఘటన, తమ సంయుక్త శక్తి ఆర్థిక సేవల సమగ్ర పర్యావరణ వ్యవస్థను రూపొందించేందుకు తమకు సహాయ పడుతుందని తాను విశ్వసిస్తున్నానన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ప్రతిభావంతులైన బృందాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కుటుంబంలోకి స్వాగతిస్తున్నందుకు తాము నిజంగా సంతోషిస్తున్నామన్నారు. తమ ప్రయాణంలోకి చురుకుదనం, అనుకూలత, అలవర్చుకునే గుణాన్ని కలిగిన శ్రేష్ఠతతో నిర్వచించబడుతుందని తాను విశ్వసిస్తున్నా నన్నారు. తాము ముందున్న మార్గాన్ని నావిగేట్ చేస్తున్నప్పుడు తాము సవాళ్లను అవకాశాలుగా స్వీకరిస్తామన్నారు. తమ అనుభవాల నుంచి నేర్చుకుంటూ, ఆర్థిక సేవలపరిశ్రమలో విజయం, సమగ్రతకు ప్రమాణంగా ఉండటానికి ప్రయత్నిస్తామని తెలిపారు.

నేడు కాంగ్రెస్ 'గర్జన'

- నేడు కాంగ్రెస్ లో చేరనున్న పొంగులేటి
- భట్టీ పీపుల్స్ మార్చ్ ముగింపు కూడా..
- సభకు రానున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- 5 లక్షల మంది జనసమీకరణకు ప్రణాళిక
- ఆటంకాలు కల్పిస్తున్నారని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం
- అదేమీ లేదంటున్న బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఖమ్మంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ జన గర్జన సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరికతో పాటు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సభకు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం హాజరవుతోంది. రాష్ట్రంలో ఎన్నికలకు ఈ మీటింగ్ ను శంఖారావంగా భావిస్తుండడంతో భారీ ఎత్తున జనసమీకరణకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు అడుగడుగునా ఆటంకాలు సష్టించేందుకు అధికార పార్టీ ప్రయత్నం చేస్తోందని పొంగులేటి మండిపడ్డారు. పొంగులేటి అనుచరుల్లో ఇద్దరిని చంపుతామని హెచ్చరిస్తూ వెలువడిన పోస్టర్ కలకలం సష్టిస్తోంది. దీనిని బీఆర్ఎస్ నేతలు ఖండించారు. సిపి విష్ణు ఎస్ వారియర్ సైతం దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆర్టీసీ బస్సులకు నో.. అన్నీ ప్రైవేట్ వాహనాలే..!

జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని అభ్యర్థించినా... నిరాకరించడంతో ప్రైవేట్ వాహనాలను సమకూర్చుకున్నట్లు పొంగులేటి చెప్పారు. ఆ వాహనాల యజమానులను కూడా భయాందోళనకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మీటింగ్ ఏర్పాటు నిర్ణయం తీసుకున్న తర్వాత 1300 బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులను అడగ్గా, రూ.1. 90 కోట్లు కట్టాలని చెప్పారని, ఆ తర్వాత రోజు డబ్బులు కట్టేందుకు వెళ్లినా బస్సులు లేవంటూ తిరస్కరించారని అన్నారు. గత్యంతరం లేని స్థితిలో సమీపంలోని జిల్లాల నుంచి ప్రైవేట్ వాహనాలను సిద్ధం చేశామన్నారు. డీసీఎంలు, దోస్త్ వాహనాలు, ట్రాలీ ఆటోల ద్వారా జనసమీకరణ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాను ఆనుకొని ఉన్న ఏపీలోని జిల్లాల నుంచి కూడా ప్రైవేట్ వాహనాలను రప్పిస్తున్నారు. వీటితో పాటు కార్లు, సొంత వాహనాల్లో వచ్చే ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా నియోజకవర్గాల నేతలకు సూచించారు. 2500కు పైగా ప్రైవేట్ వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ బహిరంగ సభ సందర్భంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు, పోస్టర్లు భారీగా వేశారు. సర్కిళ్లలో రౌండ్ ఫ్లెక్సీలతో పాటు సిటీ మొత్తం భారీగా ప్రచారం చేస్తున్నారు. ఆటోల్లో మైకుల ద్వారా గ్రామాల్లో పబ్లిసిటీ చేస్తున్నారు. ఇక సభా ప్రాంగణంలో రాహుల్ గాంధీ, ఖర్గే, మాణిక్ ఠాక్రే, భట్టి విక్రమార్క, పొంగులేటి, రేవంత్ రెడ్డిల నిలువెత్తు హోర్డింగ్ లను ఏర్పాటు చేశారు. వైరా రోడ్ లో భట్టి పాదయాత్ర ఫ్లెక్సీలు, బైపాస్ రోడ్ లో పొంగులేటి ఫ్లెక్సీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పొంగులేటి కాంగ్రెస్‌లో జాయినింగ్..

తెలంగాణ జనగర్జన సభ వేదికగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. రాహుల్ గాంధీ సమక్షంలో తన ముఖ్య అనుచరులతో పాటు హస్తం తీర్థం పుచ్చుకోనున్నారు. జనవరి 1న బీఆర్ఎస్ పై విమర్శలతో ఎదురుదాడి ప్రారంభించిన పొంగులేటి, ఈ ఆర్నెళ్లలో బీజేపీ, కాంగ్రెస్, వైఎస్ఆర్ టీపీలో చేరతారని, సొంత పార్టీ పెడతారని.. పలు ప్రచారాలు తెరపైకి వచ్చాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నారు. వారం రోజుల క్రితం ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టుగా ప్రకటించారు. ఇప్పుడు తన సొంత స్థలంలోనే భారీగా ఏర్పాటు చేస్తున్న ఈ పబ్లిక్ మీటింగ్ తో కాంగ్రెస్ కండువా కప్పుకుంటారు. ఆయనతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరు బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు, మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సహా పలువురు లీడర్లు కాంగ్రెస్ లో చేరబోతున్నారు.

ఖబర్దార్ పొంగులేటి..! పోస్టర్ కలకలం..

ఖమ్మంలో పొంగులేటి అనుచరులను హెచ్చరిస్తూ వెలిసిన పోస్టర్ శనివారం కలకలం సష్టించింది. ఖబర్దార్ పొంగులేటి అంటూ ఆయన ప్రధాన అనుచరులు మువ్వా విజయ్ బాబు, చీకటి కార్తీక్ లకు వార్నింగ్ ఇస్తూ 'మీ శవాలు కూడా దొరకవు' అని మంత్రి అజయ్ అనుచరుల పేరుతో పోస్టర్ వెలిసింది. దీనిపై పొంగులేటి తీవ్రంగా స్పందించారు. తన కార్యకర్తలను ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటానని, బెదిరింపులకు భయపడేది లేదని అన్నారు. కొంత మంది అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారని సీరియస్ అయ్యారు. మరోవైపు ఈ పోస్టర్ వ్యవహారంపై సాయంత్రానికి ఖమ్మం పోలీస్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టర్ వెలిసినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, పోస్టర్లకు సంబంధించి తమకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేందుకు సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పోలీస్ శాఖలో ప్రాణహాని ఉన్న వారి జాబితాలో మువ్వా విజయ్ బాబు పేరులేదని స్పష్టం చేశారు. మరోవైపు సాంకేతిక కారణాల పేరుతో కొన్ని డివిజన్లలో నీటి సరఫరా నిలిపివేసినట్లు ప్రచారం జరుగుతోంది. రేపు సాయంత్రం సభా సమయం లో నీటిని విడుదల చేసి.. సభకు ఆటంకం కల్పించేందుకు అధికార పార్టీ నేతలు ఉన్నట్లు పొంగులేటి వర్గీయులు చెబుతున్నారు. దీనిని బీఆర్ఎస్ నేతలు ఖండించారు. జరుగుతున్న పరిణామాలపై ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.



ద్వైపాక్షిక సంబంధాలకు నూతన శిఖరాలకు తీసుకెళ్లిన మోడీ అమెరికా పర్యటన

- అసోచామ్

నవతెలంగాణ - హైదరాబాద్



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన భారత్-అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలను నూతన శిఖరాలకు తీసుకెళ్ళింది. ద్వైపాక్షిక సంబంధాలకు అపారమైన అవకాశాలకు మార్గం సుగమం చేసింది. ఇండో-యు.ఎస్ గ్లోబల్ ఛాలెంజ్ ఇన్స్టిట్యూట్లు ప్రారం భాన్ని వారు స్వాగతించారు. ఈసంద ర్భంగా అసోచామ్ ఏపీ అండ్ తెలంగాణ చైర్మన్ కటారు రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి పర్యటన, వేగంగా మారుతున్న ప్రపంచ క్రమంలో భారత్-అమెరికా సంబంధాలలో ఒక ముఖ్యమైన కార్యక్రమంగా పరిగణించబడుతోందన్నారు ఇది సాంకేతిక, శాస్త్రీయ, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్ సెక్టార్ల పటిష్టతకు, ప్రపంచ వాతావరణ లక్ష్యాలను సాధించడంలో అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో వ్యూహాత్మక పరాక్రమంతో రెండు దేశాలు అత్యంత ప్రభావవంతమైన ఆర్థిక వ్యవస్థలుగా ఎదగడానికి సహాయప డతాయన్నా రు. యునైటెడ్ స్టేట్స్, భారతదేశం మన ఆర్థిక వ్యవస్థలను డీకార్బనైజ్ చేయడానికి, క్లీన్ ఎనర్జీని అమలు చేయాలనే ఉమ్మడి లక్ష్యం పంచుకుం టా యన్నారు. వాతావరణ భద్రతను బలోపేతం చేయడానికి, పౌర అణుశక్తి శాంతియుత ఉపయోగా లను విస్తరించడానికి, వాతావరణ ఆర్థిక పరిష్కారాలను అన్లాక్ చేయడానికి, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకరించడానికి, భవిష్యత్తు స్వచ్ఛమైన ఇంధన ఆర్థిక వ్యవస్థను రూపొందించడానికి అవసరమైన వనరులను సమీకరించడానికి వారు కలిసి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి, అమలు చేయడానికి ఒకరినొకరు సహకరించుకుంటున్నారన్నారు.

ఆరుగురు విద్యార్థులకు గ్లోబల్ సిటిజన్ స్కాలర్షిప్

నవతెలంగాణ - హైదరాబాద్



గ్లోబల్ ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్ (జీఐఐఎస్) ఫ్లాగ్షిప్ ప్రోగ్రామ్ అయిన గ్లోబల్ సిటిజన్ స్కాలర్షిప్ (జీసీఎస్) 16వ ఎడిషన్ కోసం భారతదేశం నుండి ఆరుగురు, ఇతర దక్షిణాసియా దేశాల నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక స్కాలర్షిప్‌పై ఆసక్తిని కనబరిచిన 14,000 మంది విద్యార్థుల నుండి ఈ విద్యార్థులు ఎంపిక చేయబడ్డారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి, గ్లోబల్ స్కూల్స్ ఫౌండేషన్ ఇండియా డైరెక్టర్ ఆశిష్ తిట్టేవాల్ మాట్లాడుతూ... ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ సిటిజన్ స్కాలర్షిప్లో భాగమైనందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తాను అభినందిస్తున్నానన్నారు. తమ అత్యాధునికమైన సింగపూర్ స్మార్ట్ క్యాంపస్లో చదువుకోవడం వారి అకడమిక్, వ్యక్తిగత ఎదుగుదలకు కొత్త అవకాశాలను తెరిచి జీవితాన్ని మార్చే అనుభవంగా ఉంటుందని తాను భావిస్తున్నానన్నారు. జీసీఎస్ ప్రోగ్రామ్ ప్రతిభావంతులైన విద్యార్థులకు గొప్ప అంతర్జాతీయ ఎక్స్పోజర్ను అందించడానికి ఉద్దేశించబడిందన్నారు. సింగపూర్ లోని గ్లోబల్ స్కూల్స్ ఫౌండేషన్లోని అకడమిక్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ ప్రమోద్ త్రిపాఠీ మాట్లాడుతూ... భవిష్యత్ సాంకేతికతలను స్వీకరించడంలో తాము అగ్రగామిగా ఉన్నామన్నారు. ఉన్నత-నాణ్యత జ్ఞానాన్ని అందించడంలో, విభాగా లను బలోపేతం చేయడంలో, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలను మెరుగు పరచటంలో తాము ముందున్నామన్నారు. తమ విద్యార్థులు అకడమిక్ ప్రావీణ్యాన్ని ప్రదర్శిసా రన్నారు. జీవిత నైపుణ్యాలలో రాణిస్తారని అన్నారు.